గురువులు

# స్వామి దయానంద



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఋజుసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

జాతీయ జీవిత చరిత్ర గ్రంథమాల

# స్వామి దయానంద

రచన
బి.కె. సింగ్

అనువాదం
పన్నాల సుబ్రహ్మణ్య భట్టు

నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా

# విషయసూచిక


| | | పేజి |
|---|---|---|
| | ప్రస్తావన | vii |
| | ముందుమాట | ix |
| 1. | గత చరిత్ర | 1 |
| 2. | బాల్యం నుండి జిజ్ఞాసువు | 7 |
| 3. | జ్ఞానాన్వేషణ | 16 |
| 4. | కోలాహలం మధ్య | 27 |
| 5. | హేతువాదం - అంధ విశ్వాసం | 43 |
| 6. | ఫ్యూడల్ శక్తులతో పోరాటం | 57 |
| 7. | సేవా వేదికపై త్యాగం | 64 |
| 8. | ఆశలు - కలలు | 72 |
| 9. | వ్యక్తిత్వం - పనులు | 92 |

# ప్రస్తావన

19వ శతాబ్దాన్ని మనదేశ సాంస్కృతిక పునరుజ్జీవన కాలంగా భావించవచ్చు. నిజం చెప్పాలంటే స్వాతంత్ర్యంకోసం అధికారాల కోసం మనకున్న హక్కులను తెలియ పరచిన జాతీయోద్యమం ప్రారంభమయినది సాంస్కృతిక పునరుజ్జీవనంతోనే. అలా జరగాలి కూడా. ఉత్తర భారతదేశంలో శతాబ్దాల ముస్లిం పాలనానంతరం ఆంగ్లేయ పాలన వచ్చాక భారతీయ సంస్కృతికి, ధర్మానికీ మరీ గట్టి దెబ్బ తగిలింది. సాంస్కృతిక విలువల నిచ్చే వెలుగు క్షీణిస్తూ కొడిగట్టిపోసాగింది. ప్రజలలో ఆత్మవిశ్వాసం నశించసాగింది. వారిలో హీనమైన భావాలు పెరగసాగాయి. విదేశీ వస్తువులే - అవి ఉత్తర దిశనుండి వచ్చినా, పశ్చిమ దిశనుండి వచ్చినాసరే - అన్నిటికన్నా మిన్నగా వుంటాయని వారు తమకు తెలియకుండానే ఎంచసాగారు.

సాంస్కృతిక పునరుజ్జీవనమే ఈ దుర్దశకి చికిత్స. రాజకీయోద్యమానికి ముందుగా అది రావలసిందే. సాహసం, నిష్ఠ, ఆత్మవిశ్వాసంగల రాజకీయోద్యమాన్ని దానిమీదనే నిలబెట్టగలరు.

ఈ మహా సాంస్కృతికోద్యమాన్ని మలుపుతిప్పిన ప్రముఖులలో స్వామి దయానంద కూడా వున్నారు. క్రైస్తవ మిషనరీల ద్వారా, ఇతరులద్వారా, హిందువులపై తెస్తున్న ఒత్తిడుల వల్ల బహుశా - ఆర్యసమాజం తన ఉద్యమాన్ని ప్రచారాన్ని తీవ్రం చేసి వుండవచ్చు. అందువల్లనే దయానంద వివాదాస్పదమైన వ్యక్తిగా కనబడినా అయనను ఒక సంప్రదాయ వ్యవస్థాపకుడిగా మాత్రమేగాక, గొప్ప సంస్కర్తగా సాంస్కృతిక పునరుజ్జీవన మార్గదర్శిగా గుర్తుంచు కోవాలి.

కుల మత భేదాలు పోవాలనీ, విధవా పునర్వివాహాలు జరగాలనీ, హిందీ జాతీయ భాషగా రావాలనీ ఆయన ఆ రోజుల్లోనే కృషి సలిపారు. అప్పటికవి రాజకీయ నాయకుల మనసులలో తలపెత్తని విషయాలు. అస్పృశ్యతకి వ్యతిరేకంగా పోరాడటానికి స్త్రీల పురోగతికి, హిందీ భాషని అంతర్ రాష్ట్రభాషగా రూపొందించడానికి గాంధీవలె

దయానంద కూడా అగ్రేసరులు. ముఖ్యంగా పశ్చిమోత్తర ప్రదేశ్‌లోనూ, పంజాబులోను, జాతీయోద్యమం ఆరంభమయిన తొలి దశాబ్దాలలో హిందువులలో సగానికి సగంపైగా, స్వామీజీని అనుసరించే వారుగా, లేదా శ్లాఘించే వారుగా వుండే వారని కొందరు మరచి పోతుంటారు. ఆయన ప్రచారం చేసిన విశిష్టధార్మిక సిద్ధాంతాల కంటె ఆయన లేవనెత్తిన సాంస్కృతిక సాంఘిక మహోద్యమమే ఇందుకు కారణం.

ఇదే ఆయనకి ఒక జాతీయ వ్యక్తిత్వాన్ని సముపార్జించి పెట్టింది. అందుకే ఆయన కథని జాతీయ జీవిత చరిత్రల మాలలో చేరుస్తున్నాం. హిందూ సమాజాన్ని తిరిగి జీవింపచేసి, గట్టి పునాదిపై నిలబెట్టాలని ప్రచారంచేసి నిలబెట్టిన ఆయన పాత్ర మరువరానిది. ధార్మిక మార్గంలో అయన కట్టిన విశాలమైన కోటవలన ఆయన నిర్వహించిన గొప్ప పాత్ర మనం కళ్ళుమూసుకున్నా చెరిగిపోదు.

బి.కె. సింహాగారు రచించిన ఈ జీవితచరిత్రలో దయానంద జీవితంలోని అన్ని ముఖాలు చూపించే ప్రయత్నం చేశారు. మనదేశ సాంస్కృతిక పునరుజ్జీవనానికి పాటుపడిన అతి తేజోమూర్తి చేసిన కార్యాలను సరైన వెలుగులో దర్శింపచేసే యత్నమే ఇది.

న్యూఢిల్లీ -బాలకృష్ణ కేస్కర్

తేది : జనవరి 9, 1970

# ముందుమాట

స్వామి దయానంద జీవితాన్ని, ఆయన చేసిన పనులని విమర్శనాత్మకంగా వివరించి బేరీజు వేసే చిన్న ప్రయత్నమే ఈ పుస్తకం. ఆయన చేసిన అనేకానేక కార్యాలకు, అవసరమైన దానికంటె ఎక్కువ ప్రశంసించకుండా, అవసరానికి మించి విమర్శించకుండా వుండాలని శ్రద్ధ వహించాను.

తక్కువ పేజీలతో పుస్తకం తేవాలనే దృష్టితో దయానంద జీవితంలోని సామాన్య విశేషాలనే ఇందులో పొందుపరిచాను. ఆయన జీవితంలోని ముఖ్య సంఘటనలను, ఆయన చేసిన ప్రసంగాలను 19వ శతాబ్దపు భారతదేశ నేపథ్యంలో వుంచి వాటి గొప్పతనాన్ని చాటే ప్రయత్నం చేశాను.

ఈ బాధ్యతను నిర్వర్తించటంలో నాకు శ్రీమతి శారదాకుమారి సింహ నిత్యమూ ప్రోత్సాహాన్నిచ్చింది. శ్రీ బిహారిలాల్ వ్యాస్ దయానందకు సంబంధించిన అన్ని పుస్తకాలను పత్రికలను, విశేషాలకు ఉపయోగపడేలా నాకు అందించి సహాయపడ్డారు. భాషా విషయకంగా ప్రొఫెసర్ సి.ఆర్.గుప్త ఎంతో సహాయాన్ని అందించారు. వీరందరికీ నా కృతజ్ఞతలు.

భోపాల్, -బి.కె. సింహ

1 డిసెంబరు 1969

1

# గత చరిత్ర

నరసీమోహతా, స్వామి దయానంద, గాంధీ పుట్టిన సౌరాష్ట్ర గతం ఎంతో గొప్పది. భారతీయ సంస్కృతికి పుట్టిల్లని చెప్పవచ్చు. అది మానవుని అడుగు జాడలు భారతదేశమంతా వ్యాపించినా, సంస్కృతి ప్రథమారుణ కిరణాలు బహుశా సౌరాష్ట్రంలోనే ఉదయించి వుంటాయి. ఈ భూ భాగంలోనే హరప్పా నాగరికత పుష్పించి వికసించి మట్టిలో కలిసిపోయింది. ఇక్కడే కృష్ణ భగవానుడూ, మిహిర భోజుడూ రాజ్యమేలారు. ఇక్కడే వల్లభ, ప్రతిహార, చాళుక్య, సోలంకీ రాజ్యాలు వెలిశాయి. శక్తివంతమైన భోగభాగ్యాలతో తులతూగాయి. ఈ తీరానే మొడేరా సూర్యమందిరం, ప్రభాసపాటనుని సోమనాథాలయం ఇప్పటికీ సౌరాష్ట్ర గొప్పతనాన్ని గానం చేస్తున్నాయి.

సౌరాష్ట్ర సాగర తీరం ఎంతో పొడవైంది. ఈ తీరాన వెలసిన ఎన్నో మంచి మంచి ఓడరేవుల నుంచి సరుకు పశ్చిమాసియా ప్రాంతాలకు, తూర్పు యూరపు దేశాలకు చేరేది. అందుచేత ఆదినుంచి సౌరాష్ట్ర సిరిసంపదలతో విలసిల్లింది, పేరు పొందింది. ఇక్కడి ప్రజలకి మతమన్నా అధ్యాత్మికతన్నా ఎంతో భక్తి శ్రద్ధలుండేవి. ఈ రాష్ట్రం 13వ శతాబ్ది అంతానికి మాత్రమే, ముసల్మానుల ఏలుబడిలోకి వచ్చినా, వ్యాపార రీత్యా ఏడు, ఎనిమిది శతాబ్దాల నుంచి వీరితో సంబంధముంది. సౌరాష్ట్రంపై వారి అధికారం అయిదు శతాబ్దాలు స్థిరంగా సాగింది. తర్వాత సౌరాష్ట్ర ఆంగ్లేయుల పాలనలోకి వచ్చింది. ఇలా ఆనాటి ప్రపంచ రాజకీయాలకు కేంద్రమైన పశ్చిమాసియాకి దగ్గరగా వుండటంవల్ల మిగతా భారతదేశంతో పోల్చి చూస్తే, సౌరాష్ట్రం చాలాకాలంగా బానిసగా వుండాల్సి వచ్చింది. జన సామాన్యంపై ఈ మార్పుల ప్రభావం ఏమాత్రం వుండేది కాదు. కనుక అలా జరిగింది. ఏక్రొత్త ప్రభుత్వమో దృఢంగా రాజ్యమేలే శక్తి కలిగి వున్నంత కాలం ప్రజల రాజభక్తిపై పూర్తిగా ఆధార పడేది. ఇంకో రకంగా మార్పు జరిగేది కాదు. కాని ఈస్టిండియా కంపెనీ వారి జీతగాళ్ళు అనాగరికులను నాగరికులుగా మార్చడానికి

తెల్లవారి నెత్తిమీద వచ్చిపడ్డ బరువు దించడానికి వచ్చారు మరి. వీరి ఆక్రమణతో సామంతుల కోటలు ఒక్కొక్కటే కులాయి.

పరస్పర విరోధులై విచ్చలవిడిగా వున్న రాష్ట్రాలు కలిసి రాజకీయ సంఘటిత శక్తిగా రూపొందినా తమ సైనిక రీతుల బలంతో మురిగిన సాంఘిక వ్యవస్థతో, వెనుకబడిన ఆర్థిక రంగం సహాయంతో -- తూర్పు దిశనే సభ్య లోకంగా తీర్చిదిద్దాలన్న ఉదాత్తమైన కోరికతో ప్రేరితులై పోరాడుతున్న వారితో వీరు ఎలా తలపడగలరు ?

ఆంగ్లేయుల జాతకం బాగుంది, దేశానికి రాగల విపత్తు నూహించగల మేధావి వర్గం కానీ, మేలుకున్న మధ్య తరగతివారు కానీ ఈ దేశంలో లేకపోయారు.

ఇంగ్లాండు రాజు మొదటి ఛార్లెస్ పార్లమెంటును కాదని తన యిష్టమొచ్చినట్లు ప్రవర్తించడంతో 1641లో ఆయనకి ఉరిశిక్ష విధించారని భారతదేశంలో ఎవరికీ తెలియలేదు. ఫ్రెంచి విప్లవాన్ని అణగ దొక్కడానికి ప్రయత్నించడం వల్ల (లూయీ) రాజుతల పదహారవ ఏటనే నరికివేశారని ఎవరికైనా తెలిసిందా ? అలాగే, ఇటలీ, గ్రీసు దేశాలలో స్వతంత్రం కోసం వీరోచిత పోరాటాలు జరుగుతుండేవని తెలుసా ? భారత ప్రజలు చిన్నచిన్న రాజ్యాలుగా విడిపోయారు. వారి దృష్టి అంతా తమ తమ రాజ్యాల సరిహద్దుల మేరకే పరిమితమయింది. కలలోనైనా, ఎవ్వరూ ఐక్య భారతదేశాన్ని వూహించేవారు కాదు. గతించిన చక్రవర్తుల జ్ఞాపకాలు కాలగర్భంలో కలిసిపోయాయి. విన్సెంట్ స్మిత్ మాటల్లో చెప్పాలంటే --- "ఏరకమైన ఆనందం, ఆశ పొందకుండానే ప్రజలు ఆంగ్లేయుల పాలననీ ఆధిపత్యాన్ని అంగీకరించారు. ఎప్పుడు అగుతుందో తెలియని అరాచకం కంటే ఈ పాలన చెడ్డదికాదని నిశ్శబ్దంగా సహించారు."

బయటి ప్రపంచంతో భారతీయులకుండే సంబంధం పూర్తిగా తెగిపోయింది. లౌకిక మానసిక క్షేత్రాలలో యూరోపు సాధించిన ప్రగతి భారతదేశానికి తెలియనే తెలియదు. విదేశాలకు వెళ్ళడం నిషిద్ధం - ఎవరైనా వెళితే కుల భ్రష్టులయ్యే ప్రమాదం కొని తెచ్చుకున్నట్లే. జ్ఞానవు ప్రాచీన భాండాగారాన్ని అందిచ్చేదే సంస్కృతని గమనించకపోవటంతో భారతీయుల గొప్పతనాల గత కాలపు స్మృతి కూడా క్షీణించసాగింది. నాగరికతకీ, సంపూర్ణజ్ఞానికీ పశ్చిమ దేశాలే నెలవనీ, ప్రగతికి అవే మూలమనీ భారతీయ మేధావి వర్గం భ్రమ జాలంలో చిక్కుకుంది. భారతీయుల ప్రాచీన చరిత్ర, సంస్కృతి ఎంతో నిగూఢమైనవి. దాని సంప్రదాయ మెంత సమృద్ధమో ఎవరికీ అక్కర లేకపోయింది.

చివరికి ఇక్కడి నదీనదాలు, పర్వతాలు, దూరాలను కలిపే మైదానాలు, పీఠ

భూములు, ఇలా సువిశాలమైన వ్యాపించిన భౌగోళిక సీమలు సహితం ప్రజలను చైతన్యవంతులుగా చేయలేకపోయాయి.

రాజకీయ చైతన్యం లోపించడం వల్ల సాంఘికంగా వెనుక పడటంవల్ల సామాన్య ప్రజలు తమ సంకుచిత స్వార్థం కోసం చూశారే తప్ప భవిష్యత్తుకి బలమైన బాటలు వేద్దామనుకోలేక పోయారు. దేశానికి వెన్నెముక విరిగింది. ఇప్పట్లో లేచి నిలబడుతుందనిపించలేదు.

ఆర్థికంగా చూస్తే దేశం నరకాన్ని తాకింది. దేశమంతా సామ్రాజ్య వాదుల ప్రాబల్యమే. రోజురోజుకీ పెరుగుతున్న భూమి శిస్తు భారంతో రైతులు గోల పెట్టేవారు. పన్నులు వసూలు చేయటమే ఆంగ్లేయుల పని. ధనాశతో హెచ్చు శిస్తు వసూలు చేస్తూండే వారు. రైతులను ఎంత ఎక్కువ పీడించి శిస్తు వసూలు చేస్తే అంత ప్రోత్సాహం జమీందారులకుండేది.

అలా పరులను పీడించే చక్రం నడుస్తూనే వుండేది. గ్రామాలలో తీర్పు చెప్పే పంచాయతీలు శిథిలమయి, వాటి స్థానే వచ్చిన తెల్లదొరల కోర్టులు అచిర కాలంలోనే మోసాలకూ, అన్యాయానికి నెలవు లయ్యాయి. ప్రోత్సాహం లేక కుటీర పరిశ్రమలు దెబ్బతిన్నాయి. దేశంలో విలువైన ముడి సరుకులు ఇంగ్లాండులోని కర్మాగారాలకు తరలించేవారు. లాభదాయకమైన వృత్తుల స్థానంలో దొరికిన క్రొత్త పనులవల్ల నిశ్చింతగా పొట్ట పోసుకునే అవకాశం లేదు. ఆంగ్లేయులు అడుగు పెట్టిన చోటల్లా, ఉప్పు, మత్తు మందు వ్యాపారాలపై గుత్తాధిపత్యం చెలాయించేవారు. ఫలితంగా అరాచకం, అవ్యవస్థ వ్యాపించ సాగింది. విన్సెంట్‌స్మిత్ ఈ స్థితిని బాగా చిత్రించాడు. "ఇక పైకి వస్తామనే ఆశ రైతులకు లేక పోయింది. పైగా తమని బాగా దోచేస్తారనే భయం పట్టుకొంది. దీనికి తోడు దొంగల ముఠాలు ఎప్పుడు దాడి చేస్తాయో, ఏ బాధలు పెడతారో చంపేస్తారో, అనే భయం ఎప్పుడూ వుంటూనే వుండేది. బందిపోటుల గుంపో, పిండారీల దండో తగిలే ప్రమాదంతో బాటు అధికారుల దోపిడీకి గురయ్యే స్థితి వ్యాపారస్థులకు తప్పేదికాదు. స్థానిక అధికారులకి చెల్లించిన పన్నుకే దిక్కుండేది కాదు. ఆ రోజుల్లోనే జమీందారుల, ఎస్టేటుదారుల రూపంలో పీడించే వర్గం ఒకటి, కొత్తగా మన దేశంలో తలెత్తింది. అంతటా ఆరాచకం. ఏమి జరుగనున్నదో ఎవరికీ తెలియదు.

19వ శతాబ్దపు ఆ ఆరంభ కాలంలో రైతులను తమ చెప్పుచేతల్లోకి తెచ్చుకోవటం ఆంగ్లేయులకి అంత తేలికగా కనబడలేదు. అలా, దోపిడీలతో దురంతాలతో బాగా పేరు గడించిన జమీందార్లు ఈనాందార్లు ఆవిర్భవించారు.

అనాటి సాంఘిక పరిస్థితులు మరీ ఘోరంగా వున్నాయి. వర్ణాశ్రమ ధర్మాల మీద ఆధారపడిన సాంఘిక వ్యవస్థ ఎన్నో నేరాలకీ అన్యాయాలకీ సాయపడింది. సమాజాన్ని బలంగానూ, స్థిరంగాను వుంచటానికి వర్ణాశ్రమ వ్యవస్థ పనికి రాకపోగా అంతర్ విరోధాల వలన శాంతికీ ప్రగతికీ అవసరమైన సమర సభావానికి ముప్పు వాటిల్లింది.

అగ్ర కులాలకున్న విశేషాధికారాలు, కులగతమైన రాగద్వేషాలు, సమాజాన్ని ముక్కలు ముక్కలుగా చేశాయి. నిత్యం పేదరికానికి బలయిపోతున్న రైతులను, కూలీలను ఉన్నత కులాల వారు మూర్ఖంగా వేరు చేసుకొన్నారు. అస్పృశ్యుల లోకం, అగ్రకులాల లోకానికి మరీ భిన్నంగా వుండేది. సమాజంలోని ఈ రెండు వర్గాల మధ్య అసహ్యం, అనుమానం, దాటలేని అగాధం.

స్త్రీలను గడప దాటనీయక పోవటం, బాల్య వివాహాలు, శిశు హత్యలు - భరించలేని ఆచారాలు, మూఢ నమ్మకాలు సమాజాన్ని కృంగదీశాయి. పైగా ఈ సమాజంలో అన్యాయం పరపీడన లాంటి దుర్గంధ మలిన కూపాలకేమీ లోటు లేదు. సంకుచిత కఠోర కుల వ్యవస్థ సమాజా కృతికి వెన్నెముకలాటి శూద్రుల శక్తిని ధారపోయ నీయకుండా చేసింది.

సాంఘిక వ్యవహారాలనీ, వ్యవస్థనీ, గౌరవాన్నీ, కాపాడే అధికారాలన్నీ బ్రాహ్మణుల చేతుల్లో వుండేవి. సోమరులనీ చదువు లేనివారనీ మొరటైన వారని చెప్పబడే వారి కంటే ఈ పండితుల సంఖ్య తక్కువ. వీరు శూద్రుల కంటే ఉన్నతులు కారు. మిగిలిన కులం కంటే మూడు కులాలకీ పెద్ద పీటవేసిన సమాజం --- పరపీడనమీద, అన్యాయంపైన ఆధారపడింది.

అలాంటి హిందూ సమాజంలో బహిష్కృతులూ, దళితులూ, క్రైస్తవ మతంలోకి మారటం సహజమే. కొత్త మతంలోకి మారితే ఇల్లూ వాకిలీ హోదా, సాంఘికంగా వచ్చే గౌరవం --- ఇవి పెరగడం కూడా దీనికి ఒక కారణమయింది. దాస్యం వాళ్ళని బానిసల్ని చేసింది. వాళ్ళ మనసుల్ని పీల్చివేసింది. ఇటువంటి అవ్యవస్థ ఎక్కువ కాలం సాగదు. తన బరువుకు తానే ఎప్పుడో ఒకప్పుడు పిండి పిండి కావాల్సినదే. పశ్చిమదేశాల ప్రభావం వల్ల, స్వీయ భారంవల్ల సరిగా అదే జరిగింది. అయితే ఈ దేశ సాంఘిక వ్యవస్థ అప్పటికే గుర్తు పట్టలేనంతగా నాశనమయింది.

ఆదికాలం నుంచి భారతీయ సంస్కృతికి మతమే వెన్నెముక - అస్థి - మజ్జ. భారతీయుల ప్రధాన మతం హిందూ మతం. ఇది వైదిక మతోత్తర ధార్మిక విశ్వాసాల

నైతిక ఆలోచనల సమన్వయం నుంచి జన్మించింది. 19వ శతాబ్ది ప్రథమ పాదంలో ఇది చరమ దశకి చేరింది. ఆ మతంలోని గొప్ప విషయాలు గాలి కెగిరిపోయాయి. ఈ మతావలంబకులలో ఎక్కువ మంది వాటిని పాటించడంలో అశ్రద్ధ చూపసాగారు. అర్థంలేని విచిత్ర సిద్ధాంతాలు, అభిప్రాయాలు, మూఢనమ్మకాలు - వీటితో కలగా పులగంగా హిందూమతం కనబడసాగింది. ఆధ్యాత్మిక వైవిధ్యానికీ, వేదాంత దృష్టికీ కాలం చెల్లింది. బౌద్ధికంగా కీర్తి గడించిన మహానుభావులూ, సాధువులూ, సర్వసంగ పరిత్యాగులూ సంచరించిన ఈ దేశంలో --- ఈ ఆధ్యాత్మిక వారసత్వంలోని గొప్పతనాన్ని అర్థం చేసుకొనే యోగ్యత సహితంలేని వామనుల కాలం, సామాన్యుల కాలం వచ్చింది. మనిషికీ --- ఆత్మకీ, పరమాత్మకీ వున్న సంక్లిష్ట సంబంధాన్ని పరిశోధించడానికీ, ప్రకృతి నియమాలను తెలుసుకోవడానికి ప్రేరేపించే జిజ్ఞాసనీ, సంశయ దృష్టినీ త్యజించి, ఇప్పుడు ప్రజలు సనాతనాచారాలనీ, మతంలోని బాహ్య ఆడంబరాలనీ అనుసరించసాగారు. ఆసక్తి లేకపోవటం, పరోపకారం, త్యాగం, సమర్పణ లాంటి గొప్ప గుణాల స్థానాన్ని కఠినత్వం, విద్వేషం, సంపాదన, భోగం, ఆసక్తి, లోభం, ఆక్రమించాయి.

ఇలా హిందూ మతంలోని శక్తి సర్వత్రా క్షీణించింది. మార్పు తెచ్చే పద్ధతుల వల్లనే సాధారణంగా ఏ వ్యవస్థయినా సజీవంగా వుంటుంది. అది తనలో, తర్వాత తర్వాత వచ్చి చేరే చెడు భావాలను శుభ్రం చేస్తూ జీవిస్తూ వుంటుంది. కాని ఈ మార్పు తెచ్చే విధానం కూడా హిందూ వ్యవస్థని ఏమీ చేయలేకపోయింది. హిందూమతం ఇప్పుడు కేవలం భ్రష్టులయిన పూజారుల, పురోహితుల చెడు ఉపదేశాలకు, వీటి ననుసరించే వారి అనుచరులకు మాత్రమే పరిమితమయింది. ముక్తి కోసం కొన్ని గంటల పూజా పునస్కారాలు చేయాలని, బ్రాహ్మణులకు, పెద్ద పూజారులకు దాన ధర్మాలు చేస్తే ఈశ్వరుని కొలువులో పాపాల నుంచి నిష్కృతి కలుతుతుందని, తలచి తమ కాల్పనిక జగత్తులోనే హిందువులుండి పోయారు. ముక్తికోరేవారికి, జ్ఞాన, కర్మ భక్తి మార్గాలు నిర్దేశింపబడినా, భక్తి, మార్గమే జనరంజకమైనది. అదే తేలికైన మార్గం. బరువు బాధ్యతలు లేని మార్గం. కాని దేవీ దేవతల సంఖ్య పెరిగి భక్తిమార్గంలో కూడా ఇబ్బందులు కలిగాయి. ఎవరికి వారే తామనుసరించే మార్గమే సర్వోత్తమమని ఎంచసాగారు. దేవాలయాలు కపటులకి నిలయాలయ్యాయి.

వాటిని నిర్వహించే పీఠాధిపతులు, పూజారులు, వారి శిష్యులు అమాయక ప్రజల సాయంతో పెరగసాగారు. ప్రతి ఏటా ఆలయాల సంఖ్య పెరిగింది. ఆలయ నిర్మాణానికి, నిర్వహణకి అపార ధనరాశి కరిగిపోయేది. ఈ ధనం సద్వినియోగ

మయివుంటే మనదేశ సంపద ఎంతో పెరిగి వుండేది కదా!

మతం అందరినీ ఏకం చేయడానికి బదులు ఒకరినొకరిని వేరు చేయడానికి పనిచేసేది. ఇలా మతం మన దేశంలో కర్మకాండల, అనుష్ఠానాల, సంప్రదాయాల బరువుతో మూలగుతూండేది. చీకటి కప్పిన సంస్కృతి క్షితిజంపై ఒక ఆశా కిరణమయినా కనపడటంలేదు. ఇక్కడి ప్రజలకి నాగరికత నేర్పే అవకాశం కోసం ఐరోపా దేశాలలోని క్రైస్తవ మత ప్రచారకులు దేశంలోకి రావడానికి అనుమతికోసం గొడవ చేస్తూండేవారు.

ఇటువంటి సంధికాలంలో ఆంగ్లేయులతో చెలిమి క్రొత్త శక్తులను మేలుకొలిపింది. పరివర్తన చక్రం విజృంభించింది. పెర్సివల్ స్పియర్ మాటల్లో, "భారతదేశం అనవ జాగరణ రహస్యం ఏమిటో తనలోనే వెతుక్కొనే ప్రయత్నం చేసింది. అదే యుగయుగాలుగా పాదుకొన్న సంప్రదాయాల, అలవాట్ల, ఆడంబరాల, పద్ధతుల వేళ్ళని పెకలించే యత్నం.

ఆ ప్రయత్నం హిందూ భావన యొక్క పురాతన సౌందర్యాన్నీ, గడ్డితో పాదలతో కప్పబడివున్నా, దాని శక్తిని చాటే శుభ్రజల ముఖాన్నీ, అంధ విశ్వాసాల తెరల మాటున దాగిన దాని వెలుగునీ దర్శింపచేసింది".

ఇలా దేశంలోని పరిస్థితి సంస్కరణకై పక్వమయింది. రామమోహన్‌రాయ్, కేశవచంద్రసేన్, మహాదేవగోవిందరానడే వంటి నాయకు లవతరించడానికిది అనువైన స్థితి ఏర్పడింది.

రామమోహన్‌రాయ్ కొత్త ఆలోచనలకీ ఆశలకీ మార్గ దర్శకుడయ్యాడు. పాత సంప్రదాయల నంతం చేసే నవీన యుగోదయం కాబోతున్నది. కొత్త ఉద్యమాలు మొదలయినప్పుడే దారి చూపే నాయకులు పుట్టి, అనుయాయుల మార్గం సుగమం చేయటం చరిత్ర విలాసం. వారి తర్వాత స్వామి దయానంద వచ్చి తమ జీవితాంతం హిందూ సమాజానికి కొత్త యవ్వనం తెచ్చి వేదకాలీన ప్రాచీన గౌరవాన్ని తిరిగి తెచ్చే ప్రయత్నం చేశారు. ఆయనగారి ఆర్య సమాజం, హిందూ సమాజంపై ఎవరూ కాదనలేనంత ప్రభావాన్ని కల్గించింది. భారతదేశ సాంఘిక రాజకీయ పునరుజ్జీవనంలో దయానంద నిర్వహించిన భూమిక చాలా ప్రధానమయినది. తమ లక్ష్య సిద్ధిలో ఆయన ఎంత కృతకృత్యులయినారో ముందు పుటలలో చర్చిద్దాం.

## 2

# బాల్యం నుండి జిజ్ఞాసువు

స్వామి దయానంద బాల్యం గురించి మనకి ఎక్కువ తెలియదు. ఆయన సమకాలికులు ఈ విషయంలో శ్రమించరాని నిర్లక్ష్యం చేయటమే దీనికి కారణం. ఆయన కూడా తమ జీవితంలోని సంఘటనలగురించి చెప్పడాని కిష్టపడినట్లు లేదు. ఆయన పుట్టిన వూరిపేరు కూడా దాచి పెట్టారు. స్వర్గీయ దేవేంద్రనాథ్ ముఖర్జీ శ్రమకోర్చి దీక్షగా పరిశోధించకపోతే దయానంద జీవిత విశేషాలు అసలు మనకి దక్కేవి కావు. స్వామి దయానంద తమ జీవితం గురించి మూడుచోట్ల చెప్పారు. తమ జీవితం గురించి తాము చేసిన పనుల గురించి స్థూలంగా చెప్పటమే తప్ప ఆయన ఇంకేమీ వివరించలేదు. తమ చిన్నతనం గురించి చెప్పనేలేదు.

తమ బాల్యం గురించిన విశేషాలను ఎందుకు గోప్యంగా వుంచారో స్వామి దయానంద స్వయంగా కారణాలు వివరించారు. ఆయన మాటలే గుర్తుకు తెచ్చుకుంటే, ఆయన జీవిత లక్ష్యం ఏమిటో తెలుస్తుంది. "మిగతా దేశం కంటే గుజరాత్‌లో తల్లిదండ్రులకు పిల్లలంటే ప్రేమ ఎక్కువ. నేను మా యింటితోను, కుటుంబ సభ్యులతోనూ సంబంధం పెట్టుకున్నా ఉత్తరప్రత్యుత్తరాలు రాసినా కష్టాల్లో పడేవాడిని. నేను త్యజించిన స్నేహపాశం మళ్ళీ చుట్టుకునేది. అందుకే నేను నా బంధువులతోనూ, కుటుంబ సభ్యులతోనూ, ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపలేదు. నేను యిల్లు వదిలినది మొదలు నా ఇంటివాళ్ళను గురించి చెప్పటానికి ఇష్టపడలేదు. ఇప్పుడు నా మీదనున్న బాధ్యతల దృష్ట్యా ఈ విషయం రహస్యంగా వుంచడానికి కారకుడను నేనే. మా ఇంట్లో కొందరికి నా గురించి తెలిస్తే వెతికేవారు. నన్ను ఇంటికి తిరిగి వెళ్ళేలా చేసేవారు. నేను సంసారినయ్యేవాణ్ణి. ఇక కుటుంబాన్ని చూసుకోవటమే నా కర్తవ్యమయ్యేది. నేను ఒక వ్రతంగా తలచిన ఆశయం, జీవితాన్ని త్యాగం చేయగల లక్ష్య సిద్ధి అప్పుడు అసంపూర్ణంగా వుండి జాతిని జాగృతం చేసే పనులు, మత ప్రచార కార్యక్రమాలు

వెనుకబడిపోయేవి." అందుకే ఆయన జీవితం తొలిదశ గురించిన చిన్న వివరణతోనే మనం తృప్తి పడాలి. సమయం వచ్చినప్పుడు దయానంద అన్ని విశేషాలు చెప్పేవారే కాని అకాల మృత్యువు అడ్డు తగిలింది.

స్వామి దయానంద విక్రమ సంవత్సరం 1881 ఫాల్గుణ బహుళ దశమినాడు జీవాపురం గ్రామంలో జన్మించారు. ఈ గ్రామం ఆనాటి టంకారా తాలూకాలో వుండేది. ఇప్పుడు గుజరాత్‌లో రాజకోట దగ్గర పశ్చిమరైల్వేలోని మోర్వీ-టంకారా అనేచిన్న రైలు మార్గం మీద ఆ గ్రామం వుంది. దేవేంద్రనాథ్ ముఖర్జీ చెప్పినట్లు, స్వామి దయానంద పుట్టిన వూరు టంకారా అని చాలా కాలం చాలమంది విద్వాంసులూ, ఆర్య సమాజికులూ నమ్మారు. కానీ జీవాపురమే ఆయన జన్మస్థానమని ఇటీవల వచ్చిన వాదమే సమర్థనీయంగా తోస్తోంది. అనేక ఆధారాల బట్టి ఇదే నిజమని తోస్తున్నది. ఆయన తండ్రిగారే అసలు పేరు కర్మన్‌జీలాల్‌జీ తివారీ. ఆయనని అందరూ అంబాశంకర్ అనేవారు. ఆయన సంపన్నులు, ఉత్తరాది బ్రాహ్మణులు. వీర శైవులు. కుమారుడు కూడా తండ్రికి తగ్గ తనయుడై - తన అడుగుజాడల్లో నడవాలనుకున్నారు.

బాల్యంలో దయానందకి రెండు పేర్లుండేవి. ఒకటి దయాల్‌జీ (దయాశంకర్) రెండు మూల శంకర్. మొదటి పేరు బాగా ప్రచారంలో వుండేది. అందరూ అలాగే పిలిచేవారు. ఆయనకి ఇద్దరు సోదరులు, ఇద్దరు సోదరిలు. ఆయనది ఎంతో చురుకైన బుద్ధి. ఆయన జ్ఞాపకశక్తి అద్భుతం. ఆయన తండ్రి విద్వాంసుడు. పండితుడు. వేద పారంగతుడు. తన కొడుకు కూడా తన లాగే అన్నిటా వికసించాలని తండ్రి అనుకొన్నాడు. ఆ ఉద్దేశ్యంతోనే ఇంటి వద్దనే దయాల్‌జీకి విద్య గరపటానికి మంచి ఏర్పాటు చేశారు. సంప్రదాయానుసారం తండ్రి, మిగిలిన పెద్దలు ఆయనకి విద్య నేర్పసాగారు. అయిదు సంవత్సరాల వయస్సులోనే ఆయన చేత ఎన్నో మంత్రాలు, స్తోత్రాలు, శ్లోకాలు వల్లె వేయించారు. ఎనిమిదవఏట ఉపనయనం జరిగాక, నిత్యం సంధ్యావందనానికి, పూజలకీ కొంత సమయం వెచ్చించాల్సి వచ్చేది. అందువల్ల ఆయన చదువు కొంచెం వెనకబడింది. కర్మన్‌జీ తమ కుమారుణ్ణి ధర్మపరాయణునిగా శివోపాసకునిగా తీర్చిదిద్దాలనుకొన్నారు. శాస్త్రార్థ సభలకి, తనతో బాటు కుమారుణ్ణి కూడా తీసుకువెళుతుండేవారు. దయాల్‌జీ వ్రతాలు-ఉపవాసాలు. ఇతర ధర్మానుష్ఠానాలు చేయాల్సి వచ్చేది. ఈ నిత్య విధిలో పడినప్పటికీ, తన జ్ఞాన పిపాసను తృప్తి పరచడానికి ఆయన ఎలాగో సమయం చూసుకొని, సంకీర్ణమయినా, నియమ బద్ధమూ, శాస్త్రబద్ధమూ అయిన సంస్కృత విద్యలో ఆ దొరికిన వాటితోనే తన జ్ఞానాగారాన్ని

నింపుకొనేవారు. పదమూడు సంవత్సరాల చిరుత ప్రాయనికే దయాల్‌జీ సంస్కృత వ్యాకరణాన్ని, 'శబ్ద రూపావళి'నీ కంఠస్థం చేశారు. శుక్ల యజుర్వేదాన్ని, ఇతర వేదాంశాలలో కొన్నిటినీ వల్లె వేశారు. తండ్రి పాదాలముందు కూర్చుని దయాల్‌జీ ఆ మాత్రమే సాధించగలిగారు.

పాపం మూలశంకర్‌కి విద్యోపార్జన మీద, జ్ఞాన సముపార్జన మీద మక్కువ. అయినా తండ్రి ఆయనని సనాతనుడిగా మంచి గృహస్థునిగా తీర్చి దిద్దదలిచారు. విధాత వేరే రాసిపెట్టాడు. ప్రథమానుభవంలోనే ఆచారాలు, అంధ విశ్వాసాలనిపించే పద్ధతులు ఆయన నిష్టని సమూలంగా కదిలించే ఆయనలో సంశయాత్మక దృష్టిని పెంచి ఆయనని అన్వేషకునిగా మార్చాయి. తన విగ్రహం మీద వుంచిన ప్రసాదాన్ని ఎలుకలు అరగిస్తూంటే చూస్తూ వూరుకోటం తప్ప ఏమీ చేయలేని శివుని నిస్సహాయత, మూల శంకరుని భక్తిని ఎలా భంగం చేసిందో లోక విదితమే కనుక సంక్షిప్తంగా చెప్తేచాలు.

మూలశంకరుని చిత్తం అనురాగరంజితం. హృదయం సంవేదనశీలి. అందువల్ల చిన్న విషయాల పట్ల కూడా ఆయన ప్రతిక్రియ తీవ్రంగా వుండేది. అల్పభావుకులు వీటిని ఎక్కువగా పట్టించుకోరు. జీవితం ఎడల, సమస్యలపట్ల ఆయనకున్న తార్కిక దృష్టివలన శివుని వంటి శక్తివంతుడైన దేవుడు ఏ విగ్రహంలోనూ నివసించడని ఆయనకి తోచింది. శివుడే సకల గుణ సంపన్నుడైతే ఎలుకలు ఆయన పాద పద్మాలను అపవిత్రం చేసే ధైర్యం ఎలా చేస్తాయన్న ప్రశ్న పుట్టింది. సర్వశక్తి స్వరూపుడైన శివుడంటే నమ్మకం సడలిపోయింది. ఇంటికి రాగానే మూలశంకర్ వ్రతభంగం చేసి నిద్రపోయారు. ఇంత అల్ప విషయం ఆయన నమ్మకాలను కదల్చివేసింది. దీంట్లో ఆశ్చర్యపడవలసిన దేమీలేదు. సామాన్యుల మీద ఏ ముద్రావేయలేని చిన్న సంఘటనే మహాపురుషుల జీవితాలను మార్చివేస్తుంది. మూల శంకరునికి మహా పురుషుడయ్యే లక్షణాలున్నాయి. అందువల్లనే విగ్రహారాధాన ఎంత నిరర్థకమో స్పష్టంగా కనబడింది. ఈ అనుభూతి ప్రభావం కొద్ది కాలమే ఉందనుకోరాదు. ఆయన జీవితంలో విగ్రహారాధనకు వ్యతిరేకంగా పనిచేయటమే అన్నిటికంటే ముఖ్య కారణంగా రూపొంది, క్రొత్త దిశని చూపేటంతగా ఆయన జీవితాన్ని ఆలోచనల్ని మార్చింది.

మూలశంకరుని జ్ఞాన పిపాసకు అంతులేదు. కాశీ వెళ్ళి ఇంకా విద్య నభ్యసించాలనుకొన్నారు. కాని తల్లి యిష్టపడలేదు. ఆ ఆలోచన విరమించాల్సి వచ్చింది. ఈలోగా మూలశంకరుని వివాహం చేయాలని తల్లిదండ్రులు నంకల్పించారు.

మూలశంకరుడు తప్పించుకుందామనుకొన్నారు. చదువు పూర్తి చేసుకోవడానికి అక్కడికి ఆరు మైళ్ళ దూరంలో వున్న ఒక పండితుని దగ్గరకి వెళ్ళిరావడానికి అనుమతి నివ్వవలసినదిగా తండ్రిని మూలశంకర్ కోరారు.

దురదృష్టవశాత్తూ కారణాంతరాల వల్ల గురువుగారి ఆశ్రమంలో, ఆయన కొద్ది రోజులు మాత్రమే గడిపి ఇంటికి తిరిగి రావలసి వచ్చింది. విద్య సముపార్జించే ప్రయత్నంలో ఇలా మొదటిపాదం ముగిసింది. ఇంతకన్నా గొప్ప పనులు చేయడానికి రాసి పెట్టివుందేమో! ఇంటికి తిరిగి వచ్చాక కూడా బంధనాలతో వున్న జీవిత మార్గంలో ఆయన నడవలేకపోయారు. తమ జిజ్ఞాస తీర్చుకోవడానికి వైదిక భాషా, శాస్త్ర దర్శనాలలోని వివిధ శాఖలలో ప్రావీణ్యము సంపాయించడానికి నిరుక్తం, నిఘంటు, పూర్వ మీమాంసలను స్వయంగా స్వతంత్రంగా అధ్యయనం చేశారు.

ఆయన మనసును బాధపెట్టిన రెండో సంఘటన చెల్లెలి ఆకస్మిక మరణం. ఎంతమంచి వైద్యం చేయించినా ఆమెను దక్కించుకోలేకపోయారు.అప్పటికి మూలశంకర్ వయస్సు 16 సంవత్సరాలు. చెల్లెలి చావుతో ఆయనలో ఉత్సాహం నశించింది. హృదయం తేలికయి పోతుందేమోనని కన్నీటిని కూడా రానీయలేదు. బుద్ధునికి తెలిసినట్లే మృత్యువెంత తప్పించరానిదో ఆయనకి అర్థమయింది. హఠాత్తుగా వచ్చి ఒక అమాయకురాలిని పొట్టబెట్టుకున్న మృత్యువు దారుణంగా కనబడిందాయనకి. మృత్యుబాధ బారినుంచి తనని తాను రక్షించుకోవడానికి తన శక్తి మేరకు ప్రయత్నించాలని అప్పటికప్పుడే అక్కడే ఆయనకి సంకల్పం కలిగింది. జనన మరణాలనే ఈ చక్రం ఆయనని భయకంపితుణ్ణి చేసింది. వ్రతాలు, ఉపవాసాలు ఎంత నిరర్థకమో పూర్తిగా తెలిసివచ్చింది. ఇక లౌకిక శక్తిని పొందాలన్న ఆలోచనలు మస్తిష్కంలో ఝుమ్మని తిరుగుతున్నాయి. అయినా తన మనసులో మాట ఆయన ఎవరికీ చెప్పలేదు. జీవితంలో ఆయన అంతర్ముఖుడుకావటానికే, ఆయన జీవనగంగ మలుపు తిరగడానికే తోడ్పడిన మూడో సంఘటన ఎంతో స్నేహశీలుడైన ఆయన పినతండ్రి మరణం. అప్పటికి మూల శంకర్ వయస్సు పంథొమ్మిది. ఆయనే చెప్పినట్లు ఆ పిన తండ్రి మహావిద్వాంసుడు. మంచివాడు. మూలశంకరుని ఆయన ఎంతగానో ప్రేమించేవాడు. మూల శంకరునికి కూడా ఆయనంటే మిక్కిలి భక్తి. కొన్ని రోజులకు మరణిసాడనగా ఆ పిన తండ్రి మూల శంకరుని పిలిచి మొహంలోకి చూస్తూ దృష్టి నిలిపి చెదిరిన మనసుతో కన్నీరు పెట్టుకున్నాడు. ఈ కరుణామయ దృశ్యంతో మూలశంకరుడు చలించాడు. చెల్లెలు మరణిస్తుంటే చూసి శిలామూర్తిగా నిలబడిపోయిన మూలశంకరుని కనులలో అశ్రుధార

ఆగలేదు. ఆయన వెక్కివెక్కి ఏడ్వసాగారు.ఏడ్చి ఏడ్చి కళ్లు ఉబ్బిపోయాయి. పినతండ్రి చావు మూలశంకరుని దుఃఖంలో ముంచి వేసింది. క్షణభంగురమైన జీవితం గురించి ఆయన ఆలోచించసాగారు. ఈ ప్రపంచంలో ప్రతి వస్తువు అశాశ్వతమని, ఆయన మనసుకి నాటిపోయింది.దేనికోసరమూ బ్రతకాలని లేదనీ, ఏదీ విలువైనదీ, అమరమైనదీ లేదనిపించింది. కాలం గడుస్తున్న కొద్దీ ఈ భావం మూలశంకర్ హృదయంలో చేరి గూడుకట్టుకొని మస్కిష్కంలోకి పూర్తిగా వ్యాపించింది. మతంలోని బాహ్యాడంబరాలపై ఆయనకు అవిశ్వాసం ఏర్పడింది. దుఃఖాలతో కష్టాలతో ఈ సంసారం నిండి వున్నదని త్వరగానే అవగతమైంది. అందుకే కొంతకాలం తర్వాత ఆయన దూర ప్రాంతాలు పర్యటించసాగారు. శాశ్వతమైన వెలుగుకోసం, సత్యం కోసం అన్వేషించసాగారు. అందరి తల్లిదండ్రులవలె, ఆయన జననీ జనకులు కూడా ఆయన మనసు తెలుసుకొనలేకపోయారు. ఆయన మనసులోని అంతర్యుద్ధం ఎంత తీవ్రమైనదో వాళ్ళు వూహించలేకపోయారు. ఆయన ఆత్మ ఎన్ని యాతనలు భరిస్తున్నదో గమనించలేకపోయారు. కుమారుని తీవ్ర ప్రతిఘటన వల్ల తల్లిదండ్రులు పెళ్లిమాట తేవటం కొన్నాళ్లు ఆపు చేశారు. కాలం గడిచిన తర్వాత అంతా సర్దుకుంటుందనుకున్నారు. ఫలితంగా ఒకవైపు మూలశంకర్ హృదయంలో , తన భావి మార్గాన్వేషణ గురించి ఆలోచనలు మధిస్తూ సర్వం మరచివుంటే, తల్లిదండ్రులు వివాహప్రయత్నంలో లగ్నమయ్యారు. పెళ్ళిమాట తలపెట్టడమే తనకు ఇష్టంలేదని ఒక రోజున మూలశంకర్ చెప్పేసరికి, ఆయన తల్లిదండ్రులు చాలా కంగారుపడి శీఘ్రంగా ఆయనకు వివాహం చేయనిశ్చయించారు. మూలశంకర్‌కి అప్పటికి ఇరవై సంవత్సరాలు వయసు. కొడుకు మాట మీద రెండు సంవత్సరాలుగా వివాహం చేయకుండా ఆగారు. ఇప్పుడింకా ఆలస్యం చేసి నెత్తిమీదకి తెచ్చుకోలేరు. ఆగవలసినదిగా కొడుకు పదే పదే కోరినా వాళ్ళు లక్ష్యపెట్టలేదు. ఇక ఇల్లు వదలి పారిపోవటం తప్ప ఆయన కిపుడు వేరే దారిలేదు. యువకుడు మూలశంకర్ తన జీవితంలో కల్లా ముఖ్యమైన నిర్ణయం తీసుకొన్నాడు. క్రీ.శ. 1846లో వేసవి రోజుల్లో ఒక రాత్రి ఇల్లు వదలి బయటికి వచ్చారు. మృత్యువనే మాటే మూలశంకరుని వ్యాకులపరచింది. జనన మరణాల బంధనాల నుండి విడుదల పొందడమే ఆయన లక్ష్యం. అందుకే ఆయన ముక్తిమార్గం చూపే యోగులకోసం ఎంతో అన్వేషించసాగారు. ఇదివరలో గౌతమ బుద్ధుడు కూడా ఇల్లు వదిలాక యోగుల శరణు కోరాడు. తనకు తెలియకుండానే మూలశంకర్ కూడా అదే మార్గంలో నడిచారు. మొదట్లో సాయలా పెళ్లి ఎంతో సిద్ధి పొందినవాడని, ధర్మ పరాయణుడని పేరుగన్న

భక్తలాల్‌ని కలుసుకుందామనుకున్నారు. కాని దారిలో బ్రాహ్మణ భిక్షువుల దళం ఒకటి కనబడింది. కోరుకున్నది నెరవేరాలంటే వున్నదంతా త్యజించాలని ఆ దళంలో వున్న భిక్షువు ఆయన మనసులో నాటాడు. శరీరం మీదనున్న ఆభరణాలన్నిటినీ దానం చేయాలని కూడా ఆ భిక్షువు సలహా ఇచ్చాడు. విలువైన ఆభరణాలు తనపై వున్నంతవరకూ యోగమూ, తపమూ ఆచరించవీలుకాదని మూలశంకర్‌కి తోచి, సంకోచించకుండా అన్ని ఆభరణాలను ఆయన కిచ్చివేశారు. దాచుకోవాలనుకునే కోరిక నుండి ముక్తి పొంది మూలశంకర్ ఇప్పుడు ఆధ్యాత్మిక రహస్యాల లోతులు చూడటానికి అర్హత పొందారు.

పశ్చిమ రైల్వేలో జోర్వనగర్ - సాయలా చిన్న రైలు మార్గం. దానిపై ఉన్న చివరి స్టేషన్ సాయలా (శైలూ). మూలశంకర్ అక్కడికి చేరి భక్తలాల్ దగ్గిర వుండి యోగాభ్యాసంలో నిమగ్నమయ్యారు. అక్కడే పరిచయమయిన ఒక బ్రహ్మచారి సలహాపై బ్రహ్మచారి జీవితం గడపాలని నిర్ణయించుకొని తన పేరు శుద్ధ చైతన్యుడని మార్చుకొన్నారు.

సాయలాలో మూలశంకర్ రాత్రిపూట యోగాభ్యాసం చేసేవారు. ఒక రాత్రి యోగాబ్యాసం చేస్తుంటే, ఒక గుడ్లగూబ విచిత్రంగా అరచింది. ఆయనెంతో భయపడ్డారు. భయం గొలిపే పక్షి అరుపు వుండుండి వినపడటం ఆయన ప్రతి రాత్రి యోగాభ్యాసం చేయడానికి మఠం వెలుపలికి వెళ్ళవలసి వచ్చేది. ఆ భయం గొలిపే అరుపు నుంచి రక్షణ పొందడానికి చివరికి ఆ మఠాన్నే వదలి మూలశంకర్ అహమదాబాద్‌కి నైరుతి దిశలో 84 మైళ్ళ దూరంలో ఉన్న కోటి గంగారా చేరారు. అక్కడ ఎంతోమంది సాధువులు కూడి వున్నారు. వారిలో ఒక యువతి కూడా వుండటం చూసి ఆయనకి ఆశ్చర్యం వేసింది. ఆమె వారితో పర్యాచకాలాడ నారంభించింది. శుద్ధ చైతన్య మాత్రం ఆమెకి దూరదూరంగా ఉండసాగారు.ఆయన కట్టిన ధోవతీ సిల్కు అంచుతో వుండటం చూసి మిగతా సాధువులు వేళాకోళం చేయసాగారు. దానితో ఆయన ఖరీదైన ధోవతిని తీసి విసిరి వేసి కాషాయరంగు నూలు వస్త్రాలను కొని ధరించారు. ఇక ఆయన దగ్గర మూడు రూపాయలు మాత్రం మిగిలాయి.

ఇక్కడ కూడా శుద్ధ చైతన్యునికి లక్ష్యసిద్ధి కలుగలేదు. నిరాశతో అహమ్మదాబాద్‌కి 103 కిలోమీటర్లు ఉత్తర దిశగా ఉన్న సిద్ధపూర్ వెళ్లారు. ఆ వూరు పశ్చిమ రైల్వేలో ఢిల్లీ - అహ్మదాబాద్ మార్గం మీద వుంది. అక్కడ కార్తీక మాసోత్సవం జరుగుతోంది. అక్కడ చేరి సాధుపుంగవులతో మంచి స్నేహ మేర్పడుతుందని ఆయన ఆశించారు. శుద్ధ

చైతన్యముక్తిని వెతుకుతూ ఇల్లు వదిలేశారు. అందుకే సన్మార్గం చూపే గురువులను అన్వేషిస్తూ వూరూర తిరగ సాగారు. దురదృష్టవశాత్తూ సిద్ధపూర్ వెళ్లే దారిలో పరిచయమున్న సాధువు ఆయన కంటబడ్డారు. ఆ సాధువు ఆయన గ్రామానికి దగ్గర మరో గ్రామవాసి. ఆ సాధువు శుద్ధ చైతన్యుడి పేరు, సన్యాసివేషం చూసి ఇల్లు వదిలి వచ్చినందుకు కేకలేశాడు. గద్దించి ముందుకు సాగిపోయాడు. మూలశంకర్ కంగారుపడి, సిద్ధపూరు వైపు వేగంగా ప్రయాణం కొనసాగించారు. అక్కడ కూడిన తాపసులతోపాటు నివసించసాగారు.

సిద్ధపూర్‌లో తీర్థం, ముదురురంగు బట్టల్లో వేలాదిమంది వినోద వస్తువుల్ని కొనుక్కొంటున్నారు. పరిచయస్తులు ఒకరినొకరు పలుకరించుకొంటున్నారు. సాధువులు, సన్యాసులు, పండితులు, మహంతులు అక్కడ విడిది చేశారు. సాధారణ ప్రజలకి ప్రవచనాలు, ఉపదేశాలు చెపుతున్నారు. తీరని జిజ్ఞాసతో అశాంతిగా వున్న ఏకాకి - ఒక ఏకాకి ఆత్మమాత్రం ప్రతి సాధువు దగ్గిర తిరుగుతూనే వుంది. ఆయన వెతుకుతున్న వస్తువు వారిలో ఎవరి వద్దా లేదు. ఆయన జిజ్ఞాసను తృప్తిపరచగల అర్హత అక్కడున్న వారెవరికీ లేదు. సద్గురువు కోసం అన్వేషించే ప్రయత్నాలన్నీ ఆయన చేశాడు. మహానదితో చేరే అశాంతితో ఎన్నో వంపులూ సుడులూ తిరుగుతూ ప్రవహించే ఉపనదిలా వున్నారాయన. అధ్యాత్మిక తేజం వైపు, నిజమైన వెలుగువైపు తనని నడిపించగల గురువు కోసమే ఆయన అన్వేషణ. ఆ సాధువులలో సన్యాసులలో ఏ ఒక్కరూ ఆయన ఆశల కనుగుణంగా కనబడలేదు.

కాని సిద్ధపూర్‌లో ఆయన కోసం విధాత మరోవలపన్నాడు. ఓ రోజు ఉదయమే సిద్ధపూర్ నీలకంఠేశ్వరాలయంలో సాధువులతో కూర్చుని వుండగా కొందరు సిపాయిలతో ఆయన తండ్రి వచ్చాడు. తండ్రి ఎడల ఆయనకి ఎంతో భక్తి. ఎంతో గౌరవం. కాని ఇలా హఠాత్తుగా తండ్రి కనపడేసరికి శుద్ధచైతన్యుడు భయపడి తండ్రికి ఎన్నో రకాలుగా నచ్చచెప్పి శాంతపరచడానికి యత్నించారు. తన నిర్దోషిత్వాన్ని నిరూపించడానికి ప్రయత్నించారు. తను దుర్మార్గునిలా తండ్రిని మోసం చేసినందుకు చింతిస్తున్నాడనీ, తాను మొదటనుండి ఇంటికి తిరిగి వెళ్ళాలనుకుంటున్నాడనీ, తండ్రే స్వయంగా అక్కడికి రావటం ఎంతో ఆనందదాయకమనీ తండ్రితో శుద్ధచైతన్య చెప్పారు. ఆయనతో ఇంటికి తిరిగి పోవటానికి సమ్మతించారు.

కాని ఆయన తండ్రి అంత తేలికగా సంతోషించలేదు. కుపితులై కుమారుడి కాషాయవస్త్రాలను చీలికలుగా చింపి సొరకాయ కమండలాన్ని లాగి విసిరివేశారు.

తర్వాత కర్మన్‌జీ, మూలశంకర్‌పై సైనికుల నిఘా వుంచారు. వారు ఒక్క క్షణం కూడా మూలశంకరుని ఒంటరిగా వుంచేవారు కాదు. తన కుమారుని ఎడల కర్మన్‌జీ ఇలా రోషంగా అవమానకరంగా ప్రవర్తించడం అనవసరం, అవివేకం. అందువల్ల ఇంటికి తిరిగి వెళ్లరాదన్న మూలశంకరుని ఆలోచన మరీ బలపడింది. మామూలు యువకుని కెవరికైనా వివాహ బంధముంటే సమ్మోహకంగా వుంటుంది. కాని శుద్ధ చైతన్యుడికది స్వర్ణజాలంగా తోచింది. తండ్రి ఆయనని ఎంతగా తనతో తీసుకువెళ్లే పట్టుదలతో వున్నారో అంతగానూ శుద్ధ చైతన్యుడి సంకల్పం ఎదురు తిరిగింది. తండ్రికి పట్టుబడినప్పటినుండీ ఎలాగైనా బయటికి పారిపోయే ఉపాయమాలోచించేవారు. అదృష్టవశాత్తూ బంగారం లాంటి అవకాశం వచ్చింది.

ఆ రాత్రి తెల్లవారి కాపలావాడు కళ్లు తెరచేలోపల శుద్ధచైతన్యుడు లేచి చీకటిలోనే వెళ్లిపోయారు. కొంచెం దూరంలో మర్రిచెట్టు వూడలు దిగిన దేవాలయం కనబడింది. ఆ మందిరం మీదకిఎక్కి ఆకుల మధ్య దాక్కున్నారు. మిగిలిన రాత్రంతా ఎవరికీ కనబడకుండా చెట్టుచాటున దేవాలయ గోపురం మీద కూర్చుని గడిపారు. తెల్లవారి కొమ్మల చాటున తొంగి చూసేసరికి సైనికులు ఆయన కోసం వెతుకుతూ అటూ ఇటూ పరిగెడుతూ దేవాలయంలోకి దూరి అన్ని చోట్ల వెతికి నిరాశగా వెళ్లిపోయారు.

దట్టమైన ఆ చెట్టు కొమ్మల్లో బయట వారికి కనపడరు కనుక ఆయన మరుసటి రోజు పగలంతా ఆ గోపురం మీదనే నక్కి కూర్చుని గడిపారు.

సాయంత్రం కాగానే శుద్ధ చైతన్య అసౌకర్యంగా, అస్తవ్యస్తంగా వున్న ఆ చోటు దిగి వెనక దిశగా నడవసాగారు. రహదారికి దూరంగా నడుస్తూ పోయారు. దారిలో వెరినీ ఏమీ వివరాలు అడగలేదు. అందువల్ల ఆ దారి ఆయన్ని తిరిగి అహమ్మదాబాద్ చేర్చింది. ఆ వూరు చేరుదామని ఆయన అనుకోలేదు. అందుచేత వెంటనే బరోడా బయలుదేరారు.

శుద్ధ చైతన్యుడే ఈ అంతిమ పలాయనం గురించి వర్ణించి చెప్పారు. కనుక ఆయనెంతటి అసాధారణ మనిషో తెలుస్తోంది. మానవజాతి చరిత్రలో అపురూప వ్యక్తులే సత్యాన్వేషణలో ఇటువంటి అగ్నిపరీక్షలకి గురి కావలసి వస్తుంది. ఆయనని సంకెళ్ళలో సాంసారిక జీవితం సాగించమని తండ్రి చేసిన ప్రయత్నాలన్నిటినీ ఒక్కొటొక్కటిగా వమ్ము చేసినవీ, ఆయన లక్ష్య ప్రాప్తి కోసం, సంకల్ప సిద్ధికోసం అన్ని పరిస్థితులనీ అవరోధాలను ఎదుర్కొనీ, ఆయనలోని నిర్భయం, సాహసం, దృఢ సంకల్పం ఈ గుణాలే.

మన్మథుని పూలబాణాలనుంచి ఎవరూ తప్పించుకోలేరని అంటారు. కాని అజేయుడైన ఈ సన్యాసి ముందు అవి కోపంగా గర్జిస్తూ రాలిపోయాయి. పూర్తి బ్రహ్మచర్యం పాటించడం చాలా కష్టమనేవారు. కాని స్వామి దయానందుని జీవితమూ, ఉత్తమ లక్ష్యాలలోని ఈ విశిష్ట గుణమూ, ఆయన సమకాలికుల నుంచీ ఇతర నవభారత నిర్మాతలనుంచీ సర్వదా ఆయననని వేరు చేస్తున్నాయి.

# 3

# జ్ఞానాన్వేషణ

బరోడా చేరుకొని శుద్ధ చైతన్య ఇక తననెవరూ వెంటాడే భయంలేదని విశ్రాంతిగా గాలిపీల్చి నిశ్చింతగా వున్నారు. బరోడాలో ఆయన చాలా మంది సన్యాసులతో జీవుడు - బ్రహ్మ గురించిన చర్చలలో పాల్గొన్నారు. జీవుడు బ్రహ్మకోసరమనే వాదాన్ని ఆయన అంగీకరించాడు. చివరికి బరోడా నుంచి కొంత దూరం వెళ్ళి ఆయన సచ్చిదానంద పరమహంసను కలుసుకొన్నారు. ఆయన చైతన్యుని పశ్చిమ రైల్వేలో డబోయి-చాణోద్ నారోగేజ్‌లో వున్న కడపటి రైలు స్టేషన్ చాణోద్‌కి వెళ్ళమని సలహాయిచ్చారు. చాణోద్ చాలా మంది సాధువులకూ, సన్యాసులకు నిలయం. అక్కడ చేరి శుద్ధచైతన్య పరమానంద పరమహంసగారి వద్ద వేదాంతాన్ని అధ్యయనం చేశారు. అక్కడి ప్రశాంత వాతావరణం ఆయనను ఒక సంవత్సరం పాటు అక్కడ వుండేలా ఆకర్షించింది. అక్కడాయన పురాతన మత గ్రంధాల్లో పారంగుతులైన చాలా మంది సన్యాసులను కలుసు కొన్నారు. ఇక తాను సన్యాసివేషం ధరించే కాల మాసన్నమైనదని శుద్ధచైతన్య గ్రహించారు. అలా ఇన్నాళ్ళూ తన అధ్యయనానికీ, తపస్సుకీ ఆటంకంగా వుంటూ వచ్చిన వంటా వార్పూ సన్యాసి అయిన తర్వాత తప్పిపోతుందని భావించారు. ఎవరూ గుర్తు పట్టకుండా తనకి మరో పేరు పెట్టుకోవాలని నిశ్చయించారు. శుద్ధచైతన్య సన్యాస ఆశ్రమం స్వీకరించడానికి తహతహలాడుతున్న కొద్దీ అక్కడ సాధువులు సన్యాసులు అందుకు ఒప్పుకొనలేదు. వారి వుద్దేశ్యంలో శుద్ధచైతన్యుడు అపరిపక్వ నూత నాభ్యాసకుడు. అందువల్ల ఆయనకు దీక్ష ఇవ్వడానికి సాధువులు సిద్ధపడలేదు. కాని శుద్ధచైతన్యుని ఉద్దేశ్యం బలంగా వుండటం వల్ల ఆయన ఆశ్రమ స్వీకారాన్ని నిలిపివేయలేకపోతున్నారు. స్వామి సచ్చిదానందులు ఆయనకి సన్యాస దీక్ష నివ్వ నిరాకరించగానే శుద్ధచైతన్య పూర్ణానంద సరస్వతి వారి వద్దకు చేరారు. ఆయన కూడా కొంత సంకోచించినా ఆ నవ యువకుని ప్రార్ధన విన్నారు. శుద్ధచైతన్యుని

సహచరుడొకాయన కూడా పూర్ణానంద సరస్వతిని అభ్యర్థించారు. చివరకు ఆయన ద్వారా శుద్ధచైతన్యునికి సన్యాస దీక్ష లభించింది. ఆ గురువాయనికి దయానంద సరస్వతి అని కొత్త పేరు పెట్టారు.

ఛానోద్ నుంచి స్వామి దయానంద వ్యాసాశ్రమము చేరుకున్నారు. అక్కడాయన స్వామి యోగానందుని వల్ల యోగ విద్య నారంభించారు. ఆ తరువాత ఆయన కొన్ని రోజులు పశ్చిమ రైల్వేలోని ఛానోద్ - మల్‌సద్ అనే చిన్న లైనులో ఛాణోద్ నుండి 83 కిలో మీటర్ల పడమరగా నున్న ఛీనూర్‌లో గడిపారు. ఆ తరువాత తిరిగి ఛాణోద్ వచ్చి అచట వ్యాకరణం అభ్యసించారు. మరో ఇద్దరు యోగులతో బాటు యోగాభ్యాసం చేయసాగారు.

కొంతకాలం గడిచాక ఆ ఇద్దరు యోగులు అహ్మదాబాద్‌లోని దుగ్దేశ్వర దేవాలయంలో కలుసుకోమని ఆయనతో చెప్పి వెళ్లి పోయారు. అనుకున్న చోటున స్వామి దయానంద తిరిగి వారిని కలుసుకొని వారి వద్ద నుంచి యోగాభ్యసములో ఉపయుక్తము లైన మరిన్ని విషయాలు గ్రహించాడు. 'అబూ'లో వుండే కొంత మంది యోగులు చాల విద్వాంసులని అహమదాబాద్‌లో తెలియటం వల్ల ఆయన అబూ చేరుకున్నారు. అక్కడాయన యోగ విద్యని వృద్ధి చేసుకొన్నారు. కాని యోగాభ్యాసంలో నిష్ణాతుడు కావాలనే కోరిక తీరలేదు. అందువల్ల పూర్ణులై సిద్ధి పొందిన యోగుల అన్వేషణలో ఆయన ఉత్తరాఖండ వెళ్ళ నిశ్చయించారు.

పశ్చిమ భారతదేశంలో ఎనిమిది సంవత్సరాలు గడిపి యోగుల, సిద్ధుల సాంగత్యం వల్ల ఎంతో జ్ఞాన వృద్ధిని పొందాక ఆయన 1854లో హరిద్వారం చేరుకొన్నారు. అక్కడ స్వామి దయానంద తొలి సారిగా సాధువుల సన్యాసుల గొప్ప సమావేశాన్ని తిలకించారు. హరిద్వారం నుంచి 'ఋషీషికేశం' మీదుగా టెహరీ చేరారు. అక్కడ ఆయన తంత్ర విద్యా సంబంధమైన కొన్ని వ్రాతప్రతులను పరిశీలించారు. కాని వాటిలోని అశ్లీలం తంత్ర సాహిత్య మంతటిపైన ఆయన మనస్సుని ఏహ్య భావంతో నింపివేసింది. టెహరీలోని రాజపండితుడు ఆయనను తనతో భోజనానికి ఆహ్వానించాడు. కాని ఆయన ఇంటికి చేరుకొనేసరికి తనకే ఆ పండితుడు మాంసాహారాన్ని తినిపించాలని ఆహ్వానించాడని తెలుసుకొని ఏమీ భుజింపకుండానే తిరిగి వెళ్ళిపోయారు. రాజపండితుడు చాలా పట్టుపట్టగా కొన్ని పండ్లు మాత్రమే స్వీకరించారు. టెహరీ నుంచి ఆయన ముందుకు సాగిపోతూనే కేదార్‌ఘాట్ చేరుకున్నారు. అక్కడాయన గంగాగిరి అనే సాధువు దగ్గర ఆధ్యాత్మిక చర్చ. యోగాభ్యాసం చేస్తూ రెండు నెలల పాటు గడిపారు.

ఆ వర్షాకాలం స్వామి దయానంద కేదార్‌ఘట్‌లో గడిపి తిరిగి రుద్ర ప్రయాగ మీదుగా శివపురి చేరి శీతాకాలమంతా అక్కడే వున్నారు. శివపురిలో నివసించే కాలంలోనే గుప్తకాశి. గౌరికుండ్, భీమగుహ కూడా వెళ్ళారు. కేదార్‌ఘాట్ చేరడానికి ముందు హిమాలయ శోభనంతా తిలకించారు. నిజమైన యోగులను సాధువులనూ అన్వేషించాలనే తీవ్ర కాంక్షే దయానంద హిమాలయాల్లో సంచరించడానికి ముఖ్య కారణం. అగమ్య స్థలాల్లో నివసిస్తూ పర్వత సానువుల్లోనూ, గుహల్లోనూ, పవిత్ర నదీ తీరాల్లో, పర్వత శృంగాల మీద తపస్సు చేసుకొంటూ వుండే సిద్ధయోగుల అలౌకిక శక్తుల గురించి ఆయన చాలా విని వున్నారు. అటువంటి సిద్ధులను చూస్తూ చాలని వారి సాంగత్యం పొందాలనే కాంక్షతో ప్రకృతి పెట్టే దారుణ బాధలను ఎదుర్కొంటూ ఆయన ముందుకు సాగిపోయారు. వన్య మృగాలు నివసించే స్థలాలను లెక్కచేయక, తిండితిప్పలు విశ్రాంతి గురించి ఆలోచించక ఉన్నత పర్వత శిఖరాలు దాటుకొంటూ ఎంతో లోతైన లోయలూ, కొండలూ దిగుతూ ఎక్కుతూ ఆయన సాగిపోయారు. అనేకచోట్ల ముళ్ళ తుప్పల్లో దూరి నడవాల్సి వచ్చేది. మిట్టపల్లాలు ఎక్కడమూ దిగడమూ కష్టంగా వుండి కాలి బాటన నడవలసి వచ్చేది. అంతులేని దూరాలని, భరించలేని చలినీ, వర్షాన్నీ దేనినీ ఆయన లక్ష్యపెట్టలేదు. అడుగు ముందుకు పడనీయని ఆకలి దప్పులనూ, అలసటనూ అప్పుడప్పుడు భరించ వలసి వచ్చేది. అసలే ఆయన వద్ద దుస్తులు తక్కువ. ఉన్నవి కూడా పీలికలయిపోయినవి. ముళ్ళు గీసుకొని శరీరం అంతా ఎర్రగా పూచిన పూవుల్లా రక్తసిక్తమై పోయేది. ఈ అసౌకర్యాలనీ, కష్టాలనీ దయానంద ఆనందంగా సహిస్తూ మహాత్ముల అన్వేషణలో లగ్నమయ్యేవారు. అసలే యువకుడు, అందులోనూ ఆపదలతో కూడిన ఈ పనిలో అంతులేని వుత్సాహం. క్రమంగా ఆయన హిమాలయాలలోని తుంగనాథ్ ఓకిమఠ్, జోషిమఠ్, అలకనందా, బదరీనాథ్ మొదలైన ప్రముఖ పుణ్యక్షేత్రాలన్నిటినీ దర్శించారు.

స్వామి దయానంద ఈ హిమాలయ పర్యటన సందర్భంగా ఎటువంటి కష్టాల నెదుర్కొన్నారో, ఎటువంటి బాధలను సహించారో కొంచెం తెలుసు కొనవలెనంటే ఆయనిచ్చిన వివరాలు చెప్పటం అవసరం.

"చిరకాలంగా నలువైపులా మంచుతో కప్పబడి, కొన్నిచోట్ల కదిలే హిమఖండాలతో శోభించే పర్వత శ్రేణులలో సంచరించడానికి నాకు చాలా ఆసక్తిగా వుండేది. ఈ స్థలాల్లో మహా పుణ్యాత్ములుంటారని వినడమే కాని స్వయంగా చూడలేదు. అందుచేత ఈ దుర్గమ స్థలాల్లో అంటువంటి వారు వున్నదీ లేనిదీ స్వయంగా

తెలుసుకోవాలనిపించింది. కాని విపరీతమైన చలి, భయంకర పర్వత మార్గాలలో అవరోధాల నెరిగి, బాధలు తెలిసి ముందుగానే కొండ జాతుల వారిని వివరా లడిగాను. నా ప్రశ్న విన్న ప్రతివారు నన్నో మూర్ఖుడిగానో, పిచ్చివాడిగానో భావించారు. ఇరవై రోజులపాటు స్వయంగా అటూ, ఇటూ పరిభ్రమించి, నిరుత్సాహపడ్డాను. తోటి బ్రహ్మచారు లిద్దరు నాతో కేవలం రెండు రోజులు మాత్రమే ఉండి భరించలేని ఆ చలికి తట్టుకోలేక తిరిగి వెళ్ళిపోవటంతో నేను ఏకాకిగా సంచరించసాగాను."

స్వామి దయానంద ఒంటరిగా సంచరిస్తూ ఒక రోజున తుంగనాథ్ శిఖరం మీదకు చేరుకున్నారు. అక్కడాయనకి ఒక దేవాలయం, అనేక విగ్రహాలు కనబడ్డాయి. పండాలు కనపడ్డారు. ఆ క్షణంలోనే ఆయన అక్కడ నుంచి క్రిందకి దిగిపోయారు. కాని దారి తప్పారు. ఈ విషయమై దయానంద ఇలా వివరించారు.

"క్రిందికి దిగేటప్పుడు ఒక మార్గం పడమటగా పోవటం, మరో మార్గం నైరుతిదిశగా పోవటం చూశాను. నేను వెళ్ళవలసిన దారి ఏదో నిశ్చయించు కొనలేకపోయాను. చివరికి నేను అడవిలోకి పోయే దారి వెంట నడిచాను. కొంచెం దూరంలోని ఒక దట్టమైన అడవిలోనికి చొచ్చుకుపోయాను. అడవిలో అక్కడక్కడ మిట్టపల్లాలు, బండరాళ్ళు, కొన్నిచోట్ల నీరులేని చిన్న చిన్న జల మార్గాలు వున్నాయి. మరికొంత దూరం పయనించే సరికి ఆదారి అంతటితో అంతమయింది. అక్కడ ఎటు వైపూ దారిలేక ఇంకా పైకి ఎక్కవలెనా, క్రిందకు దిగవలెనా అని ఆలోచించ సాగాను. పైకి ఎక్కితే చాలా ఆటంకాలు, బాధలూ అధిగమిస్తూ పోవాలి. ఇంత శ్రమ పడి పైకి వెళితే రాత్రి గడిచిపోవచ్చు. అందుచేత క్రిందకు పోవటమే ఉచిత మనిపించి గడ్డి దుబబ్బులను, మొక్కలను ఆసరా చేసుకొని నేను మెల్ల మెల్లగా క్రిందకి దిగటం ప్రారంభించాను. కొంచెం సేపటికి ఎండిపోయిన ఎత్తైన నదీ తీరానికి చేరుకున్నాను. దాని వెనుకనున్న ఎత్తైన బండరాతిమీద నిలబడి నలువైపులా చూడటం మొదలుపెట్టాను. చుట్టూ చాలా ఎత్తయిన భూమి, చిన్న చిన్న పర్వతాలు, మనుష్యులు చొరలేని అడవి. అప్పటికి సూర్యుడు అస్తమించబోతున్నాడు. త్వరలోనే అంధకారం అల్లుకొంటుంది. ఆ కారు చీకటిలో మనుష్య సంచారంలేని భయంకరాటవిలో అగ్ని పుట్టించడానికే అవకాశం లేని ఆ ప్రదేశంలో ఒంటరిగా వుండాలన్న ఆలోచన వచ్చేసరికి నా మనసెంతో కలవరపడింది. ఆ సమయంలో గట్టి మానవ యత్నం తప్ప వేరు గత్యంతరం లేదు. దుర్గ మారణ్య మార్గంలో నా బట్టలు తునాతునకలై క్షతగాత్రుడనైనా పాదాలు ముళ్ళతో జల్లెడయి, మొండి కాళ్ళ మనిషివలె నేను నడుస్తున్నాను. కేవల

పురుష ప్రయత్నం వల్లనే అడవి దాటగలిగాను. చివరికి ఒక కొండ మొదలులో ఒక దారి చూశాను. నలువైపులా చీకటి అలముకుంటున్నా ఎక్కువ ఆలోచించ కుండా ఆ మార్గాన్నే అనుసరించి ఏ మాత్రం దారి తప్పకుండా సాగిపోయాను. మెలమెల్లగా ముందుకు సాగాను. కొంచెం దూరం వెళ్ళగానే పూరి గుడిసెలు చూశాను. ఆ కుటీర వాసులని ప్రశ్నించగా ఆ మార్గం ఓఖీ మఠం వైపు వెళుతుందని చెప్పారు. నేను కూడా ఆ మార్గాన్ని అనుసరించి నడక సాగించి కొంతసేపటిలో అక్కడికి చేరుకొన్నాను.

ఓఖీ మఠం సుప్రసిద్ధ మఠం. సమీపంలోనే వుండి మఠం కార్యకలాపాలు చూడటానికి అక్కడ వుండే వారి గురించి తెలుసుకొనటానికి స్వామి దయానంద అక్కడ చాల రోజులున్నారు. మఠాధిపతీ, ముఖ్య మహంత్ దయానందుని వ్యక్తిత్వం, నడవడిక చూసి ఎంతో ముగ్ధుడై, శిష్యుడై తన తదనంతరం మఠానికి ఉత్తరాధికారిగా ప్రధానమహంతుగా వ్యవహరించవలసినదని దయానందుని అనేక విధాల ప్రార్థించాడు. కాని స్వామి దయానంద అతని కోరికను మన్నించక జోషీ మఠానికి వెళ్ళిపోయారు. ఆయన అక్కడి సన్యాసుల యోగుల సాంగత్యంలో కొన్ని రోజులు గడిపి సిద్ధుల యోగ రహస్యాలను అన్వేషించే యత్నంలో తిరిగి బదరీనాధ్ వైపు సాగిపోయారు.

బదరీనాధ్ దేవాలయాన్ని తొమ్మిదవ శతాబ్దంలో సుప్రసిద్ధ దర్శనాచార్యులు శంకరాచార్యులు స్థాపించారు. అక్కడనేక మంది దక్షిణ భారతీయ పండితులుండే వారు. దయానంద అ క్కడ కొన్ని రోజులు గడిపారు. నిజమైన సిద్ధుల గురించి యోగుల గురించి అక్కడ వివరాలు సేకరించి మరోసారి వారి నన్వేషిస్తూ బయలుదేరారు. ఈ ప్రయాణంలో తన అనుభవాల వివరణ ఆయనే మనకు వదిలిపోయారు. ఈ యాత్రలో వారు ఎటువంటి కష్టాలను నవ్వుతూనే సహించారో వాటి నిజ రూపాన్ని వారి మాటలలోనే మీముందుంచటమే ఉత్తమం.

"ఒక్క రోజు సూర్యోదయం తర్వాత బదరీనాధ్ దేవాలయం నుంచి బయటకు వచ్చి కొండ దిగువనే నడవ సాగాను. చివరికి అలఖ్‌నందా తీరానికి చేరాను. అలక్‌నందాకు ఆవలి ఒడ్డున అందరూ గొప్పగా భావించే గ్రామం కనపబడింది. కానీ అటు వెళ్ళాలన్న కోరిక నాకు లేదు. పర్వతానికి దిగువ వున్న దారి పట్టుకున్నాను. ఆ అడవి వైపు అలఖ్‌నందా తీరం వెంట నడవ సాగాను. పర్వతాలు, దిగువనున్న మార్గాలు అన్నీ దట్టంగా మంచుతో కప్పబడ్డాయి. అందుచేత నేను చాల కష్టపడి దుర్గమ మార్గాలు దాటి అలఖ్‌నందా జన్మస్థలంగా ప్రసిద్ధి చెందిన స్థలాన్ని చేరుకున్నాను. అక్కడా నలువైపులా ఆకాశాన్ని దూసుకొనే పర్వత పంక్తులు వున్నాయి. ఆ స్థలం నాకు పూర్తిగా

అపరిచతం. అన్ని వైపులా పర్వతాలతో చుట్టు ముట్టి వుంది. ఎటూ దారితోచక కొంతసేపటి వరకూ అటూ ఇటూ తిరుగుతూ వుండిపోయాను. తిరిగి కొంత ముందుకు సాగాను. ఎక్కడా దారి కాదు కదా, ఇది మార్గం అనే గుర్తు కూడా కనపడలేదు. ఏమి చేయాలో తోచక అలా వుండిపోయాను. నది అవతల తీరానికి వెళ్ళే దారి ననుసరిండమే కర్తవ్యమని తరువాత నిశ్చయించాను. ఆ సమయంలో నేను చాలా సామాన్యమైన పలుచని వస్త్రం ధరించి వున్నాను. అక్కడ చలి చాలా ఎక్కువగా భరించలేనంతగా వుంది. పైగా ఆకలి దప్పుల వల్ల శరీరం చాలా అలసిపోయింది. ఆకలి తీర్చుకోవడానికి ఒక మంచు ముక్క మింగాను. కాని ఏమీ లాభం లేకపోయింది. ఆ తరువాత కొద్ది క్షణాలకే నేను అలఖ్‌నందా దాటడానికి నీటిలోనికి దిగాను. అలఖ్‌నందాలో కొన్ని చోట్ల నీరు చాలా లోతుగా వుంటుంది. కొన్నిచోట్ల చాలా తక్కువ. తక్కువగా వున్నచోట కూడా మూర లోతుకు తక్కువలేదు. అలఖ్‌నంద వెడల్పు ఇంచుమించు పది గజాలుండవచ్చు. అడుగు భాగం చిన్న చిన్న మంచు ముక్కలతో నిండి వుంది. మంచి పదును గల మంచు ముక్కల ఒరిపిడికి ఆచ్ఛాదనలేని అరికాళ్ళు పుళ్ళు పడిపోయాయి. గాయాల నుంచి రక్తం కారటం మొదలయింది. ఒక వంక కారుతున్న రక్తం చూసి భయపడూతుండగా, మరో వంక అతిదారుణమైన చలితో చైతన్యం కోల్పోతున్నాను. నా కాళ్ళు తొట్రు పడసాగాయి. చాలా సార్లు ఆ మంచు ముక్కలపై పడిపోసాగాను. భరింప శక్యంకాని ఆ అలఖ్‌నందా శీతల గర్భంలో దిగబడి మంచులో గడ్డకట్టుకుపోయి ప్రాణం పోతుందా అనిపించింది. ఆ సమయంలో ఒక్కసారిగాని నేను అలఖ్‌నందాలోని మంచు ముక్కల మీద పడి పోవటం సంభవిస్తే తిరిగి నన్ను ఎవరూ లేవదీయలేనంతగా శరీరం పట్టు తప్పిపోయేది. కాని ఎంతో బాధ సహిస్తూ తీవ్రమైన ప్రయత్నంతో నది అవలి ఒడ్డుకు చేరుకున్నాను. అప్పటి నా స్థితి నిర్జీవంగా వుంది. త్వర త్వరగా నా శరీరం మీద బట్టలు తీసి అరికాళ్ళ నుండి మోకాళ్ళ వరకూ పట్టీలా చుట్టివేశాను. చాలా అలసిపోయి ఆకలి బాధ సహించలేక వికలమైతున్నాను. నడిచే శక్తి నశించి పోతోంది. ఇతరుల సహాయం కోనం ఆశాపూరిత నయనాలతో నలువైపులా చూడసాగాను. కాని మనుషులు లేని ఆ మహారణ్యంలో ఎవరు సహాయపడగలరో ఎక్కడ నుంచి సహాయం అందుతుందో నాకేమీ తెలియలేదు. కాని కడపటిసారిగా నేను దృష్టి సారించగా కొంచెం దూరంగా ఇద్దరు మనుష్యులు రావటం కనబడింది. కొలదిసేపటిలోనే ఇద్దరు గిరిజనులు నా వద్దకు వచ్చి నమస్కారం చేశారు. తమ యింటి కొస్తే భోజన సామగ్రి లభిస్తుందని చెప్పి వారు నన్ను తమతో యింటికి రమ్మని

ఆహ్వానించారు. వారు నా కష్ట గాధను విని నన్ను సత్‌పత్ అనే స్థలానికి చేరుస్తామని వాగ్దానం చేశారు. కాని నాకు నడిచే ఓపిక లేకపోవడం వల్ల వారు చెప్పినది అంగీకరించలేకపోయాను. వారు బలవంతపెట్టినా నా నిశ్చయం మారలేదు. మరణించనైనా మరణిస్తాను గాని వారి అభ్యర్థన మన్నించలేనని స్పష్టంగా చెప్పివేశాను. చావు గురించి ఆలోచించగానే నేను కొంచెం కంగారు పడ్డాను. కాని తిరిగి వెంటనే ఇదేమిటనుకున్నాను. నేను మరణించాలని ఎందుకనుకుంటున్నాను. జ్ఞానోపార్జనలో నిమగ్నుడనై యీ జీవితాన్ని చాలించటం నాకు శ్రేష్టమైన కర్తవ్యం కాదా? చూస్తూ వుండగానే ఆ ఇద్దరు గిరిజనులు పర్వత పంక్తుల మధ్య ఎక్కడికో అదృశ్యమై పోయారు. కొంతసేపు విశ్రాంతి తీసుకొన్న తర్వాత తిరిగి పోదామని ప్రయత్నించాక "సుధార్" అనే పవిత్రస్నాన తీర్థం వద్ద కొంత సేపు ఆగి 'మానా' గ్రామానికి రెండో వైపు నడవ సాగాను. రాత్రి ఎనిమిది గంటలకు బదరీనాథ్ దేవాలయం చేరుకున్నాను."

ఈ పై వివరణ బట్టి స్వామి దయానంద సామాన్య మానవుడు కాదని స్పష్టమవుతుంది. సత్య - జ్ఞానాన్వేషణ చూపిన చోటకే ఆయన చేరుకున్నాడు. నిజమైన యోగుల మహాత్ముల అన్వేషణలో అమిత కష్టాలను కూడా ఆయన కష్టాలుగా భావించలేదు. తన గమ్యం చేరటానికి సర్వస్వం త్యజించడానికి ఆయనెప్పుడూ సిద్ధంగా వుండేవారు. యోగులు మహాత్ములంటే ఆయనకి పిచ్చి, ఆ వెర్రి అన్ని హద్దులను దాటిపోయింది. ఇంతకు ముందు కూడా సత్య జ్యోతిని అన్వేషించే వారిలో చాలా తక్కువ మంది ఇన్ని కష్టాలు సహించి వుంటారు. బదరీనాథ్‌లో రాత్రి గడపి స్వామి దయానంద కాశీపురానికి బయలుదేరి వెళ్ళి పోయారు. చలికాలమంతా అక్కడే గడిపారు. కాశీపురాన్నుంచి ఆయన ఘడముక్తేశ్వర్ వెళ్ళారు. అలా ఆయన రెండేళ్ళ పాటు హిమాలయాలలో వున్నారు. ఘడముక్తేశ్వర్‌లో స్వామి దయానంద ఒక విశిష్ట ప్రయోగం చేశారు. కొంతకాలం నుంచి ఆయన 'హఠప్రదీపిక', 'యోగబీజము' 'శివసంధ్య' వంటి గ్రంథాలు అధ్యయనం చేస్తూండే వారు. శరీరంలో ఒక తెలియని జటిలమైన తంత్రంగా భావించే నాడీ చక్ర వర్ణన ఈ గ్రంథాలలో గోచరించింది. ఘడముక్తేశ్వర్‌లో ఆయన గంగానదీతీరాన నివశించే వారు. ఒకనాడు ఆయనకు గంగలో ఒక శవం తేలుతూ కనబడింది. హఠయోగంలో చదివిన నాడీ చక్ర పరీక్షకు చక్కని అవకాశం లభించిన దనుకొన్నారు. గంగలో దిగి ఆ శవాన్ని బయటకు తెచ్చారు. ఒక చాకు తీసుకొని ఆయన ఆ శవాన్ని ఆ గ్రంథంలో ఇచ్చిన సూచనల ప్రకారం కోయడం ఆరంభించారు. నాడీచక్రంలో చెప్పిన ఏ భాగమూ దానిలో కనబడకపోవటం వలన ఆ గ్రంథాన్ని

ముక్కలు ముక్కలుగా చేసి వాటిని గంగానదిలో కలిపి వేశారు. సత్యాన్ని తప్ప దేనినీ అంగీకరించని స్వామి దయానంద సత్య తత్పరతని ఈ సంఘటన స్పష్టంగా సూచిస్తుంది.

ఘడముక్తేశ్వరానికి సమీపంలోని గంగా నదీ తీరాన కొంతకాలం గడిపాక ఆయన ఫర్రూఖాబాద్ చేరి అక్కడ నుంచి కాన్పూరు వెళ్ళారు. కాన్పూరు అలహాబాద్‌ల మధ్య కొన్ని చోట్ల ఆయన ఇంచుమించు అయిదు నెలలు గడిపి తిరిగి వింధ్యాచలం వెళ్ళి ఒక నెల రోజుల పాటు అక్కడ మకాం చేశారు. ఆ తరువాత సుమారు రెండు వారాల పాటు కాశీలో వుండి అనేక విద్వాంసులతోనూ, పండితులతోనూ శాస్త్ర చర్చలు జరిపారు.

దయానంద నర్మదా ప్రవాహాన్ని దర్శించాలని నిశ్చయించి ఆయన దక్షిణానికి ప్రయాణం కట్టారు. ఈ ప్రయాణంలో కూడా ఆయనకు హిమాలయ యాత్రలో కలిగిన అనుభవాల వంటివే కలిగాయి. దారిలో ఆయన అనేక వన్యమృగాల నెదుర్కొనవలసి వచ్చింది. అయినా ఆయన తన ప్రయాణాన్ని విరమించ లేదు. ఆయన ఉపవాసాల కలవాటు పడి వుండటం వల్ల ఒకటి రెండు రోజుల పాటు ఏమీ తినకపోయినా వుండ గలిగేవారు. ఆయన స్వయంగా భిక్షాటన చేయక పోయినా శాఖాహారమైతే మాత్రం ఎవరైనా ఇస్తే స్వీకరించే వారు. సాధువుల సంపర్కం వల్ల కలిగిన దురభ్యాసం వలన మాత్రం ఆయన అప్పుడప్పుడూ యాచించే వారు. 1856 - 1859 సంవత్సరాల మధ్య గల తన జీవితాన్ని ఆయన వెలుగులోకి రానీయకపోవటం వలన ఆయన నర్మదా నదీ తీరానికి ఎప్పుడు చేరుకున్నారో మాత్రం తెలియదు. ఈ కాలంలో ఆయన తన సమయాన్ని ఎలా గడిపారో అది కూడా ఇంత వరకు రహస్యంగానే వుండిపోయింది. ఈ కాలంలో మధ్య భారతదేశం లోని విప్లవ కారులతో సంబంధా లేర్పడి 1857లో ప్రథమ భారతీయ విప్లవంలో ఆయన కొంత పాలు పంచుకొని వుంటారని జయచంద్ర విద్యాలంకార్ విశ్వసించారు. దీని గురించి తర్వాత ముచ్చటించుకొందాం.

నర్మదానదీ తీరాన మూడు సంవత్సరాలు గడిపిన తర్వాత దయానంద స్వామి ఉత్తరదిశగా బయలుదేరి 1859లో ఏదో సమయంలో మధుర చేరారు. అక్కడ విరజానంద స్వామి దగ్గర అధ్యయనం కొనసాగింది. వృద్ధి చెందాలనుకున్నారు. దయానంద అంతకు మూడు సంవత్సరాలకు ముందే హిమాలయ యాత్రకు పూర్వం హరిద్వార్‌లోని పూర్ణాశ్రమంలో ఆయన గురించి మొదటిసారిగా విన్నారు. మళ్ళీ నర్మదాతీరంలో ఆయన గురించి వినగలిగారు. అందువలన ఆయన సాన్నిధ్యంలో జ్ఞానాభివృద్ధి చేసుకొనవచ్చని తహతహలాడారు. అప్పటికి స్వామి విరజానందుల వయస్సు 80 సంవత్సరాలు. అయిదేళ్ళ వయసులో మసూచి వచ్చి ఆయనకి కళ్ళు

పోయాయి. ఆయన పరిపూర్ణ జ్ఞానము గల మహాత్ముడు. వైదిక విజ్ఞానమంటే ఆయనకు గల ఉత్సాహం చాలా తక్కువ మందిలో అరుదుగా కనబడుతుంది. ఆయన గొప్ప వేద విదుడు. 80 సంవత్సరాల ముసలి తనంలో కూడ ఆయన భారతదేశమంతటా వైదిక ధర్మాన్ని పునరుద్ధరించడానికి ఎంత చిన్న ప్రయత్నమైనా సరే చేయాలని ఎంతో వ్యాకుల పడేవారు. ఆయన జ్ఞాపకశక్తి అసామాన్య మైనది. వైదిక వ్యాకరణము, భాషా శాస్త్రాలపైన ఆయనకు సంపూర్ణ అధికార ముండేది. ఆయన పాఠశాల నొకటి స్థాపించి మహర్షి లిఖితములైన ప్రాచీన గ్రంథాలను మాత్రమే బోధించేవారు.

స్వామి విరజానంద దయానందుని తన శిష్యవర్గంలో చేర్చుకోవడానికి సులభంగా అంగీకరించ లేదు. ఈ నూతన శిష్యుడు ప్రౌఢావస్థలో నుండడమూ, అందునా సన్యాసి కావటమే ఆయన సంకోచానికి ముఖ్య కారణం. స్వామి విరజానంద, "నీ గ్రంథాలన్నీ యమునలో పారేసి ఇంతవరకూ నీవు నేర్చినదంతా పూర్తిగా మరచిపొమ్మని" దయానందునితో అన్నారు. అదే కాకుండా భోజనం, మకాం చూసుకొనే బాధ్యతనంతా ఆయన మీదనే వేశారు. ఇలా మరొక మారు నిర్ణీత స్థలంలో వుంటూ స్వామి దయానందునికి స్వయంగా తన భోజనపు ఏర్పాట్లు తాను చేసికోవలసి వచ్చింది. ఆయన అదృష్టవశాన మధురలో అమర్‌లాల్ అనే గుజరాతీయుడు బ్రాహ్మణీకం చేస్తూ వుండే వాడు. దయానంద తనలాగే ఉత్తరాది బ్రాహ్మణుడైన ఆయన వద్దకు వెళ్ళారు. ఆయన ఆనందంగా దయానందుని భోజన భారాన్ని వహించడానికి అంగీకరించి పూర్తిగా మూడేళ్ళ పాటు తన యింటి వద్దనే భోజనం పెట్టారు. స్వామి దయానందుని భోజనం పూర్తయిన తర్వాతనే ఆయన భుజించేవాడు. అంత శ్రద్ధగా దయానందుల భోజన ఏర్పాట్లు చూశాడు. యమునానదీ దృశ్యాలను చాలా దూరం వరకూ తిలకించడానికి వీలుగా దేవాలయం అరుగు మీద గది దయానంద నివసించడానికి దొరికింది.

మధురలో చాలాకాల ముండటానికి అన్ని ఏర్పాట్లూ చేసుకొని తన గ్రంథాలన్నీ యమునార్పణం చేసి ఆయన తన కొత్త గురువు గారి వద్ద చేరారు. గురువుగారు తమ శిష్యులకి పాఠం చెపుతున్నారు. ఆ వృద్ధుని శరీరం పైన ఎక్కడో పలచగా మాంసం కనిపిస్తున్నా బోధించే వుత్సాహం మాత్రం చాల ఆశ్చర్యజనకంగా వుంది. ఆయన బుద్ధి చాలా తీక్షణమైనది. బ్రహ్మాండమైన వైదిక సాహిత్య మంతా ఆయనకు కరతలామలకమై సుగమంగా వుంది. వేదాంతము, సాహిత్య గ్రంథాలు వేద వేదాంత గ్రంధాలలోని ఏ భాగమైనా చాలసేపు తమ జ్ఞాపక శక్తితో పునశ్చరణ చేయగలిగేవారు. ఇక్కడ స్వామి దయానంద, పాణిని 'అష్టాధ్యాయి', మహాభాష్యం అధ్యయనం చేశారు. ఈ రెండింటినీ

స్వాధీనం చేసుకొని పరిపూర్ణ వైదిక సాహిత్య భండారం కంఠస్థం చేసి పాండిత్యాన్ని సంపాదించారు. ఋషులచే రచింపబడి, ప్రాచీన గ్రంథాలలో సంగ్రహింపబడిన వాటిని గురుచరణాల సన్నిధిని అధ్యయనం చేసి యదార్థ జ్ఞానాన్ని పొందానని దయానందకు ఆనందం కలిగింది. గురువు, శిష్యుని సందేహాలన్నిటినీ తొలగించి అతని ముందు తన అమూల్య జ్ఞాన భండారాన్ని తెరచి వుంచారు. దయానందుని మనసులో ఎటువంటి సందేహానికి అస్కారం లేని విధంగా వైదిక సాహిత్య మర్మాలను గురువు వెల్లడించారు. "అష్టాధ్యాయి" మహాభాష్యమే గాక స్వామి దయానంద వైదిక సాహిత్యంలోని 'నిరుక్త' నిఘంటువులను కూడా అధ్యయనం చేశారు.

ఆ గురువు గారి క్రమ శిక్షణ చాల కఠోరమైనది. ఆయన ఏ పాఠమూ రెండవసారి ఉపదేశించే వారు కాదు. అందువలన శిష్యులు జాగ్రత్తగా వినవలసి వచ్చేది. ఒకసారి స్వామి దయానంద 'అష్టాధ్యాయి'లోని సూత్రాలలోని కొన్ని విషయాలు మరచి పోయారు. వాటిని గురించి తిరిగి మరొకసారి ఉపదేశించమని ప్రార్థించగా గురువు నిరాకరించుట యేగాక జ్ఞాపకము చేసికొని చెప్పజాలని యెడల యమునలో ప్రాణ త్యాగము చేయమని ఆదేశించారు. ఆ పిమ్మట దయానంద ధ్యాన మగ్నులై వాటిని జ్ఞాపకము చేసుకొన్నారు.

స్వామి దయానంద తిరిగి ఎన్నడూ మరియొక గురువుని అన్వేషించలేదు. కనుక తాము పొంద గోరిన దంతా తన గురు చరణాల ముందు ఆశీనుడై పొందారని నిస్సంయముగా అనుకోవచ్చు. ఈ విధంగా తన ప్రవాస జీవితంలోని మూడు సంవత్సరాల కాలంలోనూ ప్రతిక్షణం శ్రీ గురు చరణాల ముందు గడిపి దయానంద క్రొత్త దారి తొక్కారు - కొత్త యోగులను దర్శించడమూ, కొత్త జ్ఞానాన్ని అన్వేషించడమో కాకుండా కర్మ మార్గాన్ని గ్రహించారు. చీకటిని పారద్రోలి వెలుగు చూపగలిగేలా గురూ పదేశాలకూ, మాటలకూ దయానంద కార్య రూపాన్నివ్వదలిచారు. విద్య పూర్తి చేసుకొన్న శిష్యుడు ఏమేమి చేయవలెనని గురువు ఆదేశించారో మనం ముచ్చటించు కోవచ్చు. స్వామి దయానంద గురు దక్షిణగా అర్థశేరు లవంగాలను దోసిట పట్టి స్వామి విరజానందుల సమక్షాన నిలబడినపుడు గురువు శిష్యునికీ ఉపదేశమిచ్చారు.

"సౌమ్యుడా! నిన్ను ఏ రకమైన సంపదనీ దక్షిణగా ఇమ్మని కోరదలచుకొనలేదు. నీ జీవితాన్నే గురు దక్షిణగా ఇమ్మని కోరుతున్నాను. నువ్వు జీవించినంతకాలమూ ఆర్యావర్తంలో ఆర్ష గ్రంథ మహిమను ప్రతిష్టాపించెదవనీ, అనార్ష సాహిత్యాన్ని ఖండించి భారతదేశంలో వైదిక ధర్మాన్ని స్థాపించడానికి ప్రాణాలను సహితం అర్పించెదననీ ప్రతిజ్ఞ

చేయి."

గురువు గారిది చాలా పెద్ద కోరిక. మరో శిష్యుడయితే సమాధానం చెప్పే ముందు చాలా ఆలోచించేవాడు. కాని స్వామి దయానంద వేరే లోహంతో తయారయిన వ్యక్తి. ఆయన తన గురువును గుర్తించ గలరు. గురువు కూడా ఎవరు సరైన శిష్యులో గ్రహింపగలరు. అందువల్ల గురువు అభ్యర్థన విని దయానంద కంగారు పడలేదు. బహుశా ఆది నుండీ దీనికి సన్నద్ధులై యున్నారేమో. ఈ షణ్మాత్రమైనా అభ్యంతరం చెప్పకుండా గురువుగారి అభిమతాన్ని శిరసావహించారు.

జవాబుగా శిష్యుడు "అలాగే" అని మాత్రం చెప్పి గురువుకి సాష్టాంగ ప్రమాణం చేసి మధుర విడిచివెళ్ళారు.

4

# కోలాహలం మధ్య

మధురలో స్వామి దయానంద తమ గురువు విరజానందుని సన్నిధిలో జ్ఞానామృతమంతా జుర్రుకున్నారు. గురువు వద్ద నేర్చిన విద్యకు కార్యరూపమిచ్చారు. ఇన్నాళ్ళూ జ్ఞానజ్యోతి కోసం సాధువుల వెంట, సత్పురుషుల సాంగత్యంలో ధ్యానయోగమగ్నమై అడవుల వెంట, పర్వతాల వెంట సంచరిస్తూండే ఆయనకి మధురలోని ఆ మహాత్ముని వద్ద తను అన్వేషిస్తున్నదంతా లభించింది. ఆయనిప్పుడు తన జీవన స్రవంతిని మళ్ళించి, తనకు మార్గం చూపిన (నిజలోక) ద్వారం ముందు నిలబడ్డారు. ఆ లోకాన్ని సంస్కరించడానికే ఆయన తిరిగి వచ్చారు.

అది అపారమైన ధైర్యం, దృఢసంకల్పం, సాహసం, వివేకం కోరే భగీరథ ప్రయత్నం లాటిది. దయానందునిలో ఈ గుణాలు చాలినంతగా వున్నాయి. 1863లో ఏప్రియల్‌మాసంలో ఆయన తన సంకల్పాన్ని పూర్తిచేయడానికి పూర్తి ఉత్సాహంగల మనస్సుతో తన కొత్త ఉద్యమాన్ని ఆగ్రాలో మకాం చేసినపుడు ఆరంభించారు. అక్కడ ఆయన యోగాభ్యాసంతో బాటు కొంత సమయం సమాధిస్థితికి, భగవద్గీతా అధ్యయనానికి వెచ్చించేవారు. సంధ్యావందన ప్రచారానికై ఆయన తన భక్తులకు, ఇతరులకు గాయత్రీమంత్రం ఉపదేశించారు. ఆ ఉద్దేశ్యంతోనే 'సంధ్యోపాసన' అనే పుస్తకం వేలకొలది ప్రతులు పంచిపెట్టారు. వైదిక సందేశ ప్రచారం విషయంలో, హిందూ సమాజ సంస్కరణ విషయంలో ఇంకా ఆయన ఒక నిర్ణయానికి రాలేదు. స్వామి విరజానంద దేనిని ఆశించి దయానందునికి బాధ్యత అప్పగించారో, దేనికోసం దయానందునిపై ఆశ పెట్టుకున్నారో ఆ విషయంలో దయానందుని మౌనం విరజానందుని కలవర పరచింది.

జీవితంలో మొదటినుంచీ విగ్రహారాధనను వ్యతిరేకించిన దయానంద 40-50 సంవత్సరాల మధ్యవయస్సులో శైవమతం పట్ల మొగ్గుతూ వున్నట్లు కనబడడం చాలా

ఆశ్చర్యకరం. జయపూర్‌లో దయానంద కొంతమంది వైష్ణవ పండితులతో శాస్త్రార్థ చర్చజరిపి వారిని ఓడించడమే కాక జయపూర్ మహారాజుకు కూడా శైవమత దీక్ష నిచ్చారు. కాని పుష్కర్‌లోనూ, అజమేర్‌లోనూ స్వామి దయానంద వైష్ణవ శైవమతాలను రెండింటినీ ఖండించారు. విగ్రహారాధనకు ప్రాధాన్యమిచ్చి ఈ రెండు మతాలు, సంప్రదాయ సమాజాన్ని నాశనం చేస్తున్నట్లు ఆయనకి గోచరించింది. ఈశ్వరుడు నిరాకారుడని ఆయనకు స్పష్టంగా తోచింది. విగ్రహారాధన చేస్తున్న వారు చీకట్లో వెతుకులాడుతున్నట్లే. అజమేర్‌లో స్వామీజీ ముస్లిం మౌల్వీలతోనూ, క్రైస్తవ ఫాదరీలతోనూ - ఈశ్వరుడు, జీవుడు, జననం, పునర్జన్మ-వీటి గురించి చర్చించారు. చట్టరీత్యా గోవధ నిషేధమెంత అవసరమో కర్నల్‌బ్రుక్‌ను ఒప్పించారు.

సుమారు మూడు సంవత్సరాల తర్వాత దయానంద మధుర తిరిగివచ్చారు. తమ గురువు గారి దగ్గరకు వచ్చి రెండు కాసుల బంగారం, వస్త్రాలు బహూకరించారు. కొన్ని సందేహాలుంటే వాటిని నివృత్తి చేసుకొన్నారు. 1866లో హరిద్వార్‌లో కుంభమేలా జరుగుతోంది. దయానంద కూడా అక్కడకు జేరి నగరానికిమూడు మైళ్ళ దూరంలో మకాం చేశారు. అందర్నీ ఆకర్షించే ఆయన వ్యక్తిత్వం వల్ల, ప్రగాఢమైన పాండిత్యం వల్ల ఆయన ఉపదేశం వినడానికి వందలాది మంది ఆయన బస చుట్టూ చేరేవారు. స్వామి దయానంద, ముందుగా కొన్ని వేద మంత్రాలను పఠించేవారు. వేదపఠనం తర్వాత ఈశ్వరుని ఏకత్వాన్ని వివరించి, విగ్రహారాధనని తీవ్రంగా ఖండించే వారు. ఆ యుక్తి పూర్వక వివరణలకు, సమర్థనలకీ శ్రోతలు ముగ్ధులై వింటూనే వుండేవారు. విగ్రహారాధనను నిందించటమేకాక దయానంద హిందువులలోని దోషాలనూ, వారి అంధ విశ్వాసాలనూ ఎంతో విమర్శించే వారు. తన గురువుకి లేనట్లే దయానందకు కూడా పురాణాలపైన నమ్మకం లేదు. ఆయన వాటిపై కూడా విపులంగా వ్యాఖ్యానిస్తూండేవారు. సత్కార్యాచరణ ద్వారా మాత్రమే శాంతి, మోక్షం కలుగుతుందని ఆయన వక్కాణిస్తూండేవారు. చేసిన పాపాలు, చేసిన దుష్కార్యాలు కడిగి వేసుకొనడానికి పర్వదినాలలో పవిత్ర నదీజలాలలో మునిగిలేస్తూ, వెంటనే మళ్ళీ చెడుపనులు చేయడంలో అర్థం లేదని ఆయన తన శ్రోతలకు బోధిస్తూండేవారు. హరిద్వారంలో స్వామి దయానంద అనేకమంది మానసిక ప్రవృత్తులనీ, జీవనసరళినీ మార్చగలిగారు. కాని అక్కడచేరిన సాధువుల ఆడంబరాలు చూసి ఆయనకు ఎంతో మనస్తాపం కలిగింది. మహంతులు చేసే ఐశ్వర్య ప్రదర్శన చూశాక, ఆయనకు తన వద్దనున్న వస్త్రాలు, పుస్తకాలు, డబ్బు - సమస్తం విడిచిపెట్టి వేయాలన్నంత అసహ్యం వేసింది. వాటిని

ఆయన అక్కడున్నవారికి వెంటనే పంచి పెట్టివేశారు. తన మహా భాష్య ప్రతిని పొడవైన బట్టల తాను ముక్కనూ ముప్పయి అయిదు రూపాయల రొఖ్ఖాన్ని ఆయన తమ గురువుగారి దగ్గరకు పంపివేసి కేవలం కౌపీనం ధరించి వుండిపోయారు. వంటినిండా భస్మం పూసుకొని, గోచీ ధరించి,దండం చేతబట్టి గుర్తు పట్టడానికి వీలు లేనంతగా మారిపోయారాయన. టి.జె. స్కాట్ వ్రాతలను బట్టి, "స్వామి దయానంద వ్యక్తిత్వం చాలా ఆకర్షణీయమైనది. సమ్మెట పోటులవంటి తన విధానాల ఒకే ఒక వేటుతో ప్రత్యర్థులను చిదగకొట్టే ప్రబల ఉత్సాహం ఆయనలో వుంది."

హరిద్వారం నుంచి సుదూర తీరాల వరకు దయానందుని పేరు పాకిపోయింది. ఆయన ఉపదేశాలు వినడానికి పెద్దసంఖ్యలో ప్రజలు గుమిగూడసాగారు. తన శ్రోతల సందేహాలు తీర్చడంలో ఆయనకు ఎంతో ఆనందం కలిగేది. ఆయన ఏ సభలోనైనా ఉపన్యసించేటప్పుడు సంధ్యావందనం, గాయత్రీజపం, అగ్నిహోత్ర విధి నిర్వర్తించమని ఉపదేశించారు. హరిద్వారం మేలాకోసం వచ్చిన జనం పలుచబడగానే స్వామీజీ కూడా తమ మకాం ఎత్తివేసి ప్రచార యాత్రకి బయలుదేరారు. దారిలోవున్న ముఖ్య ప్రదేశాలలో వుపన్యాసాలిచ్చారు. హరిద్వారం నుంచి ఫర్రూఖాబాద్ వెళ్ళారు. అక్కడినుంచి అనూపశహర్ వెళ్ళారు. స్వామీజీ ప్రభావం చేత వల్లభ సంప్రదాయంలోని చక్రాంకిత శాఖ తన మూలశాఖతో సంబంధం తెంచుకుంది. రాయ్‌ఘాట్‌లో దయానందుని వాదం విని ఒక బ్రాహ్మణుడు విగ్రహారాధన శాశ్వతంగా వదిలిపెట్టేశాడు. కరనవాసంలో కూడా స్వామీజీ శాస్త్రార్థ వాదనలో అంబాదత్తు అనే ఒక సంస్కృత పండితుని ఓడించారు. అచటి ప్రజలు సమ్మోహితులయ్యేలా విగ్రహారాధన వేద విరుద్ధమని ప్రకటించారు. ఒక బ్రాహ్మణ పండితుడు దయానందునితో వాదించక మునుపు స్వామీజీచేత విగ్రహాలకు నైవేద్యం పెట్టిస్తానని పంతంపట్టి ఆరు రోజులపాటు పెద్ద సభలో శాస్త్ర చర్చ చేసి తన ఓటమిని అంగీకరించాడు. ఆ హీరావల్లభ పండితుడు విగ్రహాలను గంగలో కలుపవలసి వచ్చింది. స్వామి దయానంద కీర్తిదావాగ్నిలా వ్యాపించ సాగింది. అంగదశాస్త్రి కూడా అదేవిధంగా తన దేవతా ప్రతిమలను గంగార్పణం చేసి ఇక భాగవత పురాణ ప్రవచనం చేయనని ప్రతిజ్ఞ చేశారు.

కరనవాసంలో చక్రాంకిత సంప్రదాయానికి చెందిన ఎవరో రంగాచారి గారి శిష్యుడు కర్ణసింహుడనే రాజపుత్రునితో దయానందునికి తత్తరపాటు కలిగించే సన్నివేశం జరిగింది. కర్ణసింహుడు సన్యాసి. అయినా రాజపుత్ర సంప్రదాయానికి భిన్నంగా దయానందునిపై కత్తి దూసాడు. ఆ తరువాత రాజపుత్ర సన్యాసి స్వామి దయానందుని

హత్య చేయడానికి ఇద్దరు వస్తాదులను పంపాడు, కాని వారి ప్రయత్నం కూడా భగ్నమయింది. ఈ హత్యా ప్రయత్నాలకు ఆయన చలించలేదు. చక్రాంకిత సంప్రదాయం ఉత్తర హిందూ దేశ ప్రజల హృదయాలలో గట్టిగా నాటుకొని వుంది. ఇది చూసి ఆ సంప్రదాయం పైన ఆయన తీవ్రమైన వ్యాఖ్యానాలు చేసేవారు. ఆ విమర్శల నెవరూ నిరోధించలేక పోయేవారు.

కరనవాసం నుంచి దయానంద అంబాగఢ్, శాహబాజ్‌పురం, కాయమ్‌గంజ్ మీదుగా 1868లో ఫర్రూఖాబాద్ చేరుకున్నారు. అక్కడ ఆయన ఎంతోమందికి ఉపనయన సంస్కారం జరిపించి సంధ్యావందనం, అగ్నికార్యం చేయవలసినదిగా గట్టిగా ఉపదేశించారు. ఇక్కడ కూడా స్వామికి ఇద్దరు విద్వాంసులతో విగ్రహారాధన విషయంలో శాస్త్రచర్చ చేయాల్సి వచ్చింది కాని చివరికి వారు కూడా విగ్రహారాధన వేద విద్యా విరుద్ధమని అంగీకరించారు. ఫర్రూఖాబాద్‌లో ఉన్న సమయంలోనే జర్మనీ దేశం నుంచి వచ్చిన నాలుగు వేదాల పుస్తకాల ప్రతులు దయానంద అందుకొన్నారు. వైదిక సాహిత్యములో శిక్షణ గరపడానికి ఆయన ఫర్రూఖాబాద్‌లో ఒక సంస్కృత పాఠశాల నెలకొల్పారు. ఆ వూరిలో కొంతమంది నవ యువకులు, క్రైస్తవ మతంలో చేరగోరినా దయానందుని సహచర్యం వల్ల వారు తమ అభిప్రాయాలు మార్చుకొన్నారు. ఫర్రూఖాబాద్‌లో కొన్ని రోజులు గడిపాక దయానంద కాన్పూరు చేరి ఇదివరలో ఓడిపోయిన ఇద్దరు పండితులతో మరొకసారి శాస్త్ర చర్చ జరిపారు. అక్కడి సభ సహాయక కమిషనర్ డబ్ల్యు. థాయర్ అధ్యక్షతన జరిగింది. దయానంద కనుకూలంగా తీర్పు లభించింది. దీనివల్ల కాన్పూరులో చాలామంది దయానంద కనుకూలురయ్యారు. ఇరవైమందికి పైగా తమ దేవతా విగ్రహాలను పారవేశారు.

1869లో స్వామి దయానంద వారణాసి చేరుకున్నారు. అక్కడి పండితులతో విరామం లేకుండా నాలుగు గంటలపాటు శాస్త్ర చర్చలు జరుగుతూ వుండేవి. దురదృష్టవశాత్తూ విగ్రహారాధకుడైన కాశీ మహారాజు ఈశ్వరీ ప్రసాద్ నారాయణసింహ అనే ఆయన సభా నిర్ణాయకుడిగా వున్నాడు. నిష్పక్షపాతంగా నిర్ణయం చేయలేకపోతున్నాడాయన. ఈ చర్చలు వినడానికి సుమారు 50వేలమంది సభకు వచ్చారు. ప్రత్యేకంగా ఎన్నికైన ఆరు మంది పండిత శ్రేష్ఠులు దయానందునితో శాస్త్రార్థ చర్చలు సాగిస్తున్నారు. ఇంకా ఎంతోమంది వ్యతిరేకులైన పండితులు ఏ విధంగానూ దయానందను నెగ్గనీయరాదనే దృఢ నిర్ణయంతో నలువైపులా చుట్టుముట్టారు. విగ్రహారాధన వేద సమ్మతమా! కాదా? అనే విషయం చర్చనీయాంశము. కాని ఆ

పండితులందరూ అసలు విషయాన్ని దాటవేసి పురాణాల ప్రామాణికతపై రగడ లేవదీసారు.

చీకటి పడే సమయానికి వామనాచార్యుడనే పండితుడు అస్పష్టమైన వ్రాతలో శిథిలావస్థలో గల రెండు పుటలు చూపి అవి వేద గ్రంథంలోని పుటలనీ, యజ్ఞంలో పదవరోజున పురాణ శ్రవణం జరగాల్సినదిగా వ్రాసివున్నదని వాదించాడు. నిజం చెప్పాలంటే ఆ పుటల్లో ఏ వేదమో ఉల్లేఖించ బడలేదు. ఏ వేదంలోని ఏ సందర్భమో కూడా వివరించబడలేదు. ముందుగా పన్నిన పన్నాగం ప్రకారం పండితులూ, వారి సహచరులు దయానంద ఓడిపోయాడని పెద్ద గోలచేశారు. పండితుల పక్షాన తన తీర్పు ప్రకటించి మహారాజు వెళ్ళి పోయాడు.

పండితుల ఈ దురాగతానికి స్వామి దయానంద చాలా విచారించారు. కొన్ని వార్తా పత్రికలు స్వామి దయానందనే సమర్థిస్తూ విజయం స్వామికే లభించినదని ప్రచురించాయి. స్వామిపై రాళ్ళు విసరడానికి సిగ్గుపడని పండితుల అనాగరిక ప్రవర్తనపై విచారాన్ని ప్రకటించాయి.

శాస్త్ర చర్చ పూర్తికాగానే అందరికీ స్వామి దయానందే జయించారనే వాస్తవం వెల్లడయింది. పురాణాలు, ఋషి విరచితాలు కావనే దయానందుల వాదాన్నీ, వాటిలో అనేక గాథలు అభూతకల్పనలనీ తాను అంగీకరిస్తే కాశీరాజు దృష్టిలో తేలికయిపోతానని రాజపండితుడైన తారనాథ్ తారకత్న ఒకనాడు చంద్రశేఖరుడనే బెంగాలీ పెద్దమనిషి ముందు అంగీకరించాడు. అదేవిధంగా కాశీ మహారాజు ఈశ్వరీప్రసాద్ నారాయణ సింహ కూడా తనప్రవర్తనకు పశ్చాత్తాపపడి దయానందుని తన యింటికి పిలిపించుకొని పూలమాలతో సత్కరించి, బంగారు సింహాసనంపై కూర్చొనబెట్టి తను మాత్రం వెండి సింహాసనం పైన కూర్చున్నాడని చెప్పుకుంటారు. తన పూర్వీకులు శివునీ, ఇతర దేవతలను పూజించే వారు కనుక తాను కూడా వారి అడుగుజాడలలోనే నడవవలసి వచ్చినదని, ఆయన దయానందుని ఎదుట స్పష్టంగా అంగీకరించినట్లూ, శాస్త్ర చర్చా సమయంలో తన ప్రవర్తన క్షమించమని దయానందుని కోరినట్లు జనం చెప్పుకునేవారు. ఆ శాస్త్రార్థ చర్చా సమయంలో మధ్యలో కలుగచేసుకొని వాదించిన పండిత బాలశాస్త్రి, ముల్తానుకు చెందిన గోస్వామి ఘనశ్యామదాసుతో, తనకు స్వామితో శాస్త్రార్థ చేయడానికి సమర్థత లేదని చెప్పాడు.

కాశీలో దయానంద ఒక నెల రోజులున్నారు. అక్కడ ఆయన చాలామంది అనుయాయుల శంకలను నివృత్తి చేసి అనేక ఉపన్యాసాల ద్వారా ఈశ్వరుని ఏకత్వాన్ని

ప్రతిపాదిస్తూ ఏ విధమైన బాహ్యాడంబరమూ లేకుండా ఈశ్వరోపాసన చేయాలని ఎంతో బోధించారు. కాశీ నుంచి ఆయన కుంభమేలా కోసం, వేలకొలది యాత్రికులు వచ్చే ప్రయాగ వెళ్ళారు. దయానందుల రాక తెలియగానే ఆయనను దర్శించడానికి, ఆయన ఉపన్యాసం వినడానికి అక్కడి ప్రజలు చాలా తహ తహ లాడారు. అక్కడ కూడా ఆయన నిరాకార ఏకేశ్వరోపాసనే వాంఛనీయమని ప్రబోధించారు. యోగాభ్యాసం అధ్యాత్మకంగా వున్నతమైనది, ఆరోగ్యకరమైనది. అలాంటి యోగాభ్యాసం ఎంత అవసరమో నొక్కి చెప్పారు. ఆ కుంభమేలా సందర్భంగా అక్కడికి విచ్చేసిన మహర్షి దేవేంద్రనాథ్ ఠాకూర్ కూడా దయానందను కలుసుకొని కలకత్తా రమ్మని ఆహ్వానించారు. స్వామి కూడా అందుకు అంగీకరించారు. ప్రయాగలో కొంతమంది క్రైస్తవ మతం స్వీకరించదలచిన హిందువులను దయానంద ఆ ప్రయత్నం నుంచి విరమింపజేశారు. మాధవ చంద్ర చక్రవర్తి అనే పెద్దమనిషి నాస్తికుడు, త్రాగుబోతు, ఇంకా ఇతర దుర్వ్యసనాలకు గురి అయినాడు. దయానంద అతని జీవితంలో ఆకస్మికంగా పరివర్తన కలిగించారు. చక్రవర్తి ఓవరుసీయర్‌గా పదవీ విరమణ చేశాడు. చాలా డబ్బు కూడబెట్టాడు. అతను తాను గొప్ప తార్కిడనుకొనేవాడు. అతను దయానందపై ప్రశ్నల జడివాన కురిపించాడు. దయానంద ప్రతి ప్రశ్నకు చక్కని సమాధానం చెప్పారు. అంతే. మాధవ చంద్ర చక్రవర్తి దయానంద శిష్యుడై పోయాడు. మంచి ఆర్యుడై నియమం తప్పకుండా సంధ్యావందనం, అగ్ని కార్యం, గాయత్రీ జపం చేసేవాడు. మహమ్మదీయ మిత్రునితోగల వ్యాజ్యములో ఒక యదార్థాన్ని దయానందుని సలహాపై చక్రవర్తి అంగీకరించడం వల్ల చక్రవర్తి వ్యాజ్యం ఓడిపోయాడు. కాని అతను విచారించలేదు.

ప్రయాగ నుంచి దయానంద మీర్జాపురం వెళ్ళి సంస్కృత వైదిక పాఠశాల స్థాపించారు. వారణాసి వెళ్ళి అక్కడ వేద విరుద్ధ ఆచారాలనూ, బూటకపు మిథ్యా సిద్ధాంతాలనూ ఖండిస్తూ ఉపన్యాసాలు ఇచ్చారు. కాస్‌గంజి చేరి అక్కడ కూడా ఆయన ఒక సంస్కృత పాఠశాల తెరిచారు.

1870లో స్వామి దయానంద అనూపశహర్ చేరుకున్నారు. అప్పుడు అక్కడ విజయదశమి వుత్సవం జరుపుకొంటున్నారు. స్వామి దయానంద ఉత్సవానికి వ్యతిరేకి. అందుచేత ఆ రామలీల ఉత్సవాలకు వ్యతిరేకంగా అనేక ఉపన్యాసాలు ఇచ్చారు. సామాన్య మానవులు సీత, రాముల వంటి మహనీయుల పాత్రలను అభినయించరాదని ఆయన అన్నారు. భక్తులు సీతారాములు వంటి ఉదాత్త చరితుల జీవితాలను అధ్యయనం చేసి వారి అడుగు జాడలలో నడచుకొనే యత్నం చేయాలనీ, అదే రామలీల

యొక్క ఉద్దేశ్యమని ఆయన భావన. జీవుడు, బ్రహ్మ ఈ రెండు వేరు వేరని, చనిపోయిన వారికి శ్రాద్ధ కర్మలు చేయడం తప్పనీ విపులీకరించారు. అనూపశహర్‌లో కూడా ఆయన విగ్రహారాధనకు వ్యతిరేకంగా నిరాకార బ్రహ్మోపాసన గురించి ప్రబోధించారు. కాని ఒక బ్రాహ్మణుడు మాత్రం తమలపాకు పట్టీలో దయానందునికి విష ప్రయోగం చేసేటంతగా విసుగుచెందాడు. తనకు విష ప్రయోగం జరిగినదని తెలియగానే దయానంద యోగ ప్రక్రియల ద్వారా బయటకు కక్కి విష ప్రభావాన్ని తొలగించి వేసికొన్నారు. కాని ఆ బ్రాహ్మణుని బందీ చేసి దయానంద వద్దకు తీసుకొని రాగానే ఆయన అతనిని విడిపించి, మహమ్మదీయ తహశీల్దారుతో "నేను యిచటకు ఎవరినీ బంధించడానికి రాలేదు. బంధ విముక్తులను చేయడానికే వచ్చానని" చెప్పారు. దుర్మార్గుడెవరో తన దుర్మార్గాన్ని విడవకపోతే తను మాత్రం తన సన్మార్గాన్ని ఎందుకు వదలాలని ఆయన ప్రశ్నించారు.

స్వామి దయానందుల ఈ ఔదార్యానికి తహశీల్దారు చకితుడై ఆ అపరాధిని విడిచి పెట్టారు. అనూప్‌శహర్‌లో స్వామి దయానంద గోవధను గురించి కూడా కొన్ని ప్రశ్నలు తన ఉపన్యాసాలలో వేశారు. ఇంగ్లాండు వెళ్ళి విక్టోరియా రాణిని, అక్కడి ఉన్నతాధికారులనూ కలుసుకొని గోవధ నిషేధించడానికి శాసనం చేయించే ప్రయత్నం చేస్తానని శ్రోతలకు చెప్పారు. ఆయన బ్రిటిష్‌వారి పరిపాలనను సహితం విమర్శించారు. గ్రామపంచాయితీలు, గ్రామపంచాయితీ న్యాయ వ్యవస్థను స్థాపించడంలో జరుగుతున్న జాప్యం పట్ల తన అసమ్మతిని ప్రకటించారు.

స్వామి దయానంద అంటరానితనానికి పూర్తిగా వ్యతిరేకి. అంటరానితనాన్ని అంతం చేయడానికి ఎంతో ప్రోత్సహించేవారు. ఒకసారి ఒక మంగలి, స్వామి చెప్పేవాటిపై సందేహం కలిగి ఆయనను పరీక్షింప దలిచాడు. ఒకనాడు అతను స్వయంగా తన యింటి నుంచి భోజనం తెచ్చి స్వామికి పెట్టాడు. స్వామి దానిని ఎంతో ఆసక్తిగా భుజించి, అతనిని ఎంత ఆశ్చర్యపరచారో, అంతకంటే ఎక్కువగా అతనిని సంతోషపరచారు.

1872లో దయానంద బ్రహ్మసమాజ మత కేంద్రమైన కలకత్తా చేరారు. దేవేంద్రనాథ్ ఠాకూర్, కేశవ చంద్రసేను, అందరికంటే ప్రసిద్ధి చెందిన బ్రహ్మ సమాజ నాయకులు. వీర్దిరి ఆలోచనా సరళిలోనూ చాలా తేడాలుండేవి. వీరిలో మొదటివారు ప్రాచీన వైదిక సాహిత్యం వైపు మొగ్గు చూపేవారు. రెండో ఆయన పాశ్చాత్య నాగరికతవైపు, ఇంగ్లీషు పరిపాలనా పద్ధతికి ఆకర్షింప బడేవారు.

ప్రపంచంలోని మూడు ప్రముఖ మత గ్రంథాలు ఈశ్వరదత్తమని భావిస్తున్నప్పుడు ఒకే మతాన్ని ఎందుకు అవలంబించాలని దయానందుని కలుసుకొన్నప్పుడు కేశవచంద్రసేను ప్రశ్నించాడు.

"మానవునికి నిజమైన జ్ఞానజ్యోతి కేవలం సృష్టి ప్రారంభంలోనే ఇవ్వబడి వుంటుంది. వేదాలు అతి ప్రాచీనమైనవి కనుక నిజమైన జ్ఞానం కేవలం వాటినుంచే లభించగలదని" దయానంద సమాధాన మిచ్చారు.

దయానంద మూడున్నర నెలల పాటు కలకత్తాలో వున్నారు. అక్కడ ఆయన అనేకమంది విద్వాంసులను కలుసుకున్నారు. అనేక ఉపన్యాసాలు ఇచ్చారు.

ఆయన సరళ సంస్కృత భాషలో ఉపన్యసించేవారు. అందువలన శ్రోతలలో అనేకమంది స్వామి దయానందుని మాటలలోని సారాంశం గ్రహించగలిగేవారు. స్థానిక పత్రికలు ఆయన ఉపన్యాసాలను విరివిగా ప్రకటిస్తూండేవి. ఇంటాబయటా ప్రజలు వాటిని గురించి తమలో తాము చర్చించుకొనేవారు. సుప్రసిద్ధ బ్రహ్మమత ప్రచారకుడు హేమచంద చక్రవర్తి, స్వామి దయానందునితో చాలసేపు చర్చించి అనేక ప్రశ్నలు వేశాడు. వాటిలోని కొన్ని ప్రశ్నల వల్ల స్వామి దయానందుని అధ్యాత్మిక, తాత్విక ఆలోచనల సరళి వెల్లడవుతుంది.

ప్రశ్న : జాతి భేదములున్నవా లేవా?

సమాధానం : మనుష్యజాతి, పశుజాతి, పక్షిజాతి వంటి బేధములున్నవి. చక్రవర్తి వర్ణ భేదముల గురించి తన అభిప్రాయాలు చెప్పగా దయానంద వేదములు తెలిసికొన్న వారు బ్రాహ్మణులనీ, యుద్ధాలు చేస్తున్న బుద్ధిమంతులు క్షత్రియులనీ, వ్యాపారం చేసేవారు వైశ్యులనీ, చదువు నేర్చుకోలేనివారు శూద్రులనీ విపులీకరించారు.

ప్రశ్న : ఈశ్వరుడు సాకారుడా? నిరాకారుడా?

సమాధానం : తమకు కావలసిన ఈశ్వరుడెటువంటివాడు? సచ్చిదానంద లక్షణములు కలవాడా? మరొకడా? మొదటివాడైతే ఈశ్వరుడు నిరాకారుడు.

ప్రశ్న : ఈశ్వరుని పొందుటకు ఉపాయమున్నదా?

సమాధానం : చాలాకాలం వరకు యోగాభ్యానం చేస్తే ఈశ్వరప్రాప్తి కలుగుతుంది.

ప్రశ్న : ఆ యోగం ఎటువంటిది?

జవాబుగా స్వామి అష్టాంగ యోగ విషయాలు వివరించారు. తెల్లవారుఝామున మూడుగంటలకు లేచి గాయత్రి మంత్రోపాసన చేస్తూ వుండమని హేమంచంద్ర చక్రవర్తికి సలహా యిచ్చారు.

ప్రశ్న సాంఖ్యకారుడు నిరీశ్వరవాది కాడు. లోకులు, ఋషులు రచించిన భాష్యాలను విడిచి అజ్ఞానులు చేసిన భాష్యాలను చదివి అలా చెప్పటం ప్రారంభించారు. భాగురి ఋషి వ్రాసిన భాష్యం చదివితే ఈ సందేహాలు తొలగిపోతాయి. సాంఖ్యకారుడు నాస్తికుడయితే పునర్జన్మ, వేదాలు, పరలోకం, ఆత్మ - వీటిని ఎందుకు అంగీకరిస్తాడు? ఏ వేదాంతము మరొక వేదాంతానికి విరోధి కాదు.

బెంగాలు దేశంలో వున్న ఇంచుమించు అందరు ధార్మిక నాయకులతోనూ దయానంద ఆధ్యాత్మిక చర్చలు, వేదాంత విషయ చర్చలు జరిపారు. కేశవ చంద్రసేను, దేవేంద్రనాథ్ ఠాకూర్ మాత్రమే గాక పండిత తారానాథ్, పండిత మహేశచంద్ర, రాజనారాయణ వసులతో దయానంద సమావేశాలు జరిపారు.

ఆయన కలకత్తా సంస్కృత కళాశాల గురించి ఎంతో గొప్పగా విన్నారు. కాని ఆ కళాశాలలో వేదాంతం చెప్పడం లేదని వినగానే చాలా నిరాశ చెందారు. పురాణాలు చదివి ప్రజలు పెడదారులు పడుతున్నారని ఆయన తన శ్రోతలకు చెప్పారు. సంస్కృత కళాశాలలో మార్పులు జరగకపోతే దానిని మూసివేయడం మంచిదని అన్నారు.

ధనవంతుల కొడుకులు ఇంగ్లీషు, ఫారసీ భాషలను, బీదవారి కొడుకులు మాత్రం సంస్కృతాన్ని నేర్చుకోవాలని కోరుకునేవారి ప్రవృత్తి చూసి దయానంద ఎంతో విచారించారు. ఆయన వేదాలకు భాష్యం రాయ నిశ్చయించారు. ఇంగ్లీషు, ఫారసీ భాషలకు ఎక్కువ ప్రాముఖ్య మిచ్చి సంస్కృతాన్ని ఉపేక్షించే పద్ధతిని ప్రతిఘటించ దలిచారు. కేశవచంద్రసేన్ సలహాపై ఆయన హిందీలో ఉపన్యసించడానికి అంగీకరించారు. సభలలో ఆయన ఉపన్యాసాలను హిందీలోకి అనువదించేటప్పుడు అనువాదకులు సరిగా అనువదించేవారు కాదు. కేశవచంద్రసేన్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌ల సూచనపై దయనాంద కౌపీనం ధరించడం మాని పూర్తిగా బట్టలు ధరించడానికి సమ్మతించారు.

కలకత్తా పర్యటనలో దయానంద ఆలోచనలకు స్పష్టమైన రూపమొచ్చి బలపడ

సాగాయి. తర్వాతి కాలంలో దయానంద సమాజానికి ఏ సంస్థాగత రూపాన్ని వూహించారో ఆర్య సమాజానికి ఏ నిర్దుష్ట రూపాన్నిచ్చారో అర్థం చేసుకోవాలంటే సమాజం గురించీ మతం గురించీ ఆయన అభిప్రాయాలు తెలుసుకోవటం అవసరం. అవేమిటో సంక్షిప్తంగా చూద్దాం.

1. విగ్రహారాధన పూర్తిగా మానేయాలి. ఈశ్వరుడే ముక్తికి మార్గం కనుక సర్వశక్తిమంతుడైన, సర్వజ్ఞుడైన ఈశ్వరోపాసనే అవసరం.
2. జన్మబట్టి కాకుండా, చేసే పనుల బట్టి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులవుతారు.
3. పురుషులతో సమానంగా స్త్రీలకు కూడా అధికారాలుండాలి.
4. బాల్య వివాహాలను నిషేధించాలి.
5. పురాణాలను వైదిక సాహిత్యానికి సంబంధించినట్లుగా ఎంచరాదు.
6. తల్లిదండ్రులను సముచితంగా గౌరవించాలి. జననీ జనకులను పిల్లలు శ్రద్ధాభక్తులతో సేవించాలి. మరణించిన వారికి శ్రాద్ధకర్మలు నిర్వహించటం అర్థంలేనిది, మూర్ఖమైనది.
7. ఆర్యులకు విదేశీయులు తిరస్కారపూర్వకంగా హిందువలని పేరు పెట్టారు. ఇది తప్పు. ప్రతి ఆర్యుడూ యజ్ఞోపవీతధారణ చేయాలి.

కలకత్తాలో దయానందుని ఉపన్యాసాలు వినడానికి జనం బాగానే వస్తూండేవారు. పత్రికలలోనూ, బహిరంగ సభలలోనూ ఆయన చెప్పిన విషయాలను ప్రస్తావించేవారు. అందుకే కలకత్తాలో ఆయన ప్రచార యాత్రం విజయవంతమైనది. 1873 ఏప్రిల్‌లో స్వామి దయానంద హుగ్లీకి బయలుదేరారు. హుగ్లీలో తారాచరణ పండితునితో పొద్దు పోయేవరకూ శాస్త్ర చర్చ చేశారు. అంతకుముందే తారాచరణ పండితునికి కాశీలో దయానందుని పదునైన తార్కికశక్తి, పాండిత్యం తెలుసు. ఇక్కడ కూడా దయానంద ఆయన్ని తేలిగ్గా చిత్తు చేసాడు. తారాచరణ్ తనకు విగ్రహారాధన తప్పని తెలుసునని, అలా నిజాన్ని చెబితే తన జీవనోపాధి పోతుందని స్పష్టంగా అంగీకరించారు. అంటే ఆయన మనసులో నమ్మినది బహిరంగంగా ప్రకటించ లేరన్నమాట.

హుగ్లీలో స్వామి దయానంద వర్ణాశ్రమ ధర్మాల పైన ఉపన్యసిస్తూ భారతదేశ మంతటా బ్రాహ్మణులే వంట పనిచేసే వారనే వాదన పట్ల తమ విచారాన్ని వ్యక్త పరచారు. ప్రాచీన భారతదేశంలో ఇటువంటి పద్ధతిలేదని ఆ నాడు బ్రాహ్మణులు

చేసేది వంటపని కనుక అయితే భీముడు క్షత్రియుడు కారాదని వాదించారు.

ప్రాచీనకాలంలో కులం, జన్మబట్టి కాక, తాను ఎన్నుకొని చేసే పనుల బట్టి వుండేదన్నారు. బాబూ అక్షయ చంద్ర సర్కార్ వైపు వేలెత్తి చూపిస్తూ వెనుకటి రోజులు తిరిగి వస్తే సర్కార్ లాంటి మర్యాదస్తులకు బ్రాహ్మణుల కిచ్చే ఉన్నత స్థానం లభిస్తుందని దయానంద అన్నారు.

తర్వాత ఆయన బర్ద్వాన్, భాగల్పూర్ మీదుగా మే 17వ తేదీ నాటికి పాట్నా చేరారు. అక్కడాయన విగ్రహారాధనని, శ్రాద్ధకర్మని, పిండ ప్రదానం చేయడాన్ని తీవ్రంగా విమర్శించారు. శ్రోతల్లో చాలామంది బ్రాహ్మణులున్నా ఆయనని ఎవరూ ఆటంక పరచక పోవటం విశేషం. ఛపరాలో శివగులామ్ అనే జమీందారు దయానందుని ఎంతో ఆదరించి పెద్ద బంగళాలో ఆయన బసకి ఏర్పాట్లు చేశాడు.

విగ్రహారాధనపై శాస్త్ర చర్చ జరుపదలచుకొన్న వారికి శక్తి వుంటే ముందుకు రావాలని ఆయన సవాలు చేశారు. ఈ సవాలు నెదుర్కొనమని ఛపరాలోని ప్రజలు విద్వాంసుడిగా ధర్మజ్ఞునిగా పేరుపొందిన జగన్నాథ పండితుని కోరారు. కాని ఆయన ఒక నాస్తికుని మొహం చూస్తే వచ్చే ఘోర పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవడానికి సిద్ధంగా లేనన్నాడు. దయానందుడీ మాట విని శాస్త్ర చర్చ జరిగే సమయంలో తనకీ ఆ పండితునికీ మధ్య తెరకట్ట వచ్చనీ అందువల్ల ఆ పండితునికి నాస్తికుని మొహం చూడవలసిన అవసరం కలగదనీ చెప్పమన్నారు. ఆ పండితునికి మరోసాకు దొరకలేదు. శాస్త్ర చర్చకు రాక తప్పింది కాదు. దయానంద ఆయనని అతి తక్కువ సమయంలోనే ఓడించారు. సరళంగా సంస్కృతంలో నాలుగు గంటల సేపు దయానంద వుపన్యసించారు. చాలమంది పండితులు ఆ సభని భంగం చేయడానికి వచ్చారు. గొడవ చేయసాగారు. రకరకాలుగా బెదిరించసాగారు. కారణంగా సభ చెదిరిపోయింది. నిరాశతో ప్రజలు తిరిగి వెళ్ళిపోయారు.

కలకత్తా వదలిన తర్వాత స్వామి దయానంద ఒక పద్ధతిలో దుస్తులు ధరించసాగారు. అంచుగల పంచ, పైన కప్పుకోడడానికి బట్ట, చెప్పులు ధరించే వారు.

డుమరావ్, మీర్జపూర్, ప్రయాగల మీదుగా దయానంద కాన్పూర్ చేరారు. అక్కడ కొందరు దుర్మార్గులు ఆయన సభలో గోలచేస్తూ ఉపన్యాస మీయనీయకుండా ఆయన్ని నివారించారు. లక్నోలో పండిత గంగాధర శాస్త్రి, ఆయన అనుయాయులు శాస్త్ర చర్చ జరిగే సమయంలో గొడవ చేయడానికి ప్రయత్నించి వైదిక మంత్రాలలో ఒక సందిగ్ధ అనువాదం ఆధారంగా తామే నెగ్గినట్లు ప్రకటించు కొన్నారు.

లక్నో నుంచి దయానంద అలీగఢ్ వెళ్ళారు. అక్కడ సయ్యద్ అహమద్ ఖాన్ ఆయనను కలుసుకోవడానికి వచ్చి, యజ్ఞం వలన వాయు మండలం ఎలా శుభ్ర పడుతుందని ప్రశ్నించారు.

స్వామి దయానంద పప్పు ఉదాహరణగా చెప్పి ఉడికిన తర్వాత పప్పుకి పోపు పెడితే ఎంత ఘుమ ఘుమ లాడుతూ ఎంత రుచిగా వుంటుందో చెపితే సర్ సయ్యద్ తృప్తి చెంది వెళ్ళి పోయారు. అలీగఢ్‌కి చెందిన రాజా. యకిషన్‌దాస్ ఆయన శిష్యులయ్యారు. దయానంద తమ ఉపన్యాసాలను పుస్తక రూపంలో ప్రచురించాలని జయకిషన్ కోరారు.

1874వ సంవత్సరం మొదటి రోజులలో దయానంద మధుర చేరారు. అక్కడ ఆయన వైదిక ఆర్యులు విగ్రహారాధకులని రుజువు చూప వలసినదిగా చక్రాంకిత సంప్రదాయ గురువైన పండిత రంగాచార్యులను నిలదీసి అడిగారు. కాని రంగాచార్యులు అందుకంగీకరించలేదు. దయానంద మధురలో వుండగా ఆయనను హత్య చేయడానికి కుట్ర జరిగింది. కానీ ఆ ప్రయత్నం సఫలం కాలేదు.

స్వామి దయానంద వేసవి కాలం వారణాసిలో గడిపారు. ఇప్పుడాయన త్రిదండి సన్యాసి కాదు. ఇప్పుడాయన వెంట మూడు బస్తాల పుస్తకాలు, కొన్ని బట్టలూ వున్నాయి. కూడా నౌకరున్నాడు. సంస్కృతం మాట్లాడటం మానేసి తడుముకుంటూ హిందీలో మాట్లాడుతూ వుండేవారు. ఆయన ఉపన్యాసాలు వినే ప్రజల సంఖ్య పెరిగింది కాని పండితులు రావటం తగ్గింది.

వారణాసిలో దయానంద ధర్మశాస్త్ర బోధనకు ఒక పాఠశాల తెరిచారు. దురదృష్టవశాత్తూ ఆ పాఠశాల సరిగా పనిచేయలేక మూతబడి పోయింది. వారణాసిలో దయానంద "సత్యార్థ ప్రకాశిక" వ్రాయడం మొదలు పెట్టారు. మొదటి సంప్కరణ వైట్ ప్రెస్‌లో ముద్రింపబడి 1875లో ప్రకటింపబడింది.

ఒక గొప్ప విషయమేమిటంటే ఇళ్ళలో ఉప్పు తయారు చేసుకోవటం నిషేధించిన శాసనం బీదవారికి నష్టం కలిగించే శాసనమని వివరిస్తూ ఆ శాసనాన్ని ఈ గ్రంథ ముఖంగా వ్యతిరేకించారు.

క్రైస్తవ మతం స్వీకరించిన ఒక మహారాష్ట్ర బ్రాహ్మణుని దయానంద జూలై ఒకటవ తేదీన కలిశారు. ఆయన మాక్సుముల్లర్ శిష్యుడు. ముల్లర్ అనువదించిన ఋగ్వేదంలోని కొన్ని భాగాలు కల పుస్తక ప్రతి కూడా ఆయన దగ్గర వుంది. పండిత నీలకంఠం, మాక్సుముల్లర్‌ను ప్రమాణంగా చూపి వేదాలలో నిర్జీవ పదార్థాలకు దేవతా

స్థానం ఇవ్వబడిన వాటిని ఉపదేశించమని చెప్పబడినదని వాదించారు.

వేదాలలో బ్రహ్మోపాసన ప్రతిపాదింప బడినదని చెబుతూ వేదాలపైన మాక్సు ముల్లర్ భాష్యాన్ని తీవ్రంగా విమర్శిస్తూ ఆయన వాదాన్ని దయానంద తిరస్కరించారు. ఏకాంత ప్రదేశంలో వుండి ముక్తి సాధనకు ధ్యానమగ్నుడు కావలసినదని దయానందకు ఒక వృద్ధ మహాత్ముడు సలహా యిచ్చాడు. తన ముక్తిని గురించి చింత తనకు లేదని అంధకారంలో మగ్గుతూ దుఃఖితులు గానూ, పీడితులు గానూ బాధపడే కోట్లాది ప్రజల ముక్తి కోసమే తాను చింతిస్తానని దయానంద జవాబిచ్చారు.

ఎందరో ఆహ్వానించగా 1874లో స్వామి దయానంద బొంబాయి చేరారు. కాని ఆయన విగ్రహారాధక వ్యతిరేక భావాలకు, ఉపన్యాసాలకు కోపగించి అనేకమంది ఆయనని నిందించ సాగారు. వల్లభ సంప్రదాయ ప్రముఖుడైన గోసాని జీవాజీ తన నౌకరు బలదేవ్ ద్వారా దయానందునికి విష మివ్వడానికి ప్రయత్నించాడు. కానీ ఆయన దురుద్దేశ్యం సఫలంకాలేదు. స్వామి దయానంద వల్లభ సంప్రదాయం లోని బండారం బయటపెట్టి ఆ సంప్రదాయపు రీతులను కొన్నింటిని తీవ్రంగా ఖండించారు.

సుప్రసిద్ధ సంస్కృత పండితులు డాక్టర్ రామగోపాల భండార్కర్ కూడా స్వామి దయానందుని కలిశారు. స్వామి దయానంద చెప్పినట్లుగా వేదాలలో ఏకేశ్వరోపాసన ప్రతిపాదింప బడియుండకపోవటమే కాక బహు దేవతా వాదమే ప్రతిపాదించ బడినదని భండార్కర్ గారి అభిప్రాయము. ఐతరేయ బ్రాహ్మణమునందలి శునశ్శేపుని గాథను భండార్కర్‌గారు ఉదహరించగా, దయానంద ఇతరేయ బ్రాహ్మణమునకు వేదముల కిచ్చే స్థాన మివ్వ నిరాకరించారు. వేదాలకు యదార్థ ప్రాతినిధ్యము వహించినంత వరకే బ్రాహ్మణములను దయానంద అంగీకరించే వారు. బ్రాహ్మణాలు కూడా ఈశ్వర ప్రేరితాలని భండార్కరు అంగీకరించి నట్లుగా దయానంద ఎన్నడూ అంగీకరించ లేదు.

బొంబాయిలో స్వామి దయానంద మొదటి ఉపన్యాసం 1874లో నవంబరు 25వ తేదీన ఏర్పాటు చేశారు. కాని ఆ ఉపన్యాసం పెద్ద గందరగోళం మధ్య ముగిసింది. బేచరశాస్త్రి గారి సహచరులు మొదటినుంచీ సభని భగ్నం చేయడానికే ప్రణాళిక లేసి వుంచారు. అది సఫలమైంది. దయానంద తమ రెండో ఉపన్యాసంలో ఆర్యుల చరిత్రను సమీక్షిస్తూ ఆర్యావర్త క్షీణదశకు ఆర్య రాజులనే నిందించారు. ఆయన తన ఉపన్యాసం ముగింపులో వ్యంగ్యంగా మత గురువులను పరిహసించారు. ఆయన ఉపన్యాసమంతా వ్యంగ్య పరిహాసాలతో నిండి వుండటం వల్ల అందరికీ బాగా నచ్చింది. ఈ ఉపన్యాసానికి సభికులు శుల్కం చెల్లించి వచ్చినా ఆనందించారు.

బొంబాయిలో స్వామి దయానంద అనేక రచనలు చేసి ప్రకటించిన కొన్ని గ్రంథాలలో వల్లభ, స్వామి నారాయణ, సంప్రదాయాలలోని బూటకాలనూ, మోసాలనూ బయటపెట్టారు. 'సంస్కారవిధి' ఋగ్వేదాది భాష్య భూమిక ఇక్కడే రచించ నారంభించారు. కాని ఆర్య సమాజాన్ని స్థాపించడమే బొంబాయిలో ఆయన చేసిన మహత్కార్యం

వైదిక ఆదర్శాల ప్రచారానికీ, వాటిని జనరంజకంగా చేయడానికీ ఒక సంఘం స్థాపించమని అనుయాయులు కొంతమంది దయానందుని కోరారు. ఆ పని ఆయనకు ప్రీతికరమైనది. అప్పటికే ఆయన ఆ పనిలో వున్నారు. అందువలన ఆ ప్రతిపాదన అంగీకరించారు. ఇదివరలో కూడా ఆయన ఈ విషయంలో ఆలోచించడమే కాక రాజకోటలో ఈ పద్ధతిలో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. ఆయన లక్ష్యాలు నెరవేర్చటానికి ఉద్దేశ్యాలు పూర్తిచేయడానికీ ఎవ్వరికీ ఒంటరిగా సాధ్యం కాదు కనక, దయానంద తమ అంగీకారాన్ని తెలిపి ఈ నూతన సంస్థకు ఆర్య సమాజమని పేరుపెట్టారు. ఈ సంస్థకు తుది రూపం 1875లో ఏర్పడింది. ఆ సంవత్సరమే ఏప్రియల్ 10వ తేదీన డాక్టర్ మానిక్‌చంద్‌గారి తోటలో నియమ బద్ధంగా సమాజాన్ని స్థాపించారు. ఆర్య సమాజ లక్ష్యాలు, ఆదర్శాలను గూర్చి పరిపూర్ణ చర్చ జరిగిన పిమ్మట అనుయాయులకు మార్గదర్శక సూత్రాలుగా 28 సిద్ధాంతాలను అంగీకరించారు. తరువాత స్వామి దయానంద వాటిని క్లుప్తం చేసి 10 సిద్ధాంతాలుగా రూపొందించారు. ఈ సూత్రాల కంటే ఆ 28 సూత్రాల ప్రాథమిక రూపమే సుబోధకంగా ఉన్నా అవి ఆనాటి స్వామీజీ ఆలోచనా సరళిని తెలియజేస్తాయి. కనుక అందులో కొన్నిటిని యథాతథంగా గమనిద్దాం.

ఆర్య సమాజంలో వేదములనే ముఖ్య ప్రమాణములుగా ఎంచుతారు. వాటికవే ప్రామాణికాలు. శతపథాదులైన నాలుగు బ్రాహ్మణాలనూ, ఆరు వేదాంతాలనూ, నాలుగు ఉపవేదాలనూ, షడ్దర్శనాలనూ, 1127 వేదశాఖలనూ, వేదాలపై వ్యాఖ్యాన గ్రంథాలనూ, ఆర్ష సనాతన గ్రంథాలనూ, సాధారణ ప్రమాణాలుగా ఎంచారు. ఈ సమాజంలో సత్పురుషులనూ, నీతిపరులనూ, సత్యాన్ని ఆచరించే వారినీ, మానవ హితం కోరేవారినీ సభ్యులుగా చేర్చుకొంటారు.

ఆర్య సమాజానికీ, ఆర్య విద్యాలయానికీ, ఆర్య సమాజ పత్రిక ప్రచారానికీ, వాటి వృద్ధికీ, ఆర్య సమాజ ధనాగారానికీ, ప్రతి సభ్యుడూ స్వయంగా శక్తి మేరకు సంపాదించిన దానిలో ఒక వంతు సంతోష పూర్వకంగా ఇవ్వాలి.

ఈ సమాజంలో అద్వితీయ పరమేశ్వరుని గురించి చేసిన ప్రతి ప్రార్థన, స్తోత్రము,

ఉపాసన, వేదోక్త ప్రచారంగానే జరగాలి. నిర్వికారుడు, సర్వ శక్తిమయుడు, న్యాయమూర్తి, జన్మరహితుడు, అనంతుడు, నిర్వకారుడు, అద్యంతములు లేనివాడు, అనుపమ దయాళువు, సర్వ జగత్పిత, సర్వ జగన్మాత, సర్వానికి ఆధారమైనవాడు, సర్వేశ్వరుడు, సచ్చిదానందుడయిన ఈశ్వరుని, అనంత సుఖప్రదాత, సర్వాంతర్యామి, ముసలితనం లేనివాడు, అమరుడు, అభయముని, ధర్మార్థకామమోక్షప్రదుడు అయిన పరమాత్ముని స్తుతించి, కీర్తించి, ప్రార్థించి, సర్వశ్రేష్ఠ కార్యములలోనూ అతని సహాయము కోరాలి. ఉపాసించాలి. ఆనంద స్వరూపంలో మగ్నం కావాలి. నిరాకారుడైన ఈశ్వరుని ఎడలనే భక్తి కలిగివుండాలి తప్ప మరియే యితర రూపములను భజింపరాదు.

ఆర్య విద్యాలయములలో వేదములు మొదలైన సనాతన ఆర్య గ్రంథాలే చదవాలి. చదివించాలి. వేదోక్తమైన సత్య విద్యా గ్రంథము వల్లనే స్త్రీ పురుషులందరు సంస్కరింప బడతారు.

సమాజంలో దేశం మంచి కోరి పరమార్థాన్ని, లోక వ్యవహారాన్ని శుద్ధి చేయాలి. ఈ రెండింటినీ శోధించి ప్రక్షాళన చేసి వీటి వున్నతికోసం లోకహితం కోసం ప్రయత్నిస్తారు.

సమాజంలో ప్రత్యక్ష ప్రమాణములతో పరీక్షింప బడి, సత్యధర్మయుక్తమై, వేదోక్తమై, పక్షపాత రహితమైన న్యాయమే సరియైన న్యాయంగా అంగీకరిస్తారు. ఇందుకు భిన్నమైన దానిని మన్నించరు.

అన్ని వ్యవహారాలలో న్యాయయుక్తమైనదిగా అందరి క్షేమానికి ఉపయుక్తమైనదిగా, యదార్థమైనదిఅ విచారణ కాలంలో నిర్ణయించబడినదే సమాజంలోని సభ్యులందరికీ వెల్లడిస్తారు. వీటికి వ్యతిరేకమైన వాటిని అంగీకరించరు. దీనినే పక్షపాత రహిత న్యాయంగా భావించాలి

ఈ నియమాల కనుగుణంగా నడుచుకొనే సద్గుణ పురుషులనే ఉత్తమ సమాజంలో చేర్చుకోవాలి. కొన్ని గుణాలు తక్కువైన వారికి సాధారణ సమాజంలో స్థానం కల్పించాలి. మరీ చెడ్డవారిని సమాజం నుంచి తొలగించాలి. కాని ఈ పని పక్షపాతం లేకుండా జరపాలి. అదీగాక ఈ రెండు విషయాలు ఉత్తమ సమాజ సభ్యుల నిర్ణయాల ప్రకారమే జరగాలి తప్ప, మరోవిధంగా జరగ కూడదు.

1875లో బొంబాయిలో ఆర్య సమాజ స్థాపన జరిగిన తర్వాత ఆర్య సమాజ ఉద్యమం బలపడింది. ఉత్తర హిందూ దేశంలో క్రమంగా వందలాది ఆర్య సమాజాలు స్థాపించసాగారు. ఇంటింటికీ వైదిక సందేశాన్ని అందించటానికి ఈ సంస్థలు పోటీ పడసాగాయి. ఆర్య సమాజ ప్రథమాధ్యక్షునిగా దయానందే వుండవలసినది. కాని ఆయన

వినయంగా తిరస్కరించి సాధారణ సభ్యునిగానే ఉండ గోరారు.

1828లో స్థానించబడిన బ్రహ్మ సమాజం వలన, 1877 లో స్థాపించబడిన ప్రార్థనా సమాజం వలన ఆర్య సమాజ స్థాపనకు ప్రేరణ కలిగినా, ఆర్య సమాజ కార్య నిర్వహణ వెనుక గల లక్ష్య, సిద్ధాంత, ఉద్దేశ్యాలు ఎంతో సుబోధకమైనవి, విస్తృతమైనవి. బ్రహ్మ సమాజంలోని ఒత్తిడులు, మానసిక సంఘర్షణలు, దానిని ఛిన్నాభిన్నంగా చేసి 19వ శతాబ్దపు 9వ శతాబ్దానికి అది ఆఖరి శ్వాస పీల్చుకొన నారంభించింది.

ప్రార్థనా సమాజం ఎన్నడూ ఒక ప్రజా ఉద్యమాన్ని నిర్వహించలేక నామ మాత్రంగా మిగిలిపోయింది. ఆర్య సమాజం,. స్థాపకుని కాలంలోనూ ఆ తరువాత వచ్చిన ఆత్మానంద సరస్వతి, లాలాహంసరాజ్, పండిత గురుదత్తుడు, స్వామి శ్రద్ధానంద వంటి మహారథుల సారథ్యంలో వున్న కార్యోత్సాహం, ఆవేశోత్సాహాలు లేకపోయినా నేటికీ భారతీయ సాంఘిక, సాంస్కృతిక జీవితంలో ఆర్య సమాజానికి ఒక ప్రముఖ స్థానం వుంది. జాగృత భారతదేశ సాంఘిక ధార్మిక జాతీయ వికాసం పడుగు పేకలుగా అల్లుకొనడానికి వీలైన కేంద్రం లేని లోటు ఆర్య సమాజ స్థాపన తీర్చింది. ఆర్య సమాజం దాని సంస్థాపకుని సజీవ స్మారక చిహ్నం.

స్వామి దయానంద తన మీదనున్న భారాన్ని కొంతమంది ఇతర సహచరులకు పంచినా, జీవితాంతం వరకూ మరో ఎనిమిదేండ్ల పాటు వైదిక సందేశ ప్రచారం ఆయన భుజాలపైనే వుండేది.

1883లో ఆయన మరణానంతరం ఏర్పడిన శూన్యాన్ని దురదృష్టవశాత్తూ మరెవరూ నింపలేకపోయారు.

## 5

# హేతువాదం - అంధ విశ్వాసం

1875వ సంవత్సరంలో బొంబాయిలో ఆర్య సమాజ స్థాపన జరగడం వలన స్వామి దయానంద మహారాష్ట్ర ప్రాంతంలో వైదిక జీవన పద్ధతికి అనుకూల వాతావరణం ఏర్పాటు చేయగలిగారు. బొంబాయి భారతదేశ ఆర్థిక జీవన కేంద్రమే కాక, అనేక మతాలు ధర్మాలు అనుసరించే జనం ఒకరితో నొకరు కలిసి మెలిసి నివసించే నగరం. స్వామి దయానంద ఒంటరిగా ఒక ఉద్యమం లేవదీశారు. ఆ ఉద్యమానికి కొత్త ప్రాణం వచ్చింది. రోజురోజుకీ బలం పుంజుకుంటున్న ఉద్యమంలో పాల్గొనడానికి ఉత్సాహంగా నిరీక్షిస్తున్న వారందరి సహకారం పొందవచ్చునని ఆర్య సమాజం ఆశించవచ్చు.

ఇంతవరకు స్వామి దయానంద పూనా వెళ్ళలేదు. మహాదేవ గోవిందరానడే, మహాదేవ మోరేశ్వర కుంతేలు-వీరంటే ఆయనకు ఎంతో గౌరవం. కొన్ని ఉపన్యాసా లివ్వమని వారు పంపిన ఆహ్వానాన్ని ఇపుడు స్వామి దయానంద అంగీకరించారు. దీనివలన భారతదేశంలో జరుగనున్న ధార్మిక జాగృతి గురించీ, సాంఘిక పునర్నిర్మాణం గురించీ స్వామిజీ తమ అభిప్రాయాలు వెల్లడించడానికి చక్కని అవకాశం లభించింది. మామూలు పద్ధతిలో ఇక్కడ కూడా కొందరు సనాతనులు విగ్రహారాధన గురించీ, వర్ణవ్యవస్థను గురించీ చెప్పిన దయానందుని అభిప్రాయాలను చెడుగా భావించి, ఆయనను ఎగతాళిచేయ నారంభించారు. మరి కొందరు ఆయన ఆంగ్లేయుల ననుసరిస్తున్నాడన్నారు. కాని స్వామి దయానంద కంగారు పడలేదు. తన మార్గాన్ని విడిచి పెట్టనూ లేదు. ధైర్యం సాహసం కల ఆయన ఈ మాదిరి అపహాస్యాలకు జడిసి అస్త్ర సన్యాసం చేసే రకం కాదు. ఆయనకు తన లక్ష్యాలన్నా పనులన్నా ఎంతో నిష్ఠ. వీటికోసం ఆయన అన్నీ సహించడానికి సిద్ధంగా ఉండేవారు.

మహాదేవ గోవిందరానడే స్వామి దయానందుని స్వాగత సత్కారాలకై పెద్ద ఏర్పాటు చేశారు. గొప్ప వూరేగింపు తలపెట్టారు. చక్కగా అలంకరించిన ఒక ఏనుగును

అద్దెకు తీసుకొని వుంచారు. ప్రత్యర్థులు దీనిని వ్యతిరేకిస్తూ ఊరేగింపు నిమిత్తం కాషాయ వస్త్రాలతో అలంకరించిన ఒక గాడిదను తయారు చేసి వుంచారు. దయానందుని సభ భగ్నం చేయడానికి వీరు అన్ని రకాల ప్రయత్నాలు సాగించారు. ఆయన ఉపన్యాసానంతరం ఆఖరికి ఆయన మీద బురద కూడా చల్లేరు. అయినా సభను భగ్నం చేయాలనే వారి ఉద్దేశ్యం నెరవేరలేదు.

పూనాలో స్వామి దయానంద 15 ఉపన్యాసాలిచ్చారు. ఇతర స్థలాలలో 35 ఉపన్యాసాలిచ్చారు. మొత్తం ఈ 50 ఉపన్యాసాలు, మరాఠీ భాషలో పుస్తక రూపంలో ప్రకటించబడినాయి. ఈ ఉపన్యాసాలలో దయానంద వైదిక ధర్మాన్ని ఎన్నో కోణాలలో చూపారు. ఈశ్వరుడు సర్వశక్తి పరుడు. న్యాయమార్గం నుండి చలించకుండా అన్నీ నెరవేర్చగల శక్తి ఆయన కుందని దయానంద తమ ఉపన్యాసాల్లో వివరించారు. ఈశ్వరుడు సర్వశక్తి మంతుడు కనుక తన సందేశాన్ని వినిపింపచేయడానికి తనయుడినో, ప్రతినిధినో పంపవలసిన అవసరం లేదు. జీవాత్మ, పరమాత్మల అస్థిత్వాలు వేరని, ఈశ్వరుని అపార దయకు కృతజ్ఞత తెలియచేయడానికే ప్రార్థన అవసరమని దయానంద మరియొక ఉపన్యాసంలో సాధికారంగా వివరించారు. కొన్ని ఉపన్యాసాలలో ఆయన వైదిక ధర్మానికి అధారమైన సిద్ధాంతాల గురించి చెప్పారు. యజ్ఞాలపైన సంధ్యావందనంపైన , దానాలపైన వైదికధర్మం నిలబడి వున్నదని ఆయన అభిప్రాయం. నిజమైన జ్ఞానం వేదాలలో వున్నదని వాటి ఆదేశాలకు వ్యతిరేకమైనదంతా మిధ్య అనీ విడిచిపెట్టదగినదనీ ఆయన దృఢనమ్మకం. ఆ ఉపన్యాసాలలో ప్రాచీన కాల చరిత్ర పురాణాలు వాటి హద్దులపైన ఆయన వ్యాఖ్యానించారు.

చివరి ఉపన్యాసంలో ముక్తసరిగా తన ప్రారంభ జీవితం గురించీ, జ్ఞానాన్ని సత్యాన్ని పొందటానికై హిమాలయాలపైన, నర్మదా నదీ లోయలలో యోగుల మహాత్ముల అన్వేషణలో తాను దారి తప్పి సంచరించిన నాటి జీవితాన్ని సూచీమాత్రంగా ముచ్చటించారు.

1875వ సంవత్సరం చివరి రోజులలో దయానంద సతారా, బొంబాయిలలో గడిపారు. అక్కడనుంచి బరోడా వెళ్ళి ఒక సత్రంలో మకాం చేశారు. అచటి సంస్థానాధీశులు వారి ఆహార విహారాలకు, రక్షణకు అన్ని ఏర్పాట్లు చేశారు. శీతాకాలంలో బరోడాలో ఎక్కువ చలిగా వుంటుంది. అయినా స్వామి దయానంద మెత్తలేని మామూలు బల్లపై ఒక ఉన్ని శాలువతో రాత్రంతా గడిపేవారు. ధర్మశాల ఆవరణలోనే రోజూ ఆయన ఉపన్యసించేవారు. అచ్చటి పురప్రముఖులంతా క్రమం తప్పకుండా

వారి ఉపన్యాసం వినడానికి హాజరయేవారు. ఆయన తమ రెండవ ఉపన్యాసం "యధేమాం వాచం కళ్యాణీం" అనే ఋగ్వేద మంత్రంతో మొదలు పెట్టారు. సభలోని పండిత బృందానికి ఇది నచ్చక వేళ్ళతో చెవులు మూసుకుని గోల చేయడం ప్రారంభించారు. ఎక్కువమంది శూద్ర శ్రోతలు గల సభలో వేదమంత్రాన్ని జపించి స్వామి మహాపాపం చేశారని వారి అభిప్రాయం. వారు చేసే గోలను లక్ష్యపెట్టకుండా దయానంద తమ ఉపన్యాసం కొనసాగించారు. అయినా ఆ పండితబృందం తమ గోలను కొనసాగిస్తూనే వుంది. కొంతమంది ప్రతిపాదనపై ఇరుపక్షాల వాదము శాస్త్రార్థ చర్చ ద్వారా నిర్ధారించుకోవడానికి నిర్ణయించారు. ఇరుపక్షాల మధ్య శాస్త్రార్థ చర్చ జరిగింది. పండిత బృందం ఘోరంగా పరాజయం పొందింది. దయానంద ఈ విధంగానే పౌరాణిక సాంప్రదాయాన్ని నిందిస్తూ పోతే సంస్థానం నుంచి తమకు లభించే ఉపకార వేతనాలు నిలచి పోతాయనే భయంచేత పండితులు ఆయనకు వ్యతిరేకంగా గోలచేస్తూనే వున్నారు. దయానంద తమ మూడవ ఉపన్యాసంలో మహాభారతాన్నీ మనుస్మృతిలో ప్రతిపాదింపబడిన ప్రాచీన భారతీయ రాజతంత్రాన్నీ వివరించి రాజుకు మంత్రులకు ఉండవలసిన గుణాలను శ్రోతలచేత లెక్కింప చేశారు.

బ్రహ్మ చర్యను పాటించటం గురించి ఆయన నొక్కి చెప్పారు. భారతీయులు తమని తాము దేశ పాలనకు యోగ్యులుగా తీర్చిదిద్దుకుంటే ఆంగ్లేయులు వారికై వారే ఈ దేశాన్ని విడిచి వెళ్ళిపోతారని చెబుతూ దయానంద ఉపన్యాసం ముగించారు.

1876లో బొంబాయి తిరిగి వచ్చి స్వామి దయానంద అక్కడ కూడా మరికొన్ని ఉపన్యాసాలు ఇచ్చారు. ఇవి సరళంగా వున్నా సంస్కృతమయమైన హిందీలో వుండేవి. మోనియర్ విలియమ్‌తో ఇక్కడే స్వామి సమావేశమయ్యారు. ఇద్దరూ సంస్కృత భాషలోనే మాట్లాడుకున్నారు. ఏప్రియల్‌లో దయానంద బొంబాయి విడిచి ఇండోర్‌లో కొన్ని రోజులు గడిపి ఫర్రూఖాబాద్ చేరే లోగా ఉత్తర ప్రదేశ్‌లో ఆర్య సమాజోద్యమం మొదలైనది. ఆయన వెళ్ళిన ప్రతీచోటా వైదిక ఆర్యులు విగ్రహారాధకులని రుజువు చేయమని పండితులను స్వామి కోరేవారు. ఆయన వేద ప్రమాణాన్ని తప్ప మరే ఇతర మత గ్రంథాన్నీ ప్రమాణంగా అంగీకరించే వారు కారు. చాలామంది పండితులు విద్వాంసులు కారు. వారు మామూలు పూజారులు, పురోహితులు కావటం వలన ఆయన, వారి నోళ్ల సులభంగా మూయించ గలిగేవారు. వైదిక సంస్కృతీ, జ్ఞానం లేక పోవటం ఆ పండితుల కెంతో చిక్కుగా వుండేది.

మురాదాబాద్‌లో ఒక ఆంగ్ల ఫాదరీతో పక్షం రోజులపాటు శాస్త్ర చర్చ కొనసాగుతూ

వచ్చింది. 1876వ సంవత్సరం పూర్తి కావస్తోంది. ఆంగ్లేయ రాజ్య వైభవాన్ని ప్రదర్శించడానికి లిటన్ ప్రభువు ఏర్పరచిన ఢిల్లీ దర్బారు జరిగే రోజు దగ్గిర పడసాగింది. దయానందకు వైదిక సందేశాన్ని ప్రచారం చేయడానికి ఇది చక్కని అదనుగా తోచింది. దేశంలో వైదిక ధర్మాన్ని పునరుజ్జీవింప చేయడానికి ఇతర మతావలంబకుల సహాయం పొందటానికి ఆయన ఆత్రుత పడసాగారు.

ఇతర మత గురువులు ధార్మిక నాయకులు - నైతిక సదాచారములపై కనీస ముల సిద్ధాంతాలపై ఏకాభిప్రాయానికి వచ్చి అందరికి ఆమోద యోగ్యమైన కార్యక్రమం అంగీకరించగలిగినపుడే పునరుజ్జీవనం సాధ్యం. ఇందుకోసమే దయానంద వివిధ వృత్తుల ప్రముఖులు ఒకచోటచేరి విభిన్న సంప్రదాయములలోని సత్యాన్ని వెతికి బహిర్గతము చేయవలసినదిగా కోరుతూ ఒక కరపత్రాన్ని ప్రచురించారు. తత్ఫలితంగా ఇతర సంప్రదాయాల గురువులు, ముఖ్యులు సమావేశమై ఆయనతో సమాలోచన జరిపారు. సంఘ సంస్కరణలో ప్రముఖులను ఒకనాడు, తను విడిదిచేసిన చోట సమావేశానికి దయానంద ఆహ్వానించారు. ఇందులో పాల్గొన్న వారిలో సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్, కేశవచంద్రసేన్ కూడా వున్నారు. స్వామి దయానంద దేశ పురోగతికై వారినందరినీ ఏకం కావలసినదిగా ఉద్బోధించారు. కాని వేదాలు ఈశ్వరునిచే ఉపదేశింపబడి నటులంగీకరించవలెనని పెట్టిన షరతు ఇతర నాయకుల కంగీకారము కాకపోవటంతో ఆ సమావేశం విఫలమయింధి.

ఢిల్లీనుంచి దయానంద ఉత్తరప్రదేశ్‌కు తిరిగి వచ్చి మీరట్, సహరన్‌పూర్‌ల మీదుగా 1877లో షాజహాన్‌పూర్ చేరుకున్నారు. ఒకరి అభిప్రాయాలు మరొకరు తెలుసుకోవటం వలన శాస్త్రార్థ చర్చల ద్వారా విభిన్న సంప్రదాయాలలో సత్యమెంతెంత వంతున్నదో నిర్ణయించే సమ్మేళనానికి రావలసినదిగా ఆయనకాహ్వానం అందింది. ఈ సమావేశం చాలమంది నాకర్షించింది. మహమ్మదీయ, క్రైస్తవ మత నాయకులు గూడా ఇతర మతాలకంటె తమ మత సంప్రదాయాలు ఎంత గొప్పవో ఎలుగెత్తి చాటుకోవడానికి ఆ సమావేశంలో పాల్గొన్నారు. మహ్మదీయుల ప్రతినిధిగా దేవబంద్‌కి చెందిన ఇద్దరు విఖ్యాత మౌల్వీలు, క్రైస్తవుల పక్షాన తమ విషయం ప్రతిపాదించడానికి రెవరెండ్ జె. స్కాటు వచ్చారు. ప్రముఖ శాస్త్రార్థ వేత్తలు దయానందకు సహాయకులుగా వున్నారు. పండిత ఇంద్రమణిగారు ఆయనకు సహాయకులు.

సమ్మేళనం ఈ క్రింది అయిదు విషయాలను ఆలోచించాలి.

1. ఈశ్వరు డెపుడు సృష్టించాడు? సంఘటింప చేసినదెవరు?

2. ఈశ్వరుడు సర్వజ్ఞుడా?
3. ఈశ్వరుని దయామయునిగా, యజమానిగా ఒకేసారి ఎలా భావించవచ్చును?
4. వేదాలనుగాని, బైబిల్, ఖురాన్‌లనుగాని ఈశ్వరాదేశ గ్రంథాలనడానికి ప్రమాణాలేవి?
5. ముక్తికి స్వరూపం ఏమిటి? దానిని పొందే ఉపాయం ఏమిటి?

ఈశ్వరుడు ప్రకృతినుంచి మూల కారణమైన బ్రహ్మాండాన్ని సృష్టించాడని, అది నాశనము లేదని, నిత్యమైనదనీ, మొట్టమొదటిదని మొదటి ప్రశ్న విషయంలో దయానంద తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. శూన్యంలో నుంచి భావోత్పత్తి సంభవంకాదు. బ్రహ్మాండం స్వతహా ఉత్పత్తి కాజాలదు. అలా అయివుంటే బ్రహ్మాండం పరమాత్ముని పోలికలోనే వుండేది. అప్పుడు మోసగాడూ, దుర్మార్గుడూ, హంతకులూ ఈశ్వర స్వరూపులే అయి వుండేవారు.

దయానంద అభిప్రాయానుసారం నూట తొంభై ఆరు కోట్ల ఎనిమిది లక్షల యాభయిరెండువేల తొమ్మిది వందల డబ్భయ్యారు సంవత్సరాలకు పూర్వం బ్రహ్మాండం సృష్టింప బడింది. జీవుని కర్మానుసారం పరమాత్మ అనేక జన్మలిస్తూ మానవ పునర్జన్మ చక్రంలో త్రిప్పుతూ వుంటాడు. ఈశ్వరుడే ఈ బ్రహ్మాండానికి మూల పరికరం. అతనే పాలకుడు. అతనిలో బ్రహ్మాండాన్ని సృష్టించే శక్తి వుంది. అందుచేతనే మానవుడు మంచి కర్మలని అచరిస్తూ ఇహ పరమైన బంధనాలనుంచి ముక్తి పొందాలని ఈశ్వరుడు సృష్టి చేస్తాడు.

బంధాలనుంచి విడివడడమే ముక్తి అని దయానంద చెప్పారు. దుఃఖాలనుంచి, కష్టాలనుంచి మానవుడు తనని తాను విడిపించుకొని ఆనంద స్థితిలో వుంటూ ఈశ్వర సాక్షాత్కారం చేసుకోగడు. అటువంటి మానవుడు జనన మరణ చక్రంలో చిక్కుకొనడు.

ఆ సమ్మేళనం ముగిసే సమయంలో దానిలో పాల్గొన్న వారి మధ్య సాధారణ తర్క వితర్కాలు జరిగాయి. పరస్పరం అభిప్రాయాలు తెలియ చెప్పుకున్నారు. తరువాత ప్రతి ఒక్కరు ఇంతకుముందు వేసుకొన్న ప్రశ్నలకు తమ తమ పద్ధతుల్లో సమాధానములిచ్చారు. కాని ఆచరణాత్మకమైన కనీస కార్యక్రమం రూపొందించే విషయంలో ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. అందువలన రెండే రోజులలో సమ్మేళనం ముగిసింది.

పంజాబునుంచి అనేక ఆహ్వానాలు అందటంతో స్వామి దయానంద పంజాబు వెళ్ళడానికి నిశ్చయించారు. లూధియానాకు చెందిన మున్షీ కన్హయాలాల్ అలక్‌ధారీ

ఆయన భక్తుడు. పంజాబులో ఆర్య సమాజ శాఖలు నెలకొల్పడానికి అన్ని విధాల సహాయ పడగలనని ఆయన హామీ యిచ్చారు. సిక్కు, ఇస్లాము సాంప్రదాయాల మధ్య వైదిక ధర్మానికి స్థానం కల్పించే ఉద్దేశ్యమే దయానంద పంజాబు వెళ్ళడానికి పురికొల్పిన రెండవ కారణం. ఈ కారణంవల్లనే దయానంద పంజాబులో ఒక ఏడాదికిపైగా వుండి అక్కడి ముఖ్య నగరాలు దర్శించారు. లాహోరులోని బ్రహ్మ సమాజ నాయకులు ఆయనను బ్రహ్మ సమాజంలోనికి తీసుకు రాగలమని అనుకున్నారు. కానీ విఫలులయ్యారు.

1877 ఏప్రియల్, 25వ తారీఖున దయానంద లాహోరులో తమ మొదటి ఉపన్యాసంలో వేదాల గురించీ వైదిక ధర్మం గురించే మాట్లాడారు. దాని సారాంశము 1877 ఏప్రియల్‌లో కోహినూర్ పత్రికలో ప్రచురించబడినది. వేదాలు నిత్యమైనవనీ పరమేశ్వరుడు వాటిని అగ్ని, వాయువు, సూర్యుడు, అంగీర ఋషుల ద్వారా తెలియ చెప్పాడని ఈ ఉపన్యాసంలో చెప్పారు. సంపూర్ణ జ్ఞాన కోశములయిన వేదాలకు 1101 శాఖలు ఉన్నాయనీ, జ్ఞానం, ఉపాసన, కర్మ కూడా వాటిలో ప్రతిపాదింపబడిన మూడు విషయాలనీ దయానంద చెప్పారు. దేవతలకు ప్రత్యేకమైన గర్భకోశం లేదు. విద్వాంసుడు, జ్ఞానియైన మానవుడే దేవుడు, వాయువునూ, వర్షజలాన్ని శుద్ధి చేయడమే యజ్ఞ సమయంలో అగ్నికి ఆహుతులు ఇవ్వడంలోని ఉద్దేశ్యం. వేదాన్ని అందరూ పఠించవచ్చు. వేదాలు మిధ్యయని నిరూపించి ప్రజలను తప్పుదారి పట్టించడంపట్ల ఆయన తమ విచారం వెల్లడించారు. కొన్ని కథలకు వైదికమైన పేర్లు చేర్చి తరువాతి కాలంలో పురాణాలని పేర్లు పెట్టారని ఎన్నో ఉదాహరణలు చూపారు. సమాజాన్ని నాలుగు భాగాలుగా విభజించడమే వర్ణ వ్యవస్థకు ఆధారమని తరువాతి ఉపన్యాసంలో ఆయన ఋజువు చేశారు. జన్మ వలన కాక చేయగల వృత్తి వలన కులం ఏర్పరిచారన్నారు.

మతమంటే అర్థంలేని ఆచార వ్యవహారాలు, కర్మకాండకాదు. బాల్య వివాహాలు వేద సమ్మతం కాదు. వితంతువులు పునర్వివాహం చేసుకొనవచ్చు. స్వామి దయానందుని విప్లవాత్మక భావాలు ఛాందసుల గుండెల్లో దడ పుట్టించాయి. వారి జీవనోపాధులు నశించి పోగలవని భయపడ సాగారు. వారు దయానందునికి వ్యతిరేకంగా నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ ఆయన క్రైస్తవుల అనుచరుడని, నాస్తికుడని అపఖ్యాతిపాలు చేయనారంభించారు.

స్వామి దయానంద లాహోర్‌లో వుండగా హూపర్ అనే ఫాదరీగారు ఆయనతో వైదిక జీవన పద్ధతి విషయమై చర్చించారు. ఆయన ప్రశ్నలు తెలివిగా, ఉత్తేజాన్ని

కలిగించేవిగా వున్నా ఆయన సంతుష్టి పడినట్లుగా చెప్పలేము. వేద భాష్య ప్రచారం చేయడానికి పంజాబు ప్రభుత్వ సహాయం పొందాలని దయానంద అక్కడి లెఫ్టినెంటు గవర్నరును, ఇతర ప్రభుత్వ అధికారులనూ కలుసుకొన్నారు. కాని ప్రభుత్వం చివరకు ఈ విషయంలో తన అసమర్థతను వెల్లడించింది. అయినా స్వామి దయానంద లాహోర్‌లో మకాం చేయడం అనేక విధాల ఆయన లక్ష్యానికి ప్రాముఖ్యం లభించింది. పంజాబు రాష్ట్రం ఆర్య సమాజానికి ఒక దుర్గంగా తయారైంది. ఈనాటికీ అది ఆ విధంగానే నిలిచింది. ఎంతోమంది ఆయన ఉపదేశాలకు ప్రభావితులై విగ్రహారాధన మానివేశారు. వారితో స్వామి దయానంద లాహోర్‌లో ఆర్య సమాజశాఖ నెలకొలిపే అభిప్రాయం వెల్లడించగానే అక్కడివారి అనుయాయులందరూ అతి సంతోసంగా సమ్మతించి 1877 జూన్ 24వ తేదీన దానిని స్థాపించారు. ఈ కార్యక్రమం డాక్టర్ రహీంఖాను అనే మహమ్మదీయుని ఇంటిలో జరగటం విశేషం. బ్రాహ్మణ విరోధులు పురిగొల్పితే దివాన్ భగవాన్ దాసు గారింటనున్న దయానందని తరిమి వేశారు. అప్పుడు ఈ మహమ్మదీయ సజ్జనుడే తన ఇంట ఆయన కాశ్రయమిచ్చాడు. లాహోర్‌లోని ఆర్య సమాజం 28 మూల సిద్ధాంతాలను సంక్షిప్తం చేయాలని, సామాన్య జనులు సమర్థించే వీలు గా కుదించి, వాటిని పది సిద్ధాంతాలుగా మార్పు చేసింది.

ఈ పది సిద్ధాంతాలు క్రైస్తవ సాంప్రదాయపు పది ఆదేశాలవలె వుండేవి. ఆర్య సమాజావలంబకులు తరువాత వీటినుంచి ప్రేరణ పొందారు. ఈనాటికీ వీటికే ఆర్య సమాజకుల నైతిక సిద్ధాంతాలుగా గౌరవం లభించింది. కట్టుగా వీటిని ఆచరించడం ప్రతి ఆర్య సమాజ సభ్యునికి చాలా యిష్టం. వీటిలోని మొదటి రెండింటిలోనూ సర్వశక్తిమంతుడైన పరమాత్ముని గుణాల వర్ణన వుంది. వేదాలను జ్ఞానం ప్రసాదించే ధర్మ గ్రంథాలుగా మూడవ దానిలో చెప్పబడింది. అయిదు, ఎనిమిది, పదవ సిద్ధాంతాల ద్వారా, ప్రజలు ధర్మాన్నెలా ఆచరించాలో, విద్యనెలా పొందవలెనో, సమాజం నియమాలను పాలించటమెలాగో చెప్పారు. మిగిలిన నాలుగూ, ఏ మతంలోని మూల సిద్ధాంతాలలోనైనా సరే స్థానం పొంది రాజ మర్యాద పొందగలిగినంత గొప్పవి. అవి :

1. సత్యాన్ని గ్రహించడానికి, అసత్యాన్ని విడనాడటానికి ఎప్పుడూ సిద్ధంగా వుండాలి.
2. ప్రపంచానికి మేలు చేయడం ఈ సమాజ ముఖ్యోద్దేశం. అంటే సాంఘిక, శారీరక ఆత్మోన్నత్యం కలిగించడం.
3. అందరితోనూ ప్రీతి పూర్వకంగా, ధర్మాన్ననుసరించి యధోచితంగా మెలగాలి.
4. ప్రతి ఒక్కరూ తమ ఉన్నతితోనే సంతృప్తి పడక అందరి ఉన్నతిలోనే తమ

ఉన్నతి కలదని గ్రహించాలి.

స్వామి దయానంద పంజాబులో వున్న కాలంలో ఇచ్చినన్ని ఉపన్యాసాలు దేశంలోని ఏ ఇతర ప్రాంతాలలో యివ్వలేదు. అమృతసర్, గుర్‌దాస్‌పూర్, జలంధర్, రావల్‌పిండి, గుజరాన్ వాలా, ముల్తాన్ ఎక్కడైనా సరే ఆయన ఉపన్యాసాలు వినేందుకు వందలాది జనం చేరేవారు. ఎక్కడయినా సరే విగ్రహారాధన, వేదాలు, సాంఘిక దురాచారాలు, వైదిక ధర్మాలు వీటిపైనే మాట్లాడేవారు. వ్యక్తుల మరణానంతరం జరిగే శ్రాద్ధకర్మలనూ, బోజనాల తంతునూ ఆయన తీవ్రంగా విమర్శించేవారు. అంతకంటె జీవించివున్న తల్లి దండ్రులను గౌరవించమని ఆయన బోధించేవారు. నమఃశివాయ అని మంత్రం జపించినంతలో పాపాలనుంచి రక్షణ లభించదనీ, గంగలో మునకలు వేసినంతలో చేసిన చెడ్డ పనులకు ప్రాయశ్చిత్తం జరగదనీ ఆయన ప్రతీచోటా చెప్పారు. మంత్రోచ్ఛారణ వలన ఒక్క ఈగనైనా చంపలేనపుడు, మంత్రాల వల్ల భూత - ప్రేత - పిశాచాల నెలా తరుమగలమని మరో ఉపన్యాసంలో ఆయన పరిహాసం చేశారు.

హిందువులు తమ మతగ్రంథాలను చదువరనీ, ధార్మిక సూత్రాలు గ్రహించరనీ ఆయన రావల్‌పిండిలో (ధార్మిక) ఉపన్యసిస్తూ విచారం వెలిబుచ్చారు. ఈ కటువైన కబుర్లు ఛాందసులైన హిందువులకు రుచించేవి కావు. వారు ఆయనపై ఇటుకరాళ్లు విసిరేవారు. అయినా సరే ఆయన ఉత్సాహం ఏమీ తగ్గలేదు. హత్యాప్రయత్నం జరిగినా సరే ఆయన వెనుకంజ వేయలేదు. వెళ్ళిన ప్రతిచోటా ఆయన ఆర్య సమాజాన్ని స్థాపించారు. తమ లక్ష్యాలేమిటో చాటారు. ప్రత్యర్థులు ఎన్నిసార్లు ఎంత కవ్వించినా ఆయన వారిని ఎదుర్కొన్నారు. వైదిక దేవతల గురించి ఆయన చెప్పిన వివరణలు ఎంతో స్వతంత్రంగా కనబడి, ఆయన పాండిత్యాన్ని చాటేవి. అహల్య - ఇంద్రులగాథ, పురాణాల్లో తరువాత కూర్చబడినదని ఆయన తన ముల్తాను ఉపన్యాసంలో చెప్పారు. మాంసాహారాన్ని ఆయన ఎప్పుడూ గర్హించేవారు. వైదిక ఆర్యులు ఎన్నడూ మాంసాహారులు కారని సాధికారంగా వివరించారు. సంవత్సరాలు గడుస్తున్నకొద్దీ వైదిక ఆదర్శాలపై ఒక నూతన సాంఘిక వ్యవస్థ స్థాపించాలనే ఉద్యమం, వేగం పుంజుకొనసాగింది. ఒక సాంఘిక ధార్మిక నాయకునికి ఎదురయ్యే విభిన్న సమస్యలను, స్వామి దయానంద ఎదుర్కొన్నారు. అమాయక ప్రజలను తప్పుదారి పట్టించే ప్రతివ్యక్తి, ప్రతి మత సంప్రదాయం ఆయన ధాటికి తట్టుకొనలేకపోయింది. క్రైస్తవ మహమ్మదీయ ఛాందసుల తర్కరహిత ఉపదేశాలను గురిచూసి, ఆయన కొత్త విమర్శలు చేసేవారు. సంప్రదాయ మతాల మూర్ఖత్వాన్ని, దుర్భోధలను, మతాడంబరాలను మొదటి నుంచి

ఖండిస్తూనే వుండేవారు. ఇప్పుడాయన బౌద్ధ, జైన, సిక్కు సాంప్రదాయాలను ఇతర చిన్న మతాల భ్రమలను బయటపెట్ట సాగారు. 'హిందు' అనే పేరు ఆయనకు ఎన్నడూ ఇష్టం వుండేదికాదు. విగ్రహారాధననీ, సాంఘిక దురాచారములను ప్రోత్సహించినందుకు హిందూ మతాన్ని ఎప్పుడూ ఆయన నిందిస్తూ వుండేవారు. దేశం పతనం చెందటానికి పరాధీనం కావటానికి బాధ్యత దానిదేనని భావించేవారు.

ఉత్తర ప్రదేశ్‌లో మహ్మదీయుల సంఖ్య ఎక్కువ. స్వామి దయానంద మహమ్మదీయ సంప్రదాయాన్ని తీవ్రంగా విమర్శించేవారు. సహజంగానే ముసల్మానులు బాధపడేవారు. వారిలో అల్లరి చేసే కొందరు దయానందుని సభలను సాధ్యమైనంతగా భగ్నం చేసేవారు. రూడ్కీలో దయానంద ఛార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన పరిణామ వాదాన్ని తీవ్రంగా విమర్శించారు. వానరజాతి నుంచి మానవ జాతి మొదట పుట్టినదని చెప్పేవారు కదా. ఈ చమత్కారాన్ని తిరిగి ప్రయోగం ద్వారా రుజువు చేయడానికి ఎవరు అభ్యంతరం చెప్పారంటూ పరిహసించారు. వానరుల వంటి జాతి మనుష్య జాతిని ఎందుకు తిరిగి ఉత్పత్తి చేయలేదని ప్రశ్నించారు. మీరట్‌లో సనాతనులు దయానందుని అవమానించడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. కాని అందువలన వారే అవమానం పొందారు. తరువాత వారు ఆయనపైన దౌర్జన్యం చేసి భయ పెట్టాలనుకున్నారు. కాని సాగలేదు. మీరట్ నుంచి దయానంద ఢిల్లీవెళ్ళి అక్కడనుండి అజ్మీరు వెళ్ళారు. అక్కడ ఆయన ఇద్దరు క్రైస్తవ ఫాదరీలతో వాదోపవాదలు జరిపారు.

సృష్టికర్త - సృష్టి, ఆదమ్ - ఈవ్‌లను గురించి బైబిల్‌లోని అనేక సందర్భాలలోని అనేక విషయాలు ఆయన అడిగారు.

కొంతకాలం తూర్పు రాజస్థాన్‌లో గడిపి దయానంద ఉత్తర ప్రదేశ్ తిరిగి వచ్చారు. 1879వ సంవత్సరం ఫిబ్రవరి 10 నుంచి ఏప్రియల్ 14వతేదీ వరకు ఇదివరలో మాదిరిగానే కుంభమేలా సమయంలో హరిద్వారంలో మకాం చేశారు. అక్కడ స్వామి దయానంద రోజూ ఉదయం - సాయంత్రం గంటలకొలదీ వుపన్యాసాలిస్తూ వుండేవారు. అందువలన ఆయన ఆరోగ్యం చెడింది. 1879లో ఆయన తొడపైన కురుపు లేవడం వలన మంచం పట్టాల్సి వచ్చింది. అస్వస్థులుగా వుండటంతో దయానంద శాస్త్రార్థ చర్చ చేయలేరని, ఈ అదను చూసి ఆయనను జయించినట్లు చెప్పుకోవచ్చుననీ వేదాంతులైన సన్యాసులు, సాధువులు, ఆ రోజుల్లో ఆయనతో చర్చించారు. కాని స్వామీజీ అసాధారణ తార్కికులు. చాలా సులభంగా వారిని ఓడించి వేశారు. ఆ సాధువులకు చాలా క్రోధం కలిగింది, కాని స్వామి దయానంద మామూలు మనిషికాదని ఆయనలో అపారమైన సహనశక్తి

నైతికబలము వున్నాయని వారు గ్రహించారు. ఆ ఇద్దరు సాధువులతో ఆయన జరిపిన ఆసక్తికరమైన చర్చ పరిశీలిస్తే దయానందలో ఎంత చతురత కౌశలము కలవో తెలుస్తుంది.

దయానంద : వేదాంతంటే తమ అభిప్రాయమేమిటో ముందుగా చెప్పండి.

సాధు : జగత్తు మధ్య, బ్రహ్మ సత్యం.

దయానంద : జగత్తు అంటే తమ అభిప్రాయమేమిటి? దానిలో ఏవేమి పదార్థాలున్నాయి? మిధ్య అంటే తమ అభిప్రాయం ఏమిటి?

సాధు : పరమాణువు లగాయతు సూర్యుని వరకూ ఉన్నదంతా జగత్తు, మిగిలినదంతా మిధ్య.

దయానంద : తమ శరీరం, మాట మంతీ, ఉపదేశాలు, గురువులు, పుస్తకాలు అవన్నీ కూడా వాటి క్రిందకు వస్తాయా? రావా?

సాధు : అవును. అవన్నీ దాని పరిధిలోనివే.

దయానంద : మనము మన గురువులు, మన మతం, మన పుస్తకాలు, మన ఆలోచనలు, మాటలు ఇవన్నీ పూర్తిగా మిధ్యే అని తమరే మనవి చేస్తుంటే ఇంక ఆ విషయంలో నేనేమి చెప్పాలి? స్వయంగా వాది వాజ్మూలం విని దావా కొట్టి వేయవలసివస్తే సాక్షులతో, సాక్ష్యాలతో పనిలేదు కదా.

డెహరాడూన్ చేరాక దయానంద మళ్ళీ జబ్బు పడ్డారు. చాలా రోజులుగా విరేచనాలు. విశ్రాంతి తీసుకొనమని వైద్యులు సలహా ఇచ్చారు, కాని ఆయన వినలేదు. ఇంగ్లీషు వైద్యం ఆయనకు నచ్చక, తానే చికిత్స చేసుకొనసాగారు. ప్రజలతో మాట్లాడుతూ మాట్లాడుతూ ఆయన మరుగుదొడ్డికి వెళ్ళవలసి వచ్చేది. కాని రోగం నయం కాగానే మళ్ళీ ఆయన ఉపన్యాసాలు మొదలు పెట్టారు. ఒక ఉపన్యాసంలో ఆయన యధారీతిగా బైబిలు, ఖురాన్‌లలో వ్రాయబడిన కొన్ని విషయాలకు వ్యతిరేకంగా అనేక వాదనలు చేసి ఆధారాలు చూపించారు. అందువలన ఆయన ఉపన్యాసం వినడానికి వచ్చిన కొంతమంది ఫాదరీలు, వారి ఆంగ్లేయ మిత్రులు కోపగించుకున్నారు. కాని వారిలో ఫాదరీలకు, మిత్రులకు మధ్య భేదాభిప్రాయాలు రావటంతో వారు సభ మధ్యలో లేచి వెళ్ళిపోయారు. డెహ్రాడూన్‌లో ఒక హిందూ యువకుడు క్రైస్తవమతం స్వీకరించకుండా దయానంద ఆపు చేశారు. మహమ్మద్ ఉమర్, అను పేరుగల మహమ్మదీయుని తిరిగి హిందూమతం లోనికి మార్చి అతనికి అలఖ్‌ధారీ అని పేరు పెట్టారు.

1879లో మే ఒకటవ తేదీన స్వామి దయానంద కల్నల్ అల్‌కాట్, మేడమ్ బ్లావట్స్కీలను కలుసుకొన్నారు. వారు స్వామి దయానంద ముందు ఈశ్వరుని, వేదాలను నమ్మినట్లు ఎన్నడూ వెల్లడించలేదు. వారి నడవడి పైకి ఆర్యులవలెనే వుండేది. వారు క్రైస్తవమతం గౌరవించిన విషయాలను విమర్శిస్తూ వుండేవారు. అందువలన దయానంద వారి మనసులోని విషయాలను గ్రహించ లేక వారితో కలిసిమెలిసి వుండేవారు.

శహరన్‌పూర్, మీరట్, అలీఘడ్, మురాదాబాదుల్లో కూడా ఆర్య సమాజ శాఖలు స్థాపించుతూ 1879 ఆగష్టు ఒకటవ తేదీన బదాయా చేరుకున్నారు. అక్కడి పండితులు ఆయనని శాస్త్ర చర్చకు ఆహ్వానించారు. ఈ చర్చలో ఎవరి వాదానికి వారే కట్టుబడి వుండి పోవటం వలన గెలుపు ఓటములు ఎవరికీ సంక్రమించని స్థితి కలిగింది. బరేలీలో ఫాదరీలు దయానందునితో పునర్జన్మ, అవతారములు, ఈశ్వరానుగ్రహం లాంటి అనేక విషయాలపై వాదించారు. 'భక్తస్కాట్' అని దయానంద సంబోధించే రివరెండ్ స్కాట్‌గారు ఎల్లప్పుడూ స్వామిగారి ఉపన్యాసాలకు హాజరయ్యేవారు. చాలామంది ఆంగ్లేయులు కూడా ఆయన ఉపన్యాసాలు వినడానికి శ్రద్ధతో కుతూహలంతో వచ్చేవారు. కాని అక్కడి భారతీయ క్రైస్తవుడైన కమిషనర్ కోపగించి ఇతరుల ధార్మిక సంప్రదాయాలను గురించి మాట్లాడేటప్పుడు ఎక్కువ జాగ్రత్త వహించమని దయానందునికి ఆదేశం పంపాడు.

1879వ సంవత్సరం ఉత్తరార్థ భాగంలో దయానంద వాయువ్య ఉత్తరప్రదేశ్‌లో సంచారం చేసి కాన్పూరు కూడా వెళ్ళారు. ఈ సంచారంలో షాజహాన్‌పూర్, లక్నో, ఫర్రూఖాబాద్, ఆగ్రా, మీర్జాపూర్, బనారస్, బీహారులోని దానాపూర్ నగరాలున్నాయి. గోరక్షణ ప్రస్తుతం ఆయన ఉపన్యాసాలలోని ప్రముఖ విషయం కావటంతో చాలామంది హిందువులు ఆర్య సమాజాన్ని సమర్థించడానికి ఉత్సాహం చూపేవారు. ఫర్రూఖాబాద్‌లోని ఛాందసులు ఆయనను శాస్త్ర చర్చకు మరోసారి ఆహ్వానించారు. తరువాత వారి ముఖ్య సమర్థకుడు బలదేవ్‌ప్రసాద్ ఆర్య సమాజ సభ్యునిగా చేరిపోయాడు.

1875లో ఆర్య సమాజ స్థాపన జరిగిన తరువాత దయానందుని ఉపన్యాసాలన్నింటిలో తగు మోతాదులో దేశభక్తి ఛాయ కలిసి కనబడేది.

దేశంలోని అధిక సంఖ్యాకులందరికీ ముక్తి లభించే వరకూ తను కూడా ముక్తి కోరనని ఆయన ఫర్రూఖాబాద్‌లో లాలా మోహన్‌లాల్‌తో చెప్పారు. విదేశీ పాలకులు దేశంలోని అపార సంపదని హరించారని, అయినా దేశం స్వాతంత్ర్యం పొందితే ఎంతో

సంపన్న దేశంగా రూపొందుతుందనీ అన్నారు.

విశాల హృదయంతో ఓరిమితో పని చేసినందుకు తనకు యథేచ్ఛగా అభిప్రాయాలను ప్రకటించే స్వేచ్ఛ నిచ్చినందుకు దానాపూర్‌లో దయానంద ఆంగ్లేయ పాలకులను ప్రశంసించారు. దయానంద పంజాబు నగరంలో అనుభవాన్ని వివరించారు. క్రైస్తవ మతానికి ప్రతికూలంగా ఆయన మాట్లాడుతున్నచోట జనరల్ రాబర్ట్స్ కూడా వచ్చి కూర్చున్నారు. సభానంతరం రాబర్ట్స్ ఆయనని కలుసుకొన్నప్పుడు తాను సభలో వున్నప్పటికీ ధైర్యంగా క్రైస్తవ మతానికి ప్రతిగా మాట్లడగలినందుకు అభినందించారు.

కాలం గడుస్తున్నకొద్దీ ఎక్కువమంది క్రైస్తవులు, ముసల్మానులు దయానంద ఉపన్యాసాలను వినడానికీ, ఆయనతో ధార్మిక విషయాలపై చర్చలు జరుపడానికీ విచ్చేయసాగారు. గోమాంసం తినడం వాంఛనీయం కాదని దానాపూర్‌లో జాన్స్‌తో దయానంద వాదించి ఆయనని నిరుత్తరుడిని చేశారు. ఇక గోమాంసం భుజింపనని ఆయన దయానందకి మాటిచ్చారు. కాని హిందూ మత మౌఢ్యం దయానంద ఇచ్చిన చేదుమందును మింగగల స్థితిలోలేదు. ఎక్కడికెళ్ళినా స్వామిని భయపెట్టడానికీ, ఆయనపై దాడి చేయడానికీ కిరాయి గుండాలని సహితం పంపేవారు.

కాని స్వామిజీ బండరాయిలా చెక్కు చెదరలేదు. అనేక సాంఘిక, మత దురాచారాల కెదురుగా తాను నిలబెట్టిన మహీరుహన్ని కదల్చడానికి ఆయన సిద్ధంగా లేరు. దానాపూర్‌లో దయానందుని సభ భంగం చేయడానికి హిందువులు, చివరికి ముసల్మానులతో సహితం చేతులు కలిపారు. 1871, ఏప్రిల్ 20వ తేదీన స్వామి దయానంద వారణాసి చేరారు.

ఈసారి ఇక్కడ విజయనగర మహారాజుగారి తోటలో బస చేశారు. ఇక్కడ ఆయనని కలుసుకోవడానికి కల్నల్ అల్‌కాట్, బ్లావత్‌స్కీసతి, బొంబాయి నుంచి వచ్చారు. స్వామి నగరానికి మళ్ళీ వచ్చారన్న వార్తతో వారణాసి అంతా చైతన్యవంత మయింది. వివిధ ధార్మిక విషయాలపై ఆయన తన అభిప్రాయాలను ప్రకటిస్తారని కరపత్రాలు పంచిపెట్టేసరికి, ఆయనని నిందిస్తూ వేసిన కరపత్రాలు కూడా రంగంలోనికి దిగాయి. వివిధ వార్తా పత్రికలలో, ఆయన కనుకూలంగానో, ప్రతి కూలంగానో రాస్తూండేవారు. సాంప్రదాయ వాదులు మేజిస్ట్రేట్ బాల్‌గారి వద్దకు వెళ్ళి ఈ ఉపన్యాసాలవల్ల నగరంలో శాంతికి భంగం కలిగే ప్రమాదమున్నదనీ, వీటిని నిరోధించవలసినదనీ కోరి, ఆయనను ఒప్పించగలిగారు. ఉపన్యాస మివ్వడాన్ని నిరోధిస్తూ ప్రభుత్వం యిచ్చిన ఆదేశాన్ని పయొనీర్, థియొసఫిస్టు పత్రికలు తీవ్రంగా

విమర్శించాయి. ఆ పత్రికలు ప్రచురించిన అభిప్రాయల ప్రభావం వలన ఆ ఆదేశం రద్దయింది.

వారణాసిలో దయానంద ఏడు నెలలకుపైగా వున్నారు. అక్కడ ఆయన రచనలు ప్రచురించడానికి ఒక ముద్రాక్షరశాల తెరిచారు. ఆర్య సమాజ శాఖను కూడా అక్కడ స్థాపించారు. ఒక ఉదయం ఆయన అల్పాహారం తీసుకుంటున్న సమయంలో కొందరు ఆగ్లేయులు ఆయనని కలుసుకోవడానికి వచ్చారు. అందులో ఒకరు తాము తాకిన ఆహారాన్ని ఆయన తినవచ్చా అని అడిగారు. దయానంద జవాబుగా ఏ ఆర్యునికయినా ఆంగ్లేయులు తాకిన ఆహారం తినడంలో తప్పులేదని అన్నారు.

1880, మే 14వ తేదీన దయానంద లక్నో చేరి అక్కడ ఆర్య సమాజాన్ని స్థాపించారు. ఎన్నో సంవత్సరాలుగా ఆయన రచించుతున్న వేద భాష్యాన్ని ప్రచురించడానికి ఆయనకి 1350 రూపాయలు అక్కడ బహూకరించారు. వెళ్ళిన ప్రతిచోట ఆయనకి హార్దిక స్వాగతం లభించేది. అనుయాయులు, దనికులు ఆయన సుఖంగా బస చేయడానికి ఏర్పాట్లు చేసేవారు. దాని ఖర్చులు భరించేవారు. వేద భాష్యానికి ధనం సేకరించడంతోపాటు, సంస్కృత పాఠశాలలు తెరవమని ఆయన అనుయాయులకు సలహా యిచ్చారు. కడుపు నెప్పితో జ్వరం తగిలినా, నీరసంగా వున్నా ఆయన విశ్రాతి తీసుకొన నిరాకరించారు. రోజూ అయిదారు గంటలు మాత్రం నిద్రించేవారు. మిగిలిన కాలమంతా వాదోపవాదాలతో సమావేశాలతో, పుస్తక రచనలో గడిచిపోయేది. మీరట్‌లో ఆర్య సమాజ ప్రారంభోత్సవం 1880 జులై 8వ తేదీన జరిగింది. భారతదేశంలో దివ్యజ్ఞాన ఉద్యమం ప్రజారంజకం చేయడానికి దయానందుని సహకారం పొందుటలో కృతకృత్యులు కాగలమని, దివ్యజ్ఞాన సభ్యులు భ్రమపడేవారు. మరోవైపు బ్లావత్స్కీ సతి, కల్నల్ ఆల్‌కాట్, ఆర్య సమాజంలో చేరగలరని, అప్పుడు ఆర్య సమాజం విదేశాలలో శాఖలు స్థాపించుకొనగలదని స్వామీజీ ఆశించేవారు. కాని 1880లో వారిద్దరూ దయానందుని చూడటానికి వచ్చినపుడు నిజం తెలిసింది. దయానందునితో జరిగిన సంభాషణలను బట్టి వారిద్దరూ ఈశ్వరునిగానీ, వేదాలనుగానీ నమ్మటంలేదని తేలిపోయింది. అందుచేత స్వామీజీ ఇక దివ్యజ్ఞానులతో తెగతెంపులు చేసుకొన్నారు.

1880, నవంబరు 27వ తేదీన దయానంద ఆగ్రాచేరి , 1881 మార్చి 10వ తేదీ వరకూ అక్కడే వున్నారు. అక్కడ కూడా ఆర్య సమాజాన్ని 1880, డిసెంబరు ఆరవ తేదీన స్థాపించారు. ఆగ్రాలో సెయింట్ పీటర్స్ చర్చికి చెందిన బిషప్‌ను కలిసి ఆయనతో

మత విషయాల గురించి చర్చించారు. అందరికీ అంగీకారయోగ్యమైన విషయాలను ప్రచారం చేయడానికి వీలుగా ధార్మిక నాయకుల మధ్య ఒప్పందం కుదిరిన బాగుండునని, అప్పుడు అందరూ కలిసి పనిచేయవచ్చుననీ, అప్పుడే కేవల మత విరోధులు, సంశయాత్ములు, నాస్తికులు మాత్రం విరోధులుగా వుండి, మిగిలిన వారంతా ఏకమయ్యే అవకాశం కలుగుతుందని దయానంద బిషప్‌తో చెప్పారు. అది వీలుపడదనీ, ముసల్మానులు, క్రైస్తవులు - మాంసాహారాన్ని ఎన్నటికీ వర్జించరని, క్రైస్తవుని క్రైస్తవ మతంతో వేరు చేయలేరనీ బిషప్ బదులు చెప్పారు.

ఆ సంభాషణ తర్వాత దయానంద చర్చి దర్శించాలనే కోరిక ప్రకటించారు. కాని కేతడ్రెల్‌లోనికి ప్రవేశించాలంటే తలపాగా తీసివేయాలి. ముందుగా తలపాగా తీయడానికి ఆయన సిద్ధంగా లేకపోవటంతో ఆయనకి చర్చిలో ప్రవేశం లభించలేదు. 1881లో ప్రభుత్వం ప్రథమ జనాభా సేకరణకై ఏర్పాట్లు చేసింది. హిందువులంతా తమ మతం - వైదికమతమనీ, తమ జాతి - ఆర్య జాతి అనీ అలా వివరాలలో పొందుపరచాలని దయానంద కోరిక. ఆర్య సమాజ సభ్యులంతా అలా చేయవలసినదిగా ఆదేశిస్తూ హెచ్చరికలు జారీ చేయమని ఆర్య సమాజ మంత్రులకు ఆయన సూచించారు. అయితే ఆ ఆదేశాలను ఎంతమంది అమలు పరచారో తెలియదు.

1881 మార్చి నెల 10వ తేదీన దయానంద భారత్‌పూర్ వెళ్లి పదిరోజులుండి జయపూర్‌కి ప్రయాణమయ్యారు. అక్కడ ఆయన అద్వైత వేదాంతాన్ని విమర్శనాత్మకంగా సమీక్షించే ఉపన్యాసం ఒక్కటి మాత్రమే ఇచ్చారు.

మధ్యయుగాలలో వీరులై, నవ్వుతూ ప్రాణాహుతి చేసిన రాజపుత్ర యోధుల వారసులను - రాజస్థాన్‌లోని రాజులను, మహారాజులను దీర్ఘ నిద్రనుంచి మేల్కొలపవచ్చుననే ఆశలతో, దయానంద తన యాత్రలో తుది మజిలీ ప్రారంభించారు. ఈ ప్రయత్నంలో తానే ఆహుతి కావచ్చునని ఆయనకెలా తెలుస్తుంది?

## 6

# సామంతరాజ్య శక్తులతో పోరాటం

భారతదేశంలో ఆంగ్లేయులు పాలించిన ప్రాంతాలలో 16 సంవత్సరాలు దయానంద వైదిక సందేశాలిస్తూ పర్యటించి రాజస్థాన్‌లోని ఒక ప్రాంతానికి వచ్చారు. అది చాలా పేరు పొందిన ప్రాంతం. శతాబ్దాలుగా సాగిన తురుష్కుల, ఆఫ్ఘనుల, మొగలాయిల శక్తిని ఎదుర్కొన్న మధ్యయుగ వీరుల కథలతో ప్రసిద్ధిగాంచిన ప్రాంతం అది. అక్కడ ఎక్కువగా హిందువులుండే వారు. పాలన మాత్రం రాజపుత్రులది. భారతీయుల గొప్ప సంప్రదాయాలను మళ్ళీ ప్రోత్సహించమని హితవుచెప్పినంతలోనే ఈ హిందూరాజులు సంతోషిస్తారని దయానంద తలపోశారు. దురదృష్టంకొలదీ ఈ సంస్థానాలు చాలా వెనుకబడి వున్నాయి. రాజులకు ముందు చూపు లేదు. వారి రాజ్యాలను సంస్కరించడానికి ఒక పద్ధతి, ప్రణాళిక లేదు. మదిర, మగువ, నృత్యవిలాసాలు - ఇదే వారికి కాలక్షేపం. అలా వారు సమయం వృధాచేసేవారు. వారి సింహాసనాలు స్థిరంగా వున్నాయి. అంతే మరేమీ వారికి అక్కరలేదు. వేటకీ, వినోదాలకీ తగిన శరీర దారుఢ్యం కాపాడుకోవటం తప్ప వారికి మరోధ్యాస లేదు.

దయానంద ఈ రాజులను మహారాజులనూ నిద్రలేపవలెననుకొన్నారు. వీరు తెలివిగా యోగ్యంగా రాజ్యం చేస్తే, ప్రజలు కూడా దేశాన్ని పునర్ జాగృతం చేసే మహత్కార్యంలో చేరి ముందుకు చూడగలరని అనుకొన్నారు. పాలకులను మేల్కొలపగలిగితే ప్రజలు కూడా నిర్మాణ కార్యాలలో పాలు పంచుకొంటారు. పాలకులు, పాలితులూ, హిందువులే గనుక, హిందువుల జాగృతితో, దేశ జాగృతి దానంతటదే సిద్ధించుననీ,తద్వారా దేశానికి ఉన్నతి కల్గుతుందనీ దయానంద ఆశించారు.

ఒక సంస్థానం కొత్త యవ్వనంతో కళకళలాడితే రెండవ సంస్థానం చూసి నేర్చుకొంటుందనుకొన్నారు దయానంద. ఆయన రాజపుత్రరాజులలో, మహా రాజులలో దాగివున్న సద్గుణాలను పైకి తెచ్చి వారి పూర్వీకులవలె వారూ ప్రజల అభ్యున్నతికి

పాటుపడే విధంగా వారిని తీర్చిదిద్దుదామనుకున్నారు.

1881 మార్చి 10వ తేదీన దయానంద భరత్‌పూర్ చేరారు. అక్కడ కొన్ని రోజులు వైదిక మత సందేశాన్నిచ్చిన తర్వాత జయపూర్ మీదుగా అజ్‌మీర్ వెళ్లారు. అంతకుముందే అజ్‌మీర్‌లో ఆర్య సమాజశాఖ పనిచేస్తోంది. అక్కడ ఆయన శ్రోతలకు అర్థమయ్యేలా సరళమైన భాషలో ప్రాచీన శాస్త్రాల సందేశమేమిటో వివరించారు.అక్కడ ఆయనను కలుసుకొనడానికి పెషావర్ నుంచి లేఖ్‌రాయ్ పండితుడు వచ్చాడు. హిందూ సమాజాన్ని ఎదుర్కొంటున్న అనేక సమస్యల్ని ఆయన దయానందునితో చర్చించారు. ఇతర మతావలంబకులను హిందూమతంలో చేర్చుకొనటం అందులో ఒకటి. దయానంద శుద్ధి ఉద్యమాల సమర్థకులే. ఇతర మతావలంబకులను హిందువులుగా మార్చడానికి ఆయన అనుమతించారు.

అజ్‌మీర్ నుంచి దయానంద మసూదా చేరారు. అజ్‌మీర్-చిత్తౌర్‌లైనుపై నున్న నసీరాబాద్ స్టేషనుకు కొన్ని మైళ్ళదూరంలో మసూదా వుంది. అక్కడ దయానంద క్రైస్తవులతో, జైనులతో వాదోపవాదాలు జరిపి, అనేక జైనులచే జంధ్యం ధరింపజేశారు.

రాయపూర్ నుంచి దయానంద చిత్తౌర్ వెళ్లారు. అదే వందలాది రాజపుత్ర స్త్రీల త్యాగానికి సాక్షిగా వున్న చితౌడ్‌గఢ్ - ఎన్నో కష్టాల నెదిరించి నిలబడిన చితౌడ్‌గఢ్. మేవాడ్ సంస్థానానికి శతాబ్దాలుగా చితౌడ్ రాజధాని. అక్బర్ కాలంలో సిసోడియా వంశీయులకి రాజదుర్గం అది. అందువల్ల దయానందకి ఆ నగరమంటే ఎంతో ఆకర్షణ. మేవాడ్, గత కాల వైభవానికి కథగా మాత్రమే మిగిలిపోయింది. మహారాజా సజ్జన్ సింహ అందరిలాంటి రాజే. సత్ ప్రవర్తన కన్న, తత్వ చింతన కన్న ఇంద్రియ సుఖాలంటే ఆయనకు ఎక్కువ ప్రీతి.

పైకి ఆయన శివభక్తుడు, కాని లోపల మతమన్నా, సదాచార పరాయణతన్నా మక్కువలేనివాడు. కాని ఎక్కడో కొంచెం ఆశ మినుకుమినుకు మంటున్నది. మహారాజా దయానంద గురించి విన్నారు. స్వామి రచించిన సత్యార్థ ప్రకాశికలోని కొన్ని భాగాలు చదివారు. అందుచేత రాజా, దయానంద దర్శనం చేద్దామనుకొని చిత్తౌడ్ దయచేయ వలసినదిగా మోహన్ లాల్ విష్ణు లాల్ పాండ్య, కవిరాజ శ్యామలదాసుల ద్వారా ఆహ్వానం పంపారు. దయానంద ఆయన పిలుపు మన్నించి 1881 అక్టోబర్ 27వ తేదీన చిత్తౌర్ వచ్చారు. చిత్తౌర్‌లో గంభీరీ నది ఒడ్డునే దయానంద బస చేయడానికి తగిన ఏర్పాట్లు జరిగాయి. శాహపూర్ మహారాజ నాహర్ సింహ్, మహరాజా సజ్జన్ సింహ్ చాలాసార్లు దయానందను కలుసుకొనడానికి అక్కడికి వచ్చి మతం గురించి రాజనీతి

గురించి చర్చించేవారు. ఆ ప్రాంతంలో ప్రజలు పెద్ద సంఖ్యలో సభలకు వచ్చి వైదిక సిద్ధాంతాలపై దయానంద వివరించిన విలక్షణమైన వివరణలు విని ప్రభావితు లయ్యేవారు.

ఆర్యసమాజం వార్షిక సభలలో పాల్గొనడానికి దయానంద చిత్తోర్ నుంచి బొంబాయి బయలుదేరి వెళ్ళారు. బొంబాయి రైలుస్టేషన్‌లో కల్నల్ అల్‌కాట్, మిగతా కార్యకర్తలు ఆయనకి స్వాగతం చెప్పి బాల్కేశ్వర్‌లో ఏర్పాటు చేసిన బసకి తీసుకువెళ్ళారు. కల్నల్ ఆల్కాట్ బ్లావాత్‌స్కీ సతి దయానందుని ప్రశంసించేవారు. ఆయన తార్కికశక్తి, విద్వత్తూ చాలామంది పండితులనీ పామరులనీ ఆకర్షించి ప్రభావితం చేయడంతో, ఆర్యసమాజం యొక్క సర్వమత సమన్వయ సందేశానికి ఆయన సహాయపడతారనీ, విస్తృత ప్రచారం చేయగలరనీ వారు ఆశించారు. దయానంద కూడా దివ్యజ్ఞాన సంఘం సభ్యులతో కలిసి పనిచేయడాని కిష్టపడిన వారేకానీ వారితో చర్చలు జరిపాక వారు నాస్తికులనిపించింది. తనకు పూర్తిగా భిన్నమైన సిద్ధాంతాలను నమ్మిన వారనిపించింది. వారి కార్యక్రమాలు, వారు చూసే దృష్టి వేరుగా కనిపించాయి. దయానంద బొంబాయిలోనున్న సమయంలో ఎక్కువ భాగం ఋగ్వేదభాష్యం వ్రాస్తూ గడిపారు. ఆయన తమ ఉపన్యాసాలలో విగ్రహారాధనను అతి తీవ్రంగా ఖండిస్తూ, ప్రాచీన కాలంలోనూ, వేదాలలోనూ విగ్రహారాధన కలదని వాదించే పండితులను ప్రమాణాలు చూపించమని నిలదీశారు.

ప్రజలు వర్తక వ్యాపారాలు చేయాలని, విదేశాలు పర్యటించాలని, దూరప్రాంతాలకు చెందిన సంబంధాలు కుదిర్చి ఆడపిల్లలకు పెళ్ళి చేయాలని అలా చేయటంవలన విశాల దృష్టి అలవడుతుందని దయానంద ఉద్బోధించారు. ఆయన సలహానుసరించి వుంటే భారతీయులు మరింత అభివృద్ధి చెందేవారు. గో సంరక్షణ ఎంత అవసరమో బొంబాయిలో అనేక సభలలో దయానంద పదేపదే చెప్పేవారు. మూడుకోట్ల సంతకాలు సేకరించి విక్టోరియా మహారాణికి సమర్పించాలని నిర్ణయించారు. కాని ఆయన అకాల మరణంతో ఆ నిర్ణయం కార్యరూపం దాల్చలేదు.

బొంబాయి నుంచి స్వామి దయానంద ఖండవా, ఇండోర్, రత్‌లామ్ జావడామీదుగ, ఉదయపూర్ వెళ్లారు. ఉదయపూర్ మహారాజాకి దయానందుని ఎడల ఎంతోభక్తి, ఎంతో గౌరవం. అక్కడ ఆయన మకాం చేసినంతకాలమూ, మహారాజా ప్రతిరోజూ ఆయన దగ్గరకెళ్లి అనేక విషయాలు చర్చిస్తూ గడిపేవారు. సంస్కృతం నేర్చుకోవాలని మహారాజా కోరిక వెలిబుచ్చగానే దయానంద స్వయంగా ఆయనకి

బోధించసాగారు. ఆయన సరళ పద్ధతిలో సంస్కృతం నేర్పడంవలన మహారాజు అతి శీఘ్రంగానే మనుస్మృతిని అర్థం చేసుకోగలిగారు. మహాభారతం కూడా ఎంతో ఆతృతగా వినసాగారు. ప్రాచీన ధర్మ శాస్త్రములలో చెప్పబడిన సూత్రాలననుసరించి ప్రజలను పాలించడం వాంఛనీయమనీ, వివేకవంతమనీ, విదురనీతి, మహాభారతముల ద్వారా దయానంద మహారాజుకి తెలియజెప్పారు. అలాగే మహారాజు సజ్జనసింహ అలవాట్లలోనూ, అభిప్రాయాలలోనూ చాలా ఆశ్చర్యం కలిగించే మార్పులు వచ్చాయి. రాజమహలులో నిత్యాగ్ని హోత్రవిధికి అనుమతి తీసుకొని రాజు ఇంద్రియభోగాలను త్యజించాడు.

కాని దయానంద విగ్రహారాధనను తీవ్రంగా ఖండించడంతో మహారాణా చాలా సందిగ్ధంలో పడ్డారు. హిందూసమాజ సంస్కరణ కవసరమైన హిందువుల సహాయం పొందటం కోసమైనా విగ్రహారాధనను నిందించటం తెలివైన పనికాదని ఆఖరికి ఒక రోజు మహారాణా ధైర్యంచేసి దయానందతో మనవిచేశారు. మహారాణా బహుశా స్వామి దయానంద తమ పక్షం వహిస్తారని ఆశతో ఆయనని ఏక లింగాలయం మహంతుగా నియమించే ఉద్దేశ్యం కూడా వెలిబుచ్చారు. ఆ ఆలయం మహంతు పదవి దొరకటం అంత చిన్న విషయంకాదు. లక్షలాది రూపాయల విలువగల ఆస్థికి మహంతు అధికారి. మహంతు రాజ్యానికి ధర్మాధికారి కావటంతో, మహారాణా పదవి తప్ప అంత ఉన్నతమైన పదవి మరొకటిలేదు. కాని దయానంద అలా లొంగే మనిషికాదు. ఆయన తన లక్ష్యంకోసం ఎంత నిష్టగా వుంటారో తెలుసుకొనడానికి ఈ సందర్భంలో ఆయన ఏమి చెప్పారో ఆయన మాటలనే గుర్తు చేసుకోవాలి. స్థిమితంగా ఆయన ఇలా అన్నారు.

"మహారాణా! మీరు నాకు ఆశ చూపి సర్వశక్తిమంతుడైన పరమేశ్వరుని అజ్ఞను నాచేత ఉల్లంఘింప చేయించాలని కోరుకుంటున్నారు. ఒక్క తృటిలో విస్మరించతగిన ఈ చిన్న రాజ్యం, ఆలయం నన్ను వేదాజ్ఞను, ఈశ్వరాజ్ఞను కాదనేలా చేయలేవు. నే నెన్నడూ సత్యాన్ని విస్మరించను. దాచను. ఇకముందు మీరు కొంచెం ఆలోచించి మాట్లాడుతూ వుండండి. (మహర్షి దయానంద జీవిత చరిత్ర - 27వ అధ్యాయం పేజీ 671)

దయానంద చెప్పిన సమాధానం విన్న మహారాణాకి నోటమాటరాలేదు. కొంచెం సర్దుకొని తెలివితెచ్చుకొని, అవివేకంగా మాట్లాడినందుకు క్షమించమని కోరారు.

ఉదయపూర్‌లో మోహన్‌లాల్ విష్ణు పాండ్య, కవిరాజ్ శ్యామలదాస్, దయానందకి ఎంతో సన్నిహితులయ్యారు. అనేక విషయాలపై ఆయనతో చాలాసేపు

వారు చర్చిస్తూ వుండేవారు. దేశ సమస్యలకు మూలమేమిటో తెలుసుకొనే ప్రయత్నం చేసి దేశానికి కలిగిన రుగ్మతలను పరిశీలించేవారు. అలా వెలువడిన అభిప్రాయాలను కొన్నిటిని ఉదాహరించాలి. విష్ణుపాండ్యకి దయానంద ఇలా తమ అభిప్రాయాలను వివరించారు.

"ఒక భాష, ఒక మతం, ఒక లక్ష్యం వుంటేనే దేశం అభివృద్ధి చెందుతుంది. మతాచార్యుల, నాయకుల అప్రమత్తత వల్ల జాతి ఏకభావంతో వుండలేదు. ఆచార వ్యవహారాలు, జీవన విధానాలు కలుషిత మవుతాయి. ఆర్యజాతి కిదే గతి పట్టింది. జాగ్రత్త పడకపోతే జాతి నశించి పోతుంది. మతాచార్యుల పొరపాటువలన కోట్లాది జనులు ముసల్మానులుగా, క్రైస్తవులుగా మారిపోయారు. చెడు ఉపదేశాల నుంచి దురాచారాల నుంచి పూర్ణమైన సంప్రదాయాల నుంచి జాతిని మేలు కొలుపకపోతే జాతి నశించక తప్పదు. ఏదో స్వార్థం కోసం నేనీ పనిచేయటంలేదు. ఈ ప్రయత్నంలో నేను చాల బాధలు పడ్డాను. దూషణ తిరస్కారాలను సహించాను. విషం కూడా యిచ్చారు. కాని నేను జాతికోసం, మతంకోసం అన్నీ భరిస్తాను." (మహర్షి దయానంద జీవిత చరిత్ర-27 వ అధ్యాయం-677 వ పుట)

హిందువులను సంరక్షించాలనే మహత్తర ఆశయానికి పాటుపడాలన్న గురువు గారి ప్రగాఢ వాంఛ చూసి మోహన్‌లాల్ విష్ణు పాండ్య కళ్ళ వెంట అశ్రువులు జారాయి. లక్ష్య సాధనకోసం ధైర్యంగా భరించలసిన కష్టాల గురించి ఎంతో అర్థవంతంగా ఆ మాటాల్లో ఆయన వివరించారు.

ఆయన ముందున్నది కఠోర మార్గం. దానిపై ప్రయాణం చేయాలంటే ఎన్నో కష్టాలను ఎదుర్కొనాలి. ఆయన వెన్ను చూపని వీరుడు, ఎంతో సాహసంతో అన్ని పరిస్థితులను ఎదుర్కొన్నాడు. భయపడలేదు.

స్వామి దయానంద ప్రజా సేవలో తన సర్వస్వం అర్పించారే కాని ప్రతిఫలంగా ఏమీ ఆశించలేదు. ఏసంప్రదాయాన్ని ఆయన ప్రతిష్ఠించ దలచలేదు. ప్రజలను గాఢ నిద్ర నుంచి మేల్కొలప దలిచారు. అందుకు ఆయన కవిరాజ్ శ్యామల దాన్‌తో మాట్లాడుతూ శిష్యులు తన స్మృతి చిహ్నంగా ఏమీ నెలకొల్ప రాదని హెచ్చరించారు. తన మూర్తిని భక్తులు ఆరాధించ కుండా తను మరణించిన తర్వాత చితాభస్మాన్ని ఏదైనా పొలంలో జల్లాలని ఆయన ఆదేశించారు. ఆయన ఉపదేశాలూ, ఉపన్యాసా లివ్వడంతోబాటు ప్రాచీన సంప్రదాయాలను, ఆదర్శాలనూ మళ్ళీ వ్యాప్తి గావించడానికి అనుకూలమైన సాంఘిక సాంస్కృతిక స్థితికోసం, తను చేస్తూ వచ్చిన పనులను పూర్తి

చేయడానికి సభలను, సమాజాలను సంఘటిత పరిచారు. ఒక క్రమంలో గొలుసుగా గుచ్చారు. విగ్రహారాధనకు, హిందువులను ముస్లిములుగా మార్చడానికి ఆయన వ్యతిరేకి. ఇతర మతాలలోని మూర్ఖత్వాన్ని దురాచారాలను, భ్రమలను నిందించటం వలన ఆయన ప్రాణాలకు దినదిన గండంగా వుండేది. ఆయనపై హత్యా ప్రయత్నాలు జరిగేవి. చాలాసార్లు విష ప్రయోగం కూడా జరిగింది. వేదాలు చాటిన సత్యాన్ని వేదాలు సారించిన దృష్టిని ప్రచారం చేయటం-తన తదనంతరం కూడా ఉత్సాహంగా సాగాలని ఆయన కోరిక. విద్యా సాధనలోనూ, దైనందిన విషయాలలోనూ అనాథులపట్ల, బీదల ఎడల ప్రత్యేక శ్రద్ధ చూపించాలనేవారు.

వైదిక జీవన పద్ధతికి, వైదికాదర్శాల వ్యాప్తికి తోడ్పడేలా ఆయన వీలునామా రాసి పరోపకారిణి సభను స్థాపించారు. ఆ సభ ఈ పనులు నిర్వర్తించడానికి ఆయన జీవితకాలంలోనే కాక, ఆయన చేపట్టిన కార్యక్రమాలకు ఆయన మరణానంతరం కూడా ధర్మకర్తగా మెలగాలి. ఆ సభలో ఇరవై ముగ్గురు సభ్యులుండాలి. అధ్యక్షులు మహారాణా సజ్జన్ సింహ. విశిష్ట సభ్యులలో మహరాజా నాహర్ సింహ, మహదేవ గోవింద రానడే, శ్యామ్‌జీ కృష్ణ వర్మకూడా వున్నారు. ఆ సంఘం దయానందుని లౌకిక ఆధ్యాత్మిక సంపదలను పరిరక్షించాలని, అనేక సాధనాల ద్వారా వేద వేదాంగాలను ప్రచారం చేయాలని నిర్దేశించారు.

ఆరు నెలలకుపైగా ఉదయపూర్‌లో మకాంచేసి, దయానంద శాహపూర్‌కి బయలుదేరారు. వీడ్కోలు సందర్భంగా ఉదయపూర్ మహారాజా ఆయనకొక సన్మానపత్రం, విలువైన శాలువ, వంద రూపాయలు బహూకరించారు. ఆ రోజులలో దయానంద వేదభాష్యం రచిస్తూండేవారు. మహారాణా అందుకోసం వారికి 12 వందల రూపాయలు విరాళంగా ఇచ్చారు. మహారాణా సజ్జన్ సింహ పరిపాలనలో అపూర్వమైన మార్పు వచ్చింది. ఇప్పుడాయన వేద విద్యా సంరక్షకుడు.

శాహపూర్‌లో దయానంద 1883 మార్చి 9వ తేదీ నుంచి మే 23వ తేదీ వరకు వున్నారు. ఆయనంటే అక్కడి రాజుకి పరమభక్తి. స్వామీజీ అక్కడున్నంత కాలమూ అతను అక్కడికి వచ్చి, శాస్త్రాధ్యయనం గురించీ, ఇతర విషయాలూ చర్చిస్తూ ఆయనతో రోజూ మూడు గంటలసేపు గడిపేవాడు. అప్పుడప్పుడు ఉదయాన్నే స్వామీజీతో వాహ్యాళికి వెళుతుండేవాడు. ప్రాణాయామంకూడా నేర్చుకొన్నాడు.

స్వామీజీ శాహపూర్‌లో మరికొన్ని మాసాలు గడిపితే బాగుంటుందని రాజు కోరిక. కాని అతని సంస్థానం చాలా చిన్నది కావటంతో ఎక్కువ కాలం స్వామీజీ అక్కడ

వుండలేకపోయారు. జోధపూర్ దయచేయవలసినదిగా దయానంద్‌కు ఆహ్వానం అందినప్పటికీ, అక్కడికి వెళ్లటం మహారాజా నాహర్‌సింహకు ఇష్టంలేదు. దయానందను అలా వెళ్లవలదని చెప్పడానికి రాజుకి కొన్ని ప్రత్యేక కారణాలున్నాయి. జోధ్‌పూర్ చాలా వెనుకబడిన సంస్థానం. చాలామంది ముస్లింలు అక్కడికి వలసవెళ్లి నివసిస్తున్నవారు. దయానందుని ముస్లిం వ్యతిరేక భావాలు, ప్రసంగాలు వారికి నచ్చవు. అంతేకాక అక్కడి మహారాజు, మగువకీ మద్యానికీ దాసుడయి, నన్హీజా అనే నర్తకి పట్ల ఆసక్తి గలవాడు. జోధ్‌పూర్‌లో వుండే సమయంలో అప్రమత్తంగా వుండాలనీ, ఇతర మతాలను దూషించవలదని ఆయనని నాహార్ సింహ హెచ్చరించారు. మూఢనమ్మకాలను పోరాడటానికి ఒక రూపమై, వైదిక ధర్మ పతాకను ఎత్తుగా ఎగురవేయించడానికే అవతరించిన దయానందలాంటి కారణజన్ములు, ఇలాంటి హెచ్చరికలకు స్వాగతం పలుకుతూనే వుంటారు. దయానంద జోధ్‌పూర్ వెళ్లకుండా ఎవ్వరూ ఆపలేకపోయారు. ఆయన ఎన్నుకొన్న మార్గం నుంచి ఆయనను ఎలాంటి ప్రాణభయమూ మార్చలేదు. ఎంతమందయినా ఆపలేరు.

ప్రాణాలంటే ఆయనకి తీపివున్నా, విరోధులంటే భయమున్నా ఆయన ఉత్తరదేశంలో మూలమూలకీ వైదిక సందేశాన్ని వ్యాపింపచేయగలిగేవారేకాదు.

తిరుగు ప్రయాణంలో మళ్లీ శాహపూర్ వచ్చి వుంటానని చెప్పి, మహారాజాదగ్గర శలవు తీసుకొని 1883 మే 23వ తేదీన దయానంద శాహపూర్ నుంచి బయలుదేరారు. విధాత యింకేమి తలపెట్టినో మరి దయానంద శాహపూర్‌కానీ, ఉదయ్‌పూర్‌కానీ మళ్ళీ రాలేకపోయారు.

# 7

# సేవా వేదికపై త్యాగం

జోధ్‌పూర్ రాజు ఆహ్వానం మన్నించి స్వామిదయానంద అక్కడికి వెళ్లడం సరైన పథకం కాదని, తరువాత సంఘటనలు బట్టి స్పష్టంగా కనబడుతున్నది. ఆయన భయ మెరుగని ధర్మవీరుడు. ఈశ్వరేచ్ఛపై ఆయనకెంత దృఢ విశ్వాసమో, తన లక్ష్యసిద్ధిపై అంతగట్టి నమ్మకం.

వీరులకు చావంటే భయముండదు. అలాగే దయానందుకు కూడా మృత్యు వంటే జంకులేదు. జోధ్‌పూర్ రాజ్యంలోని దయనీయమైన స్థితిని బాగుపరచగలనని ఆయనకు చాలా నమ్మకం. విరోధులకు భయపడే సంఘ సంస్కర్త తన లక్ష్యం సాధించలేడని ఆయనకు తెలుసు. జోధ్‌పూర్ వెళ్లవలదని శాహపూర్, అజ్‌మీర్‌లలోని శిష్యులు, భక్తులూ, ఆయనను ఆపినపుడు జోధ్‌పూర్‌లోని ప్రజలు ఎంత శత్రువులయినా సరే తను అక్కడికి వెళ్ళడానికే నిర్ణయించానని చెప్పారు. రాగల విపత్తుకు సూచనగా జోధ్‌పూర్ వెళ్ళే దారిలో ఆయన ప్రయాణానికి ఎంతో అసౌకర్యం కలిగింది. మార్గ మధ్యంలో జోరుగా వాన, తుపాను వచ్చింది. ఆయన బృందం ఒక జాగీర్‌దార్ ఇంట్లో ఆ రాత్రి గడపవలసి వచ్చింది. అయినా, సరే మే 31వ తేదీకి దయానంద జోధ్‌పూర్ చేరనే చేరారు. 1883, అక్టోబర్ 16వ తేదీ వరకూ అక్కడే వున్నారు. దయానంద్ జోధ్‌పూర్ జేరిన సాయంత్రమే ఉపన్యాసం యిచ్చారు. ఆ ఉపనాస్యం వినడానికి వివిధ వృత్తులకు చెందినవారూ, రకరకాల సంప్రదాయాలకు చెందిన వారూ చాలా మంది గుమిగూడారు. మహారాణా అనారోగ్యంగా వుండటం వలన స్వామి విచ్చేసిన 18వ రోజుకిగాను దర్శనం చేసుకొనలేక పోయారు. ఆయన వుపన్యాసాలు విని ఎంతో లబ్ధిపొందాలని అనుకుంటున్నట్లు మహారాణా వినమ్రంగా మనవి చేశారు.

ప్రథమ సందర్శనంలోనే, దయానంద మహారాజాలో దాగివున్న మంచితనం ఆయనకు చూపించి, ఆయనలో కర్తవ్యాన్ని తెలుసుకొనే శక్తినిపెంపొందింప చేసే

యత్నంగా, మధ్య యుగాల రాజపుత్ర పాలకుల జీవితాలలోని ఘట్టాలను ఉదహరించారు. మహభారతమును, స్మృతులలోని సందర్భాలను వివరించి మహారాణాను ప్రేరేపించారు. ఇంకా ఆయన మహారాణాకి ప్రాచీన నీతిశాస్త్ర విషయాలను రాజనీతి నియమాలను నచ్చ చెప్పారు. దయానందుని పాండిత్యం, ఉపదేశాలు మహారాణాపై చెరగని ముద్రవేసాయి.

ఉపన్యసాల ద్వారా ప్రవచనాల ద్వారా, ప్రజలను ఉన్నతులుగా మార్చమని దయానందని మహరాణా కోరారు. ప్రతి రోజూ సాయంకాలం నాలుగు గంటల నుండి ఆరు గంటల వరకు భక్త బృందానికి దయానంద ప్రవచనాలు చెప్పేవారు. అందులో అనేక విషయాలుండేవి. ముఖ్యంగా రాజపుత్రులకు కావలసిన సత్శీలం, సత్ప్రవర్తన గురించి వక్కాణించేవారు. ఆయన తన ప్రసంగాలలో విగ్రహారాధనపై, హిందూ సమాజంలోని సహించరాని పద్ధతులపై దండెత్తే వారు. కఠోర సత్యాలను వున్నవి వున్నట్లుగా, కటువైన మాటలలో చెప్పటానికి దయానంద అలవాటు పడటం వలన మహారాజుని విమర్శించటం మానమని మహారాజు సోదరులంతా ఆయనని కోరవలసి వచ్చేది. కాని దయానంద వారి అభ్యర్థనలను లక్ష్యపెట్టలేదు. పేరుపెట్టి చెప్పకపోయినా, వ్యభిచారం, మద్యపానం వంటి దుర్వ్యసనాలకు లోనయిన రాజపుత్ర రాజులను మహారాజులను దయానంద చివాట్లు పెట్టారు. మహారాజుల దురభ్యాసాల గురించి దయానంద మాట్లాడుతున్నపుడు ఎవరిని దృష్టిలో వుచుకొని మందలించారో అందరికి అర్థమయ్యేది. రాజపుత్రులు సింహం లాంటివారనీ, వేశ్యలు ఆడకుక్కల లాంటివారని, ఆ స్థానాలలోనికి వారిని రానీయడం రాజులకు మహారాజులకు శోభ చేకూర్చదని దయానంద విసుగు చెందకుండా చెపుతూండేవారు.

దయానందుని కంట పడకుండా నహీజాను దర్బారు నుండి పంపించివేస్తూ, మహారాణా కూడా పల్లకీ భుజం పట్టాడని, అది చూసిన దయానంద మహారాణాను కేకలు వేశారని కథ ప్రచారంలో వున్నది. కాని అది ఆధారం లేని కథ. నిజానికి దయానంద మహారాణా సోదరుడు రాజప్రతాప్ సింహకు పెద్ద ఉత్తరం ఒకటి రాస్తూ, మహరాణా దుర్వ్యసనాలకు లోనయి ఆరోగ్యం పాడుచేసుకొంటున్నారని మందలించారు. మంచి పనులు చేయడానికి మహారాణా తమ శరీర బలాన్ని కాపాడుకొనాలని ప్రజల సౌభాగ్యాన్ని కోరి మంచి పరిపాలన కుదాహరణగా, ఇతర రాజులకు ఆదర్శప్రాయులు గావాలని దయానంద ఆశించారు.

ఉదయపూర్ మహారాణా నిత్యం స్వామిజీ వద్దనే వుండేవారు. కాని జోధ్‌పూర్

రాజు దయానంద వద్దకు చాలా తక్కువసార్లు వచ్చారు. కారణం స్పష్టంగా కనబడుతోంది. స్వామివారి బోధల ప్రకారం తన జీవితాన్ని మార్చుకొనడం రాణాకి చాల కష్టం. అతిథి మర్యాదలను పాటించాలి కనుక, నమ్రతతో మెలగాలి కనుక దయానందని రాజ్యం వదలి వెళ్లమని రాణా కోరలేకపోయారు. పైగా రాణాయే దయానందని ఆహ్వానించారు. కదా, ఏ ముఖం పెట్టుకొని తిరిగి వెళ్లిపొమ్మని చెప్పగలరు? మరోవైపు దయానంద స్వామి, రాణాని దుర్వ్యసనాల బారి నుండి తప్పించాలని దృఢనిశ్చయంతో వున్నారు.

అందుకే ఆయన రాణాలోని సద్బుద్ధిని మేలుకొలిపే ప్రయత్నం చేస్తూ, ప్రజల ఎడల రాజు కర్తవ్యాన్ని గుర్తుచేస్తూ, ఎన్నో ఉత్తరాలు రాణాకే వ్రాశారు. దయానంద తీపితీపి మాటలు చెప్పే మనిషి కాదు. పైగా సూటిగా తప్ప మాట్లాడలేరు. ఆయన రాణాకి వేరుగా వ్రాసిన ఉత్తరంలో వ్రాయవలసిన విషయాలే వ్రాశారు. అలా విషయాలను ఆ ఉత్తరంలో చర్చించడం వలన దయానంద మహారాణానే కాదు ప్రజలందరినీ గాయపరచి వుండవచ్చు. (దయానంద సరస్వతీ ఋషి లేఖలు, ప్రకటనలు, సంపాదకుడు భగవద్దత్, పుట: 463) రాజులను, మహారాజులను సంస్కరించాలని దయానంద ఎంతగా శ్రమించారో, ఈ కార్యక్రమానికి ఎంత ప్రాముఖ్యమిచ్చారో తెలుసుకొనడానికి ఆ ఉత్తరంలోని కొన్ని విషయాలు ఇక్కడ ఉదహరించాలి.

"... నా వల్ల మీకేమి ప్రయోజనం లేకపోగా, నేను ఇక్కడకు వచ్చి మీ ధనం వ్యర్థం చేశా ననిపిస్తున్నది... మీ మటుకు మీరు నాకు ఎంతో సేవ చేస్తున్నారు..."

"... ఉదార స్వభావం లాంటి మంచి గుణాలు మీలో ఉన్నాయి. శ్రీవారికి సహజంగా వచ్చిన సుగుణాలకు మచ్చ తెచ్చేవాటిని ఉదహరిస్తున్నాను."

"... నన్హీ అనే వేశ్యను ప్రేమించటం, ఆమెతో సన్నిహితంగా మసలటం, ఇంకా చాలామంది భార్యలను కలిగివుండటం, మీలాటి మహారాజులకు యోగ్యత లనిపించుకోవు... వేశ్య, మద్యపానం, మూడు గవ్వలాట, గాలిపటాలాట వీటితో కాలం వృథా చేయడం, వినోద పరచే స్నేహితులతో సాంగత్యం, - ఇవన్నీ మహారాజులకు శుభం కలిగించని పనులు. వీటివల్ల ధనం కీర్తి, అయుష్షు రాజ్యం అన్నీ క్షీణిస్తాయి. మీరు శౌర్యాది గుణోపేతులై బుద్ధిమంతులై కూడా ఈ దుర్గుణాలనుండి ఎందుకు బయటపడలేకపోతున్నారో నాకు ఆశ్చర్యంగా వుంది."

"... నన్హీ వేశ్య యింటికి వెళ్తుతున్నారు. ఆమె తల్లినీ, ఇతర రోగులనీ దర్శిస్తున్నారు. ముస్లిం నౌకరు కొడుకు వివాహంలో గుర్రం కళ్ళెం పట్టుకొని కాలి

నడకన సాగిపోవడం వంటి పనులు మీకు తగినవి కావు, పైగా నిందలు తెచ్చిపెట్టే పనులు. అంతకంటె ఆరోగ్యం బాగా లేని మీ కులపెద్ద-విజయసింహని పలకరించి రావలసినది. మీ రాజ్యం వున్నతి కోరే మార్వాడీ పెద్దలు, సోదరులున్నారు. వారి పుత్రుల వివాహాలలో నడిచి వెళుతూ వుండండి. అలాటి పనులు మీకు కీర్తిని లాభాన్ని ఉన్నతిని కలిగిస్తాయి."

"మీ గురించి చెడ్డ మాటలు విన్నప్పుడూ, మిమ్మల్ని నిందించే వార్తలు చూసినపుడు నాకెంతో విచారం కలుగుతుంది. మీరు అటువంటి పనులు చేయనపుడు ఎవరూ నిందించలేరు కదా ! మనం ఆంగ్లేయుల ఎదుట ఎందుకు సిగ్గుపడాలి ? శ్రీవారి తండ్రి గారైన పెద్ద మహారాజు బహుభార్యను రక్తుడు కాకపోతే, వేశ్యా లోలుడు కాకపోతే - శ్రీవారు కూడా ఇటువంటి పనులు చేసేవారు కాదు. అలాగే మీ ప్రవర్తన మహారాజ కుమారులు చూస్తే, వీటికే మొగ్గు చూపుతారు. సాటివారిలోని మంచి గుణాల ననుసరించడం మానవులకు కష్టం. దోషాలు గ్రహించటం తేలిక ... "

ఉత్తరంలోని పై అంశాలను బట్టి దయానంద రాజపుత్ర రాజుల శ్రేయస్సు ఎంతగా కోరేవారో విశదమవుతుంది. కాని జోధ్‌పూర్ రాజు బాగుపడటం ఇక సాధ్యం కాదు. సంయమనం లేని అంతటి దశకి ఆయన చేరుకొన్నాడు. ఆయన మేలు కోరి చెప్పిన సలహాలు ఎంత మంచివి అయినా ఆయనకి రుచించేవి కావు. అశ్రద్ధవలన అజ్ఞానం వలన బంజరు భూమిగా మారిన మార్వాడు దేశంలో జ్ఞాన బీజాలు నాటడం వృధాయని దయానందుని హితైషులు చెప్పనే చెప్పారు.

సామంత రాజుల నైతిక పురోగతి చూదామని దయానంద కన్న కలల కోసం చూపిన రుజు మార్గమంతా ఆత్మ విఘాతానికి దారి తీసింది. దర్బారు వారిని, రాజుకి విశ్వాస పాత్రులయిన వారిని, అనుయాయులని నిందించి జోధ్‌పూర్‌లో దయానంద ఎంతో మందితో శతృత్వం తెచ్చుకొన్నారు. రాజు ప్రియ నర్తకి - నన్హీజాకి విరుద్ధంగా దయానంద చెప్పిన మాటల వల్ల రాజాస్థానంలో తన స్థితి ఏమగునో అని ఆమె ఆందోళన చెందింది.

రాజు ఆస్థానంలోని ఫైజుల్లాఖాన్ సోదరుని కొడుకు ఒక రోజున స్వామిజీ ఉపన్యాసం మధ్యలో వచ్చి కత్తి దూసి తమ మతానికి విరుద్ధంగా మాట్లాడటం మంచిది కాదని హెచ్చరించాడు.

మరొక మహాసభలో చక్రాంకిత సంప్రదాయాన్ని తీవ్రంగా విమర్శించడంతో వారుకూడా ఆయనకి విరోధులయ్యారు. ఆయన విగ్రహారాధన కూడదని చెప్పటం

వలన, సాంఘిక దురాచారాలపై, మతంలోని మూఢనమ్మకాలపై, ధ్వజమెత్తడం వలన బ్రాహ్మణులకు, మూఢ విశ్వాసాలను నమ్మినవారికి శత్రువయ్యారు.

అలా జోధ్‌పూర్‌లో ఆయన చాలా మందికి విరోధి. మహారాజు మాట సరేసరి. రాజులోని దోషాలను ఆయన ఎత్తి చూపటం వలన రాజు ఉపేక్షించి నాలుగు నెలలలో కేవలం మూడు సార్లు మాత్రమే దయానందని దర్శించడానికి వచ్చారు. దయానంద కూడా లెక్కపెట్టి మూడు సార్లు మాత్రమే రాజుని చూడటానికి దర్బారుకి వెళ్లారు. అయినా సాంఘిక ధార్మిక సమస్యలను దయానంద చూసే కోణం మహారాజుపై మంచి ముద్రవేసింది. ఆయనకు దయానంద గుణసంపత్తి పాండిత్యం ఎడల ఎంతో గౌరవం. కాని ఆయన మద్యపానం మాననూలేరు, నన్నీజాను వదలుకోననూ లేరు.

జోధ్‌పూర్‌లో జరిగిన మనోరంజకమైన సంఘటనలను ఉదహరిస్తే దయానంద సమయ స్ఫూర్తినీ, ఆయన సద్గుణాలనూ తెలుసుకొనవచ్చు.

స్వామీజీ ఒకరోజు మంచం మీద పడుకొని విశ్రాంతి తీసుకొంటున్నారు. ఆ భవంతిలోనే కొన్ని గజాల దూరంలో విడిది చేసిన మరో పండితుని కోసం, మహారాణి మంచి పళ్లను ఎంచి, దాసీలకిచ్చి పంపింది. స్వామీజీనే ఆ పండితుడనుకొని దాసీజనం స్వామీజీ వద్దకు వచ్చారు. ఆయనకు కోపం వచ్చి గట్టిగా అరిచారు. ఆయన విశ్రాంతికి భంగం జరుగకుండా చూడవలసిన అంగరక్షకుడు పాపం మధ్యాహ్న నిద్రలో వున్నాడేమో, అరుపుకి ఒక్కసారి లేచి స్వామీజీపై ఎవరైనా దండెత్తి వచ్చారేమోనని పరిగెత్తుకుంటూ వచ్చాడు. స్త్రీలను లోనికి రానిచ్చినందుకు స్వామీజీ భటుడిని బాగా మందలించారు. తరువాత అతన్ని అక్కడ నుంచి మార్చివేశారు.

ఆయన 69 సంవత్సరాల వయసులో శారీరకంగా ఎంత బలవంతులో మరో సంఘటన వలన తెలుస్తుంది. ఒక పహిల్వాన్ వుండేవాడు. అతనికి తనకండబలం చూసుకొని గర్వం, నీళ్లతో జలాశయాన్ని నింపడానికి ఒక్కడూ పెద్ద చక్రం త్రిప్పి నీళ్లు తోడుతూ వుండేవాడు. అలా చేయడం మరొకరికి సాధ్యంకాదని ఆ పేటలోని ప్రజల నమ్మకం. ఒక రోజు ఉదయమే స్వామీజీ అలా వెళుతూ పహిల్వాన్ చక్రం తిప్పటం చూశారు. మరునాడు ఆయనే చక్రం తిప్పి జలాశయాన్ని నీటితో నింపి వెళ్ళిపోయారు. పహిల్వాన్ వచ్చి చూసుకొనే సరికి జలాశయం నీటితో నిండివుంది. చాలా ఆశ్చర్యపడ్డాడు. ఎవరు నింపి వుంటారా అని అందరనీ వాకబు చేశాడు. ఎవరో సాధువు వచ్చి నీళ్ళు తోడి తన దారిని తానువెళ్ళిపోయాడని చెప్పారు.

పహిల్వాన్, స్వామీజీ మళ్ళీ ఎప్పుడు తిరిగి వెళ్తారో నిరీక్షిస్తూ కూర్చుని ఆయన

వచ్చాక అడిగాడు. తనే నీళ్లు నింపానని దయానంద చెప్పడంతో, నీళ్లు తోడిన తర్వాత స్వామీజీ అలసిపోయారా లేదా అని పహిల్వాన్ అడిగాడు. స్వామీజీ 'వ్యాయామం చాలక ఇంకా నడవటానికి వెళ్లానని" చెప్పారు.

69 సంవత్సరాల వయసులో కూడా దయానందుని శరీరం ఎక్కడా సడలకుండా దారుఢ్యంగా వుండి అసమానమైన శక్తితో వుండేది. మహారాజు తమ్ముడు రావు రాజాతేజ్ సింహ భక్తి శ్రద్ధలతో దయానంద కాళ్ళు ఒత్తుతూ వుండేవారు. ఆయన కూడా ఈ మాటే చెప్పారు.

దయానందుడంటే ఎంతో భక్తి గలవారు కొందరు జోధ్‌పూర్‌లో వున్నారు. ఒక పెద్ద జాగీర్దార్ కొడుకు శేర్ సింహకుమార్, మహారాజా తమ్ముళిద్దరు - రాజా తేజ్‌సింహ, రాజాప్రతాప్ సింహ - వీరిలో ప్రముఖలు కేవలం మద్యపానం వలన, స్త్రీలోలుడు కావటంవలన, మహారాజు మాత్రం దయానందునికి దగ్గిర కాలేకపోయాడు. ఇలాంటి వాతావరణం మధ్య జోధ్‌పూర్‌లో ప్రజలకోసం, స్వామీజీ, స్వస్తి వాచకం, పలక లేకపోయారు.

అక్కడికి రావటంలో దయానంద తమ ఉద్దేశ్యం విఫలమయినదనే వాదన అంగీకరిచక జోధ్‌పూర్ నుంచి అజ్‌మీర్ తాలూకాలోని మసూదా అనే గ్రామానికి 1883 అక్టోబర్ 1వ తేదీన బయలుదేరడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకొన్నారు. కాని సెప్టెంబర్ 27వ తేదీన ఆయనకి తీవ్రంగా జ్వరం వచ్చి, మరునాడు కూడా తగ్గలేదు. 29వ తేదీ రాత్రి కూడా నిద్రపోయే ముందు మామూలుగానే పాలు తాగారు. శాహపుర్ నుంచి ఆయనతో కూడా వుంటున్న వంటవాడు ధౌల్‌మిశ్ర ఆ పాలు తెచ్చి ఇచ్చాడు. కాని కడుపు నొప్పి వల్ల ఆయనకి రాత్రి నిద్రపట్టలేదు. రాత్రి మూడుసార్లు, ప్రొద్దుటే ఒకసారి, ఆయన కడుపులో బాగులేక ఇబ్బంది పడ్డారు.

విషమిచ్చారన్న అనుమానంతో విషాన్ని బయటకు కక్కాలని దయానంద మమనం చేసుకొన్నారని అంటారు. ఇదివరకే విరోధులు విషమిచ్చిన సందర్భాలలో దయానంద బాగా నీళ్ళుత్రాగి కొన్ని యోగ ప్రక్రియలను అనుసరించి విషాన్ని బయటకు కక్కేవారు. అలాగే ఈసారి కూడా చేసినా లాభం లేకపోయింది. డాక్టర్ సూరజ్‌మల్‌ని పిలిపించారు.

ఆయన వచ్చేలోగా దయానంద దేశీయమైన మందు... కషాయంగా తీసుకొన్నారు. దానితో కడుపు నొప్పి తగ్గడానికి బదులు బాగా ఎక్కువయి విరేచనాలు అయ్యాయి. సూరజ్‌మల్ వైద్యం వలన కూడా ప్రయోజనం లేకపోయింది. అప్పుడు

అలీ మర్దాన్‌ఖాన్ అనే సబ్ అసిస్టెంట్ సర్జన్ ఆయనకి వైద్యం చేయసాగారు. అయోగ్యుడైన ఆ వైద్యుని వలన జ్వరం తగ్గే లక్షణాలు కనబడలేదు సరికదా విషమించ సాగింది.

ఆయన జ్వరం సంగతి అజ్మీర్‌లో తెలిసి, అక్కడి ఆర్యసమాజం వారు లాలా జేఠ్‌మల్‌ని జోధ్‌పూర్ పంపారు.

కొద్ది రోజులకే దయానంద పరిస్థితి బాగా దెబ్బతిన్నది. దొరతనం వారి ఇంగ్లీషు వైద్యుడిని పిలిపించారు. దయానందను ఆబూ పర్వతానికి తీసుకు వెళ్ళమని సలహా యిచ్చారు. అక్టోబర్ 16వ తేదీన మహారాజు, సర్ ప్రతాప్‌సింహ - ఇద్దరూ ఆయనని చూడటానికి వచ్చారు. ఆయన పరిస్థితి చూసి ఎంతోవిచారించారు. ఆరోజే ఆయనని ఆబూ పంపటానికి ఏర్పాట్లు చేశారు. మహారాజు స్వామీజీకి 2,500 రూపాయలు నగదు, రెండు శాలువలు, బహుకరించి డాక్టర్ సూరజ్‌మల్‌నూ, కపినవల్‌దాస్‌నూ ఆయన కూడా పంపారు. దయానందుని ఒక పల్లకిలో పడుకో బెట్టారు. కొన్ని గజాలు మహారాజు, పల్లకీని మోసి ఆయన యెడల తన గౌరవం సూచించారు. బంగళా సింహ ద్వారం దాకా నడిచి, కూడా వచ్చారు. మహారాజు వీడ్కోలు చెపుతూ స్వస్థత చేకూరిన తర్వాత మరొకసారి జోధ్‌పూర్ దయచేయవలసినదిగా దయానందుని కోరారు.

1883వ సంవత్సరం అక్టోబర్ 21వ తేదీ ఉదయానికి దయానంద ఆబూరోడ్ చేరారు. అలీగఢ్ నుంచి వచ్చిన ఠాకూర్ భూపాల్ సింహ ఆయన కూడా వున్నారు. ఠాకూర్, స్వామీజీ సంరక్షణ బాధ్యత తీసుకొని చివరి వరకూ రోగ శయ్యే వద్ద వున్నారు.

స్వామీజీకి సేవ చేయడానికి మీరట్ నుండి లక్షణ్ స్వరూప్, ఫర్రూఖాబాద్ నుంచి లాలాశివ దయాళ్, బొంబాయి నుంచి శ్రీకృష్ణదాస్‌లు కూడా ఆబూ పర్వతం వచ్చారు. కల్నల్ సర్ ప్రతాప్ సింహ కూడా ఆయనను చూడటానికి ఆబూ వచ్చారు. అక్కడ దయానందకి డాక్టర్ లక్ష్మణదాస్ వైద్యం చేస్తూండేవారు. ఆయన వైద్యం వల్ల కొంత నయమయింది. కాని దురదృష్టవశాత్తూ ఆయనకి అజ్మేర్ బదిలీ అయింది.

1883 అక్టోబర్ 26వ తేదీన దయానందను భక్తులతో సహితం అజ్మేర్ తీసుకు వెళ్లారు. డాక్టర్ లక్ష్మణదాస్, మళ్లీ వైద్యం మొదలు పెట్టారు. కాని స్వామిజీ ఆరోగ్యం పాడయిపోసాగింది. కడుపునొప్పి తీవ్రం కాసాగింది. అశాంతి పెరిగింది. శరీరమంతా చిన్న చిన్న కంతులు లేచాయి. మహారణా సజ్జన్ సింహ దయానందుని ఆరోగ్యం మెరుగుపడాలని ఎంతగానో ఆశించారు. ఆయన దయానంద పరిస్థితి ఎలాగున్నదో తెలుసుకొనడానికి మోహన్‌లాల్ విష్ణు పాండ్యను పంపారు. డాక్టర్ లక్ష్మణదాస్

దయానందుని రక్షించగలమనే ఆశ వదులుకొని, సివిల్ సర్జన్, డాక్టర్ న్యూమన్‌ని రప్పించారు. డాక్టర్ న్యూమన్, లక్ష్మణదాస్ చేస్తున్న వైద్యం సరిగా వుందంటూనే మరికొన్ని మందులు చెప్పారు. వాటిలో ఒక మందువల్ల దయానందుని స్థితి మరీ వికటించింది. ఆయన భక్తులలో నిరాశ కమ్ముకున్నది. దయానందకు కూడా తన ఆఖరి క్షణాలు దగ్గరపడి నాయని తెలిపోయింది. ఆయనను మీ రెక్కడున్నారని ప్రశ్నిస్తే జవాబుగా "ఈశ్వరుని శరణ"లో వున్నానన్నారు. తన శిష్యులకు ఆయన శుభాశీస్సులు అందించారు. ఆత్మానంద, భీమసేన్ అనే ఇద్దరు శిష్యులకు, ఒక్కొక్కరికి వంద రూపాయలు, ఒకశాలువా ఇమ్మని ఆయన ఆదేశించారు. వారిరువురి కనులు అశ్రు పూరితాలయినాయి. కాని, ఆయన ముఖం మాత్రం శాంతంగా, గంభీరంగా వున్నది. సాయంకాలం అయిదు గంటలు దాటిన తర్వాత ఆయన తన అనుచరులను ఇతరులను తన వెనుక నిలబడమని చెప్పి, తలుపులు, కిటికీలు పూర్తిగా తెరవమని చెప్పారు. తరువాత ఆయన ఆరోజు ఏమాసమో, ఏ పక్షమో ఏ తేదీ, ఏ వారమో అడిగారు. కార్తీక మాసమని, అమావాస్యని, మంగళవారమని చెప్పగానే ఆయన ఆకాశం వైపు చూసి వేద మంత్రాలను పఠిస్తూ సంస్కృతంలో ఈశ్వరుని ప్రార్థింపసాగారు. ఆ తరువాత గాయత్రి జపించి ఒక్క క్షణం కనులు మూసుకున్నారు. ఆయన పలికిన ఆఖరి మాటలు

"ఓ దయామయా ! సర్వశక్తిమంతుడైన ఈశ్వరా !

ఇదే నీ యిచ్ఛ. నీ యిష్టం. నీ అభీష్టం పూర్తి అయినది. నేను మంచి పనులే చేశాను." ఈ మాటలు చెప్పి ఆయన కొంచెం ప్రక్కకు ఒరిగారు. దీర్ఘంగా శ్వాస పీల్చి వదిలారు. ఆయన ఆత్మ ఈ పార్థివ శరీరాన్ని విడిచి వెళ్ళిపోయింది. సాయంత్రం ఆరుగంటల సమయం. అప్పుడే దివంగతుడయిన మహాత్మునికి హారతి యిస్తున్నట్లు ఉత్తరదేశమంతా దీపావళికి దీపాలు వెలిగించే సన్నాహంలో ఉన్నది. కాని ఈ జగతిని మరికొంత కాలం దీప్తిమంతం చేయగల జ్యోతి మాత్రం విధాత క్రూర హస్తాలలో ఆరిపోయింది.

# 8

# ఆశలు - కలలు

నాయకులకు ఎన్నో ఆలోచనలుండాలి. ఉత్తమ ఆదర్శాలు కలిగి యదార్థ వాదియై మాతృభూమిని కొత్తగా నడిపించే ఉత్సాహం గల వ్యవస్థాపకునికి, గత కాల వైభవాన్ని తలపింప చేసే ధార్మిక జాగరణ తేగల నాయకునికి, నిందలనీ ప్రతిఘటనలనీ లెక్క చేయక హిందూ సమాజానికి నవ యవ్వనమిచ్చే లక్ష్యం గల నాయకుని ఆశయ సాధనకి ఎంతో ఆలోచనల సంపద వుండాలి. పిన్న వయస్సులోనే దయానంద అంధ విశ్వాసాలపై ధ్వజమెత్తారు. పెద్ద వాడవుతున్నకొద్దీ దేశంలో విస్తృతంగా పర్యటించారు. దేశంలో వ్యాపించిన అజ్ఞానం, అశ్రద్ధ, దారిద్ర్యం - అన్నీ ఆయనకు కళ్ళకు కట్టినట్లు కనబడినాయి. మన యువకులు పశ్చిమ దేశాల జీవన విధానాలని అనుసరించాలని, ఐరోపావారి ఆశయాల వలన ప్రేరణ పొందాలని వువ్విళ్ళూరటం చూసి ఆయన ఎంతో బాధపడ్డారు. క్రైస్తవ మతంలోకి మారే అస్పృస్యుల సంఖ్య, ఆదివాసుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతున్నది. హిందువుల సంఖ్య తరిగి పోతున్నది. హిందూ సమాజం మూగగా నిస్సహాయంగా చూస్తూ వుండి పోయింది. దయానందుని స్థితి చిత్రంగా తయారయింది. ఇంత పెద్దపని తను ఒక్కడూ ఎలా పూర్తి చేయగలడు? శతాబ్దాల రాజకీయ దాస్యం, నిర్లక్ష్యం, నిరంతరం క్షీణిస్తున్న సంస్కృతి, పెరుగుతున్న సాంఘిక దురాచారాలు-ఇవన్నీ కుప్పకూలిపోతున్న భారతీయ సంస్కృతీ సదనంలోని చీకటి మూలల్లో బుద్ధిమయవికాస కిరణాలను చొరనీయకుండా విశాల విశ్వం వైపుండే అన్ని కిటికీలను అన్ని వైపులా మూసి వుంచాయి.

అప్పుడే దయానంద రంగం మీదకు వచ్చినా ఆయన ఈ నవీన విద్యా గంధం పూసుకున్న వారు కారు. పాశ్చాత్య నాగరికత ముద్రలు ఆయన మీద పడలేదు. ఆయన ప్రాచీన ఋషుల కోవకి, మధ్యయుగాల సాధువుల పరంపరకి చెందినవారు. అనేక సాంఘిక ధార్మిక సమస్యలపై ఆయన చూపిన ప్రతిక్రియ తీవ్రమైనా సహజమైనది.

ఆ కాలంలో ఆయన మాటలు వినటానికీ, ఆయన అభిప్రాయాల ప్రకారం నడవటానికీ ఎవ్వరూ సిద్ధంగా లేరు. పాశ్చాత్య సభ్యతా వ్యామోహంలో పడిన మేధావులను ఆయన సులభంగా తనవైపు త్రిప్పుకొనలేకపోయారు. హిందూ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలంటే నిరాడంబరత, నిగ్రహం అవసరమని ఆయన అనుకునేవారు. ఆయన ఇంగ్లీషు భాష నేర్చుకోలేదు. అందుచేత ఆయన సందేశం కొద్ది మేరకే వ్యాపించినది. కేశవ చంద్రసేన్ సలహాపై హిందీ నేర్చుకొన్న తర్వాత ఆయన భావాలకు బాగా వ్యాప్తి కలిగింది. హిందూ మతానికి దూరమవుతూ ఇంగ్లీషు నేర్చిన సమాజం మాత్రం ఆయనని శ్లాఘించేదికాదు. ఆయన సందేశాలలోని గొప్పతనాన్ని వారు తెలుసుకొనడానికి ఇష్టపడేవారు కారు. అందుచేత ప్రోత్సాహం కోసం, నైతికంగా ఆర్థికంగా సహాయం పొందడం కోసం రాజులనూ ధనవంతులనూ, ఆయన ఆశ్రయించవలసి వచ్చేది. ఆయనలోనే అంతులేని ధనాగారమంత శక్తి, సాహసం వున్నాయి. ఆయనది జంకులేని గుండె, చైతన్యవంతమైన మేధ. అందుకే ఎటువంటి పరిస్థితినైనా ఆయన ఎదుర్కొనగలిగేవారు. శారీరక ఆరోగ్యం, బ్రహ్మచర్యం సదా ఆయనకి రక్షకులు. అనేక విధాలుగా ఆయనపై కత్తి గట్టిన శత్రువుల కుతంత్రాలని ఆయన తన నైతిక బలంతో శారీరక బలంతో మట్టుబెట్టారు. ఎన్నోసార్లు విషమిచ్చి ఆయనని హత్య చేయడానికి యత్నాలు జరిగాయి. కాని సఫలం కాలేదు, పైగా విరోధులని ఎదుర్కొనే ఆయన శక్తి పెరిగేది.

అలా స్వామి దయానంద ఆనాటి సమాజంలోని దురాచారాన్ని రూపుమాపడానికి, సమాజాన్ని నైతికంగా పైకి తెచ్చే ప్రయత్నంలో, హిందూ సమాజాన్ని ముట్టడించారు. ప్రతికూల శక్తులతో జీవితాంతం తలపడ్డారు. ఉపన్యాసాలలో, వాగ్వివాదాలలో, వ్యక్తిగతమైన సంభాషణలలో, గ్రంథాలలో ఆయన తన ఆలోచనల్ని ప్రజలముందు పెట్టి నైతిక సంప్రదాయ ఆదర్శాలతో నవ యుగారంభానికి దారి చూపారు., ఆయన తన జీవత కాలంలోనే వందలాది మందిని తయారు చేసి వారి ద్వారా ఉత్తర భారతదేశంలోని మూల మూలలకీ తమ సందేశాన్ని ప్రచారం చేశారు. భారతీయుల మనసులను కలత బెట్టిన అన్ని సమస్యలను ఆయన తన ప్రత్యేక పద్ధతిలో పరిష్కరించేవారు. అందుకే ఆయన భావాలనూ, ఆదర్శాలనూ సమీక్షించే యత్నం చేద్దాం. వాటిని మూడు భాగాలుగా చూడవచ్చు...ధర్మం-తత్వమీమాంస, సమాజం-నైతిక సూత్రాలు, రాజకీయ - ఆర్థిక వ్యవస్థ.

స్వామి దయానందకు ప్రేరణ నిచ్చేది వేదాలే? అందువలననే ఆయన ధార్మిక

వేదాంత వివేచనకు వేదములే పునాదులుగా భావించారు. విశుద్ధ జ్ఞానానికి వేదములే ముఖ్య తీర్థములని ఆయన, ఆయన గురువు స్వామి విరజానంద-ఇరువురూ భావించారు. నాటి గౌతమ, కపిల, కణాద, వ్యాస, పాని పతంజలుల వంటి అనేక ఋషులు వేదములు అనాదిగా వున్నాయని ఈశ్వర జన్యములని నమ్మారు. ఋషులంటే దయానందకు అమిత గౌరవం. అందుకే వారి అడుగు జాడలలో నడుస్తూ వేదములను ఈశ్వరసృష్టిగా నమ్మి గౌరవించారు. వేదములను విస్మరించిన హిందువులకూ దురదృష్టవశాన, వేదోత్తర ధర్మ శాస్త్రముల ననుసరించే వారికీ, వేదము లమోఘములనీ, అవి ఈశ్వర వాణియనీ ఎవ్వరూ చెప్పలేరు.

ఎవరూ ఒక గ్రంథం తమకు ప్రేరణ నిచ్చినదనీ, తృప్తి నిచ్చినదని చెప్పలేరు. అందుకే అగ్ని, వాయువు, ఆదిత్యుడు, అంగీరసుడు- ఈ నలుగురు ప్రాచీన ఋషుల హృదయములలోనే వేదములు ఉద్భవించాయని దయానంద గుర్తు చేశారు. వేదాలలోని విషయాల పట్ల గౌరవం పెంచి, వాటిలోని ఆదేశాలని పాటించి స్వామి దయానంద తమ బుద్ధి కుశలతను ప్రదర్శించారు. వేదములు ఈశ్వరోక్తములని ప్రకటిస్తూ వాటి గురించి ఈ అభిప్రాయాలను వెల్లడించారు.

సర్వతంత్ర సిద్ధాంతాలంటే అందరూ ఆచరించినవీ, ఆచరించేవీ ఆచరించప బడుతూండేవి. వాటినెవరూ ప్రతిఘటించరు. అవి నిత్యధర్మాలు. అవి సార్వజనీన సామ్రాజ్య ధర్మాలు. ఆప్తులు అంటే సత్య నిరతులు, సత్యవాదులు, పరోపకారములు పక్షపాతం లేని విద్వాంసులు, ఏ ధర్మాలను స్వీకరిస్తారో అవే అందరికీ శిరోధార్యం. వేటిని స్వీకరింపరో అవే శిరోధార్యం కావు. వేదాది సత్య శాస్త్రములు బ్రహ్మ మొదలు జైమినీ మునుల పర్యంతం అంగీకరించిన ఈశ్వరాది పదార్థములను, నేనూ స్వీకరించి సజ్జన మహాశయుల ముందు ప్రకటిస్తున్నాను.

హిందూ సమాజం చెదిరిపోయిన చాలా కాలం తర్వాత ఆవిర్భవించిన పురాణ భాగవతాది స్మృతులకు ధర్మశాస్త్ర సిద్ధాంతాలకు గుడ్డిగా అతుక్కుపోయిన వారందరినీ ఆయన ఒక్క తాటి మీదకు తెచ్చి బలమైన పురోగామి సమాజంగా తీర్చిదిద్దాలనుకొన్నారు. వైదిక ఆలోచనా స్రవంతిని ఈ లక్ష్యంతోనే ఆయన పరిశీలించారు. దానిలోని ఆలోచనా బిందువులను నూతనంగా ఆవిష్కరించారు. సాయన, మహీధర, శంకరుల వేద భాష్యాలతో, వ్యాఖ్యానాలతో ఆయనకు తృప్తి కలగలేదు. ఆధునిక విద్వాంసులనేకులు దయానందుని వేద వ్యాఖ్యానం అంగీకరించకపోయినా, అది ఎంతో మౌలికమైనది విలక్షణమైనది.

వేదాలు నిరంతరమైనవని నిరూపించడం కోసం ఆయన వేదాలకి కొత్త వ్యాఖ్యానాలను సిద్ధం చేసే బాధ్యత పెట్టుకొన్నారు. వేదాలను అన్ని వర్గాల ప్రజలు అత్మీయం చేసుకోవాలనుకున్నారు. ఇందుకోసమే ఆయన దివ్యజ్ఞాన సమాజం వారినీ, బ్రహ్మ సామాజికులనూ వదులుకోవలసి వచ్చింది. ఆయన తన గంభీర పాండిత్యంతో తపో స్వభావంతో మనసును చిలికే ప్రశ్నలకు సమాధానాలు వెతుకుతూ వుండేవారు. చావు, పుట్టుక, సృష్టికర్త-పురుషుడు, జీవితం, ప్రయోజనం, లక్ష్యం ఇలాటి ఎన్నో చిక్కు ప్రశ్నలు, నాగరికత మొదలయిన నాటి నుంచీ సుఖ దుఃఖాత్మకమైన ప్రపంచాన్ని త్యజించి తపోసంపన్నమైన త్యాగమయ జీవితాన్ని గడపమని ఎంతోమందిని ప్రేరేపించాయి. అలా ప్రాచీన రుషుల కోవలోనే దయానంద కూడా నడవసాగారు. కాని ఆయనకు మాత్రం తత్వ మీమాంసలలోని సూక్ష్మ విషయాలపట్ల అభిరుచితో బాటు, జీవిత సత్యాల నెదుర్కొంటూ తోటి దేశస్తులకు సేవ చేయాలనే దీక్ష వుండేది. ఆ విధంగా ఆయనకీ-రామకృష్ణ పరమహంస, అరవిందునికీ చాలా భేదముంది. వేదాంత మీమాంస సంబంధమయిన విషయ నిరూపణకు దయానంద ఏకేశ్వరోపాసనను బలపరిచారు. దీనికై వేదాలను, ఉపనిషత్తులను ముఖ్యంగా వైశేషిక దర్శన శాస్త్రాలను ఉపయోగించారు. వాటి ప్రకారం ఉన్నదేదో, ఉపయోగకరమైనదేదో, దివ్య గుణ సంపన్నమైనదేదో అదే దైవంగా భావించబడుతున్నది. సందర్భానుసారంగా గ్రహిస్తే వ్యుత్పత్తి రూపంలో వందలాది శబ్దాలు ఈశ్వరార్థాన్ని విపులీకరించేవే. ఈశ్వరుడు. జీవతత్వం రెండూ. చేతనా రూపాలేననీ, స్వభావంలో రెండూ పవిత్ర మైనవనీ, నశించనివనీ, ధార్మికమైనవనీ స్వామి దయానంద అంగీకరించేవారు. కాని పరమేశ్వర సృష్టిలోని వుత్పత్తి స్థితి ప్రళయాలన్నిటినీ నియమబద్ధం చేయటం, జీవులకు పుణ్య ఫలాలను పంచడం మొదలైనవి ధార్మిక కృత్యాలు. జీవుని సంతానోత్పత్తి పెంపకం, శిల్ప విద్యాదులు గరపడం మొదలైనవి లౌకిక కార్యాలు" జీవుడు, బ్రహ్మ ఒకటేనని లేదా జీవుడు ఈశ్వరుని గుర్తింపగల ప్రత్యేక స్వరూపమని దయానంద అంగీకరించేవారు కాదు. 1881లో పండిత లేఖ్‌రామ్ గారు ఒకసారి జీవుడు-బ్రహ్మ రెండు భిన్నమనే అభిప్రాయాన్ని వేద ప్రమాణంతో నిర్దుష్టం చేయమని దయానందను కోరగా ఆయుర్వేదంలోని నలభయ్యో అధ్యాయాన్ని దయానంద ఉదహరించారు. భారతీయ, విదేశ వైదిక పండితుల కున్నట్లుగానే దయానందునికి ఆత్మ ఉనికిలో పునర్జన్మలో పూర్తి విశ్వాసమున్నది. అందువలననే ఆయన కర్మానుష్ఠాన సిద్ధాంతాన్ని కూడా అంగీకరించాల్సి వచ్చింది. మనుష్యుడు తాను చేసిన కర్మ ననుసరించి ప్రస్తుత జన్మ

తరువాతి జన్మలలో ఆనందము గాని, దండన గాని పొందుతాడు. జీవాత్మ చాలా సూక్ష్మాతి సూక్ష్మమైనది గనుక జీవాత్మల సంఖ్య అనంతమైనదని, సూక్ష్మాతి సూక్ష్మమని ఆయన విశ్వాసము. ఆత్మ అధికారం గురించి వేదాలలో స్పష్టమైన ప్రతిపాదన వున్నది కనుకనే దయానంద శిరసావహించారు. యదార్థ వాద జ్ఞాన మీమాంసే స్వామి దయానందుని వేదాంత మీమాంసకు ఆధార ప్రవాహం. ప్రాచీన ఋషులు, శంకర పాదులు ప్రత్యక్ష జ్ఞానాని కివ్వవలసిన స్థానము ఇవ్వకపోవడంతో, దయానంద దానికి సరియైన స్థానమిచ్చారు. ఆయన దృష్టిలో ఏ వ్యక్తి అయినా సరే ప్రత్యక్ష జ్ఞానం ద్వారా సాధన చేసి జ్ఞాన ప్రాప్తిని పొందగలడు. శంకరాచార్యులు భౌతిక జగత్తు మాయ అనీ, ఇంద్రియ జ్ఞాన పరిధిలోనివన్నీ భ్రమలనీ నాటి తనకు తెలియకుండానే ప్రాచీన సాంస్కృతిక సంప్రదాయ గౌరవానికి భంగం కలుగ చేశారు. అందుచేత కణాది ఋషులు నిరూపించిన ఇంద్రియ జ్ఞాన సిద్ధాంతాన్ని బలపరిచారు.

దయానందుని దృష్టిలో ఈశ్వరుడే బ్రహ్మాండానికి నిమిత్త కారణం. అతని ఉపాదాన కారణం ప్రకృతి. ఈశ్వరుడు, జీవుడు, ప్రకృతి- ఈ మూడూ అనాది నుంచీ వున్నవి. శాశ్వతమైనవి. ఈ భావానికి ఋుగ్వేద మూలం (1-164-20) ఇలా వుంది.

"ఈశ్వరుడు, జీవుడు-వీటికి ఆరంభ దశలేదు. నిత్యమైనవి. అవి చైతన్యాది గుణాలలో కనబడుతాయి. ప్రకృతి పెద్ద వృక్షం లాటిది. అనేక రూపాలుగా కనబడుతున్న బ్రహ్మాండమే దాని శాఖలు. ప్రళయ కాలంలో ఆదిమ రూపంలో విలీనమయ్యే ఆ ప్రకృతి కూడా అనాదిగా వున్నది. నిత్యమైనది."

స్వామి దయానంద జీవితంలో చాలా ఆశావాది. బహు నిరాశావాదిగా పేరు పొందిన జర్మన్ తత్వవేత్త షావెన్ హార్ ఆయనకి సమకాలికుడు. ఆయన భావాలకు ప్రతిగా దయానంద మానవ సేవకి అంకితమయ్యే క్రియాశీల జీవితాన్ని - ఉపయోగపడే జీవితాన్ని ప్రతిపాదించారు. దయానందుని ఆలోచనల ప్రకారం, అదృష్టాన్ని పెంచుకొనే శక్తి, తెంచుకునే శక్తి ఎవరికి వారికి వారి చేతుల్లోనే ఉంది. ఈశ్వరేచ్ఛ ప్రకారమే కర్మఫలాన్ని అనుభవించాల్సి వచ్చినా జీవుడు కర్మలను చేయడానికి మాత్రం స్వతంత్రుడు. జీవితంలో సుఖించడానికో, దుఃఖించడానికో కర్మలను ఉపయోగించు కొనే స్వేచ్ఛ జీవుని చేతిలోనే వుంది. ఇందులో ఈశ్వరునికి కాని అదృష్టానికి కాని ఏమీ ప్రమేయం లేదు, మరెవరూ జీవుని పాపాలకు ప్రాయశ్చిత్తం చేయలేరు. తన పాపాలకు తానే కష్టాల పాలు కావాలి. మనిషికి ఇచ్చాను సారంగా పనులు చేసే హక్కు దొరికాక ఫలితాల ననుభవించకుండా తప్పుకొనలేడు.

మత విషయాలలో భక్తివిశ్వాసాల ప్రాముఖ్యమెంతో దయానందకు తెలుసు. కాని ధర్మ వేదాంత మీమాంసలలో అన్ని ఆలోచనా దీక్షలకే తర్కం, యుక్తి అవసరమని ఆయన విశ్వసించేవారు. ధర్మ సిద్ధాంతాలను తర్కం-యుక్తి అనే గీటురాళ్ళపై పరీక్షించిన తర్వాతనే ఆయన ఆమోదించారు. అందువల్ల మూఢ నమ్మకాలకు సహజంగానే ఆయన శత్రువయ్యారు. తర్క సమ్మతం కాని మతాచారాలతో, గ్రుడ్డి నమ్మకాలతో ఆయన జీవితమంతా యుద్ధం చేస్తూనే వున్నారు. 'సత్యార్థ ప్రకాశం' పీఠికలో ఈ క్రింది మాటలలో తర్క రాహిత్యం గురించి గ్రుడ్డి నమ్మకాలంటే ప్రేమ గురించి చెప్పారు.

"ఏ మతములోనైనా ఏ పాటి సత్యమున్నా మనం స్వీకరించతగినదే. అన్ని మతాలలోనూ చొచ్చుకు పోయిన తప్పులను మాత్రమే ఈ గ్రంథంలో తీవ్రంగా విమర్శించాను."

దయానంద అలా మూఢ విశ్వాసాల నెదుర్కొనటానికి తమ శక్తినంతా కూడ గట్టి ప్రపంచంలోని అనేక మతాలలోని అంధ విశ్వాశాలను "సత్యార్థ ప్రకాశం"లో తూర్పారబట్టారు. ఈశ్వరావతారం గురించి కూడా ఆయన విపులంగా చర్చించారు. దీనికి ఆధారంగా యజుర్వేదం లోని అధ్యాయం (40.8)లో ఇలా వుంది.

"ఛిద్రముండనివాడు, నాడీ బంధనాలకు లోను కానివాడు, పాప కార్యాచరణకు లోను కానివాడు, అజ్ఞాన దుఃఖ క్లేశాలను అనుభవించనివాడు శరీరధారణ చేయడు. జన్మాన్ని ధరించడు." (సత్యార్థ ప్రకాశం-సప్తమసముల్లాసం)

ముక్తిని గురించి దయానందుని నమ్మకం- ఆనాడు ఆదరింపబడుతుండే భావాలకు కొంత భిన్నంగా వుండేది. అన్ని దుఃఖాల నుంచి విడివడి బంధనాలు లేని సర్వవ్యాపకుడైన పరమేశ్వరుని సృష్టిలో సంచరిస్తూ ఒక నిర్ధారిత కాలం వరకూ, ఆ స్థితిలో ఆనందం అనుభవిస్తూ తిరిగి ప్రపంచంలోనికి రావడమే ముక్తి అని ఆయన అభిప్రాయం. ధర్మసమ్మతమైన సత్యాచరణవలన, ఏకేశ్వరోపాసనల వలన సత్యజ్ఞానం వలన ముక్తి లభిస్తుంది. లౌకిక బంధాలే, అనైతిక భ్రష్ట జీవితానికి, విగ్రహారాధనకీ (ఈశ్వరుని స్థానంలో వ్యక్తినిగాని, వ్యక్తులను గాని పూజించడం) మిధ్యాజ్ఞానానికి కారణం. ముక్తి పొందినా తిరిగి జన్మ ప్రాప్తిస్తున్నది కనుక ముక్తి వలన శాశ్వతానందం లభించడం లేదని ఋగ్వేద ప్రేరణతో ఆయన అభిప్రాయపడ్డారు. వేదాంత సూత్రాలను బట్టి (1-4-33) ఛాందోగ్యోపనిషత్తు బట్టి (8.15) మోక్షం పొందాక జీవుడు ఈ ప్రపంచంలోనికి తిరిగిరాడని ఆదిశంకరులు నమ్మారు. కాని "సంపూర్ణంగా విచ్ఛేదింపబడిన బంధన ముక్తిలేదని" సాంఖ్యం (1-150)లో చెప్పారు. కనుక దయానంద

సత్యార్థ ప్రకాశికలో 'మనకి ముక్తిలో ఆనందాన్నిచ్చి ఈ భూమిపై తల్లి దండ్రులకు జన్మింపచేసి, వారిని దర్శింపచేసే వాడే ఈశ్వరుడనీ, అందరికీ యజమాని' అని చెప్పారు.

ఆయన దారిచూపిన మతంలో, వ్యర్థమైన ఆడంబరాలతో కూడిన కర్మకాండలకు చోటు లేదు. పుణ్య తీర్థ యాత్రలకీ, చందన తిలకాలు ముఖాలపై దిద్దుకోవడానికి ఆయన వ్యతిరేకి.

సామాన్యులు స్వార్థం కోసం స్వర్గం కావలెనంటారనీ, నరకానికి భయపడతారని, స్వర్గధామానికి తాళం చెవి పూజారుల వద్ద ఉన్నదని భావిస్తారనీ, దయానంద విమర్శించేవారు. చాలా కాలంగా, సామాన్యులు పుణ్యస్థలాల్లో స్నానం చేస్తూ పర్వదినాలలో దేవతామూర్తులకు కానుకలూ, ప్రసాదాలు సమర్పిస్తూ, పండాలకు దానధర్మాలు చేస్తూ స్వర్గప్రాప్తి కోసం గుడ్డివారిలా పరితపించటం దయానందకు విచారం కలిగించేది. చివరి వరకూ నెగ్గకపోయినా, యుగాలుగా వస్తున్న ఈ నమ్మకాలపై గట్టి దెబ్బతీయడానికి ఆయన వెనుకాడలేదు. కానీ ఆయన తదనంతరం ఏ ధార్మికవేత్తకీ ఈ అర్థంలేని, సమర్థింపరాని విశ్వాసాలను ప్రతిఘటించడం అవసరమని తోచలేదు. స్వర్గం, నరకం భూమి ఆకాశాల మధ్య ఏదో ఒక నిశ్చితమైన చోట వుంటాయనీ, జీవాత్మలు భూమి మీద ఉంటూ, తాము అనుభవించని సుఖదుఃఖాలను, ఆనందాలను, తాము చేసిన ప్రత్యక్ష పరోక్ష పాపపుణ్య కార్యాలకు ప్రతిఫలంగా స్వర్గంలోనో, నరకంలోనో అనుభవించగలరనీ దయానంద విశ్వసించలేదు.

స్వర్గం, నరకం- మనుష్యుని మనోవికారాలకు మారుపేర్లని ఆయన అభిప్రాయం. "పరమసుఖమే స్వర్గం. అంతులేని అలౌకిక సుఖమే స్వర్గమని లౌకికబంధనాల వెంటపడుతూ - తత్ఫలితంగా కష్టాలు అనుభవించడమే నరకమని ఆయన ఉద్దేశం. స్వర్గమనే శబ్దానికి అర్థమే అసాధారణ ఆనందం.

మనుష్యుడు ధర్మకార్య నిరతుడు కానంతకాలం, పాపకార్యవిముక్తుడు కానంతవరకూ ఆ అలౌకిక ఆనందం లభించదని, దుఃఖాల నుంచి విముక్తి కలగదని" ఆయన విశ్వాసం.

మానవజాతికి కర్తవ్యాన్ని బోధించడానికై దేవుడు దేవదూతలను పంపుతాడని క్రైస్తవులు, ముసల్మానులు విశ్వసించటం, ఈశ్వరుడు మానవరూపంలో అవతరిస్తాడని హిందువులు భావించటం, ఇలా ఆలోచించే అన్ని మతాల ఉద్దేశ్యాల వలన దయానందుని తార్కికదృష్టి ఈశ్వర లీలలను ఖండిస్తూ వ్రాయడానికి,ప్రసంగించడానికి ప్రేరేపించింది. అయితే అనాదిగా స్వర్గమంటే ఆకర్షణ, నరకమంటే భయం - ప్రజలపై

అంకుశంలా పనిచేసి వారిలో ఈశ్వర భక్తి, ధర్మపరాయణత్వం పెంచినవని మరచిపోరాదు.

కాని మధ్య యుగాలలో ప్రపంచమంతా ఉన్న పూజారులు, పురోహితులు, - పాపం చేసే వారినెత్తిమీద అత్యంత భయంకర రూపంలో పడబోయే ఆ దేవుని కోపభారం నుండి ప్రజలను రక్షించడానికి, నీతి నియమాలు సహితం వెలవెలబోయే పద్ధతుల్ని కపటోపాయాల్ని కనుగొని ఉంచారు. స్వామి దయానందుని కాలానికి, ఈ స్వర్గ నరకాల మోహజాలం ప్రజల మీద ఎక్కువగానే ఉంది. ఇంకా ఇప్పటికీ కోట్లాది మంది మనసులపై ఆ మాయాజాలం ఉంది. అందుకే దయానంద మతమంటే ప్రజల్లో ఉన్న దురభిప్రాయాన్ని వెలికిదీసి పారవేసే ప్రయత్నం చేసి ఎంతో సేవచేశ్తారు.

దయానందుని సాంఘిక సిద్ధాంతాలకు ఉపనిషత్తులు, దర్శనాలు, మనుస్మృతి - ఆధారం. ఆయన గృహస్థ జీవితానికి మార్గదర్శకంగా, అనుసరణయోగ్యంగా స్పష్టమైన నియమాలను, పద్ధతులను 'సంస్కార విధి', 'సత్యార్థ ప్రకాశిక' లలో సూత్రబద్ధం చేశ్తారు.

ధార్మిక మతాలకు ఒక రూపం ఇచ్చే దృష్టితో హిందూ సమాజంలో, తర్వాతి కాలంలో వచ్చి చేరిన మురికిని, ముందు తొలగించాలని దయానంద యత్నం చేశారు.

ఆయనెప్పుడూ సాంఘిక తత్వవేత్త కావాలనుకోలేదు. మనువులా ధర్మ శాసకుడు కావాలనుకోలేదు. కాని సంఘ సంస్కారానికి వర్గ సమానత్వానికి ఉన్న ప్రాముఖ్య మేమిటో గమనింఛగలిగారు. ఆయనలో తాపసి కుండే లక్షణాలున్నా, ఆయన ఋషిలా జీవితం గడిపినా ఆయన పలాయన వాదీ కాదు, మోక్షగామీ కాలేదు. ఆయన దేశభక్తి, హిందూ సమాజం యెడల ఆయనకు గల అనురాగం, ఆయనను పర్వత గుహలలోనూ, అడవులలోనూ ముక్కు మూసుకుని శాంతిని అన్వేషించే ఋషి జీవితం గడపనివ్వలేదు. హిందువులను బంధించిన మానసిక సంకెళ్ళ నుంచి, యుగ యుగాలుగా వస్తున్న జడత్వం నుంచి వారిని రక్షించాలన్న తీవ్రమైన కోర్కె, లౌకిక సుఖాలను, సదుపాయాలను త్యజింపచేసి ప్రజాసేవలోనే శాంతిని వెతుక్కొనేలా ఆయనను ప్రేరేపించింది. ఆర్య సమాజ సభ్యుల ప్రవర్తన నియమావళికై రూపొందించిన 'ఆచార సంహిత'లో ఆర్య సమాజ సభ్యులు ఆత్మ సేవకంటె ముందు సంఘసేవ చేయాలనీ వ్యక్తిగతమైన పున్నతి కంటె సమాజ ఉన్నతి గొప్పదని భావించాలనీ - ఆయన సూచనపైనే - సూత్రీకరింపబడి వుండవచ్చు. దీనిని బట్టి దయానంద సమాజం పట్ల తమ బాధ్యతల నెంతగా తలపోసేవారో స్పష్టమవుతుంది. ఆయన హిందూ మతాన్ని నిగూఢంగా అధ్యయనం

చేశారు. దేశమంత పర్యటించారు. అందుకే, మన దేశీయుల భయంకర దారిద్ర్యాన్ని, వెనుకబడినతనాన్ని రూపుమాపాలంటే సంఘాన్ని సంస్కరింపక తప్పదని నిర్ణయించుకున్నారు. పూజారుల పురోహితుల విశేషాధికారాలను ఎదుర్కొంటూ, వారి మాయోపాయాలకు లొంగక సాంఘిక దురన్యాయాలపై పోరు కొనసాగించటంలో తన నియమిత మార్గాన్ని దయానంద కొంచమైనా వీడలేదు. ఉన్నవారూ, లేనివారూ అనే భేదం లేకుండా వారి దయాధర్మాలపై ఆధారపడి బ్రాహ్మణులు యాచక సమానమైన జీవితం గడుపుతున్నారని ఆయన బ్రాహ్మణుడై ఉండి కూడా నిందించారు. ఎక్కువ, తక్కువ అనే తేడాలతో వెనుకబడిన అచార, వ్యవహారాలతో అర్థంలేని సంప్రదాయాలతో కరుడుగట్టిన హిందూ సమాజాన్ని నిర్మూలించినప్పుడే నిద్రాణమై ఉన్న సమాజాన్ని తట్టి లేపటం సాధ్యం.

కుల భేదాలు అశాస్త్రీయమని హిందూ, సమాజ పరిపుష్టికి, పురోగతికి అవి అవరోధమని అయన చెప్పినంత ధైర్యంగా అంతకుముందు కాలం వారెవరూ చెప్పలేదు. ప్రాచీన కాలంలో ఋషులు ఏర్పరచిచిన వర్ణ వ్యవస్థ అనేక సిద్ధాంతాలపైన ఆధారపడినది. నిజానికి హిందూ సమాజం బ్రతకాలన్నా సమయానుకూలంగా సంచరించాలన్నా ప్రాచీన శాస్త్రాల ననుసరించి, స్మృతుల ననుసరించి తనని తాను సంస్కరించుకోవాలి. ఈ సంస్కరణోద్యమంలో సంధ్యావందనం, ప్రాణాయామం, హోమాలు, ఈశ్వరోపాసన ప్రముఖమని ఆయన తలపోశారు. రెండుపూటలా సంధ్యావందనం ఆచరించటం వలన ఈశ్వర సాక్షాత్కారానికి మనం సిద్ధమయినట్లే. అచమనం, శరీరంపై నీళ్లు జల్లుకోవటం ఈ రెండూ సంధ్యావందన విధిలోని ప్రారంభకృత్యాలు. ప్రాణాయామం, తన చుట్టూ తాను ప్రదక్షిణ చేయడం, స్తుతి, ఉపాసన - ఇవి ఈశ్వరోపాసనకి అవసరం. సత్యార్థ ప్రకాశికలో పతంజలి ముని చెప్పిన ప్రాణాయామ ప్రభావం గురించి దయానంద ఇలా వర్ణించారు.

"ప్రాణాయామం వలన అన్ని కల్మషాలు హరిస్తాయి. జ్ఞానం కలుగుతుంది. ముక్తి కలుగనంతవరకు, ఆత్మజ్ఞానం పెరుగుతూ ఉంటుంది."

సంధ్యావందనంలో ఇంకా మూడు దశలున్నాయి. అఘమర్షణ - అంటే పశ్చాత్తాపం అంటే పాపపు ఆలోచనల నుండి దూరంగా ఉండాలనే కోరిక. ఆత్మ ప్రదక్షిణ - అంటే తన మనసును అన్ని వైపులా త్రిప్పుడూ ప్రతి దిశలో ఈశ్వరుని చూడటం. ఉప స్థానం - అంటే జ్యోతి జీవితం, జ్ఞానం - ఈ రూపాలలో ఈశ్వరానుభవం. ఇంకా స్తుతి, ప్రార్థన, ఉపాసన. దయానంద సంధ్యావందనంలోని లాభాలను చెప్పినా

నిష్కళంక జీవితాన్ని గడపటం, సత్కర్మలను ఆచరించటం, ఈశ్వరుని సర్వజ్ఞతలను గ్రహించటం, ఈశ్వరేచ్ఛకు లోబడి ప్రవర్తించడం - వీటి ప్రాముఖ్యాన్ని తక్కువ చేయలేదు.

అగ్నిహోత్ర విధి గురించి కూడా రెండు మాటలు చెప్పాలి. ఇందువల్ల గాలి శుభ్రపడుతుందని ఆరోగ్య మయి జీవితానికి ఆలంబన దొరుకుతుందని, అందువల్ల గృహస్థుల నిత్య విధులలో అగ్నిహోత్రానికి ద్వితీయ స్థానమివ్వాలని దయానందుల ఉద్దేశ్యం.

ప్రాచీన వర్ణ వ్యవస్థలో చేసే పనుల బట్టి వారి కులం ఆధారపడి ఉన్నది, కాని పుట్టక కాదు.

మను స్మృతిలో నాలుగు వర్ణాల వారికి హక్కులు, విధులు నిర్వచించబడినాయి. ఆ విధులను నిరంతరం నిష్ఠగా పాటించాలని ప్రతి కులానికి ఆదేశాలున్నాయి. దయానంద తన జీవిత కాలమంతా ప్రాచీన సాంఘిక వ్యవస్థ నుద్ధరించడానికే ప్రయత్నించారు. కుల నిర్ధారణకు జన్మ బదులు కర్మకే ప్రాధాన్యమిచ్చి, ఆయన హిందూ సమాజంలోని ద్వేష భావాలను, దురాలోచనలను రూపుమాపటానికి ప్రయత్నిస్తూ వచ్చారు. ఇందులో దయానంద చాలినంత సఫలమయ్యారు. కాని ఆయన తరువాత వచ్చిన సంఘ సంస్కర్తలెవరూ, ఈ విషయం పట్టించుకొనక పోవటం విచారకరం. అందువల్లనే ఈ నాటికీ హిందూ సమాజ ప్రగతికి ఆటంకం కలుగుతోంది. అలా చూస్తే దయానంద తన కాలానికి తను చాలా ముందు ఉన్నట్లే. ఆయన తదనంతరం వచ్చిన సంస్కర్తలకి ఆయన అలా మార్గదర్శకుడయినాడు. వెనుకబడిన వారి, అంటరాని వారి జీవితాలను కొంచెమయినా మెరుగు పరచడానికి వీలు లేని ఆ కాలంలోనే దయానంద వారి పక్షాన, వారి కష్టాలను ఎలుగెత్తి చాటి, వారి జీవన స్థాయిని సంఘంలో గౌరవాన్ని పెంచడానికి సాధ్యమైనంత చేశారు.

శూద్రుల గూర్చి ఆయన వ్యాఖ్య చాలా విలక్షణంగా ఉన్నది. ఒకసారి శూద్రుడెవడని ఆయనను ప్రశ్నిస్తే - అశిక్షితుడు, బుద్ధిహీనుడు - శూద్రుడని జవాబిచ్చాడు. పుట్టుక బట్టి కులానికి గౌరవం చూపటం ఆయనకు పడదు. ఆయన మంచి తర్కంతో దీనిని వ్యతిరేకించే వారు. కాశీలో ఒక పెద్దమనిషి ఈ విషయమై ఆయన అభిప్రాయం కోరితే జన్మ వల్ల ఎవరూ బ్రాహ్మణుడు కాదని జవాబు చెప్పారు. " ఒక బ్రాహ్మణునికి ఇద్దరు కుమారులు. అందులో ఒకడు క్రైస్తవ మతమో, మహమ్మదీయ మతమో అవలంబిస్తే, ఈ బ్రాహ్మణుడు ఇంకా బ్రాహ్మణుడుగానే పరిగణింపబడతాడా?" అని

ఒకరు దయానందుని ప్రశ్నించారు. అందుకు బదులుగా దయానంద జన్మత: ఇతనినే బ్రాహ్మణునిగా చూడనపుడు ఈ ప్రశ్న ఎందుకని జవాబు చెప్పారు.

హిందూ సమాజం మరింత క్షీణించకుండా ఆయన చేసిన ప్రయత్నాలలో - ఇతర మతావలంబకులను మతం మార్చుకొనడానికి ప్రోత్సహించి కొందరినైనా హిందూ మతంలోనికి జేర్చుకొనడమే విప్లవాత్మకమైన ముందడుగు. దీని పేరు శుద్ధి ఉద్యమం అన్నారు. దేశంలో మూల మూలలనున్న ప్రజలను తమ మతంలో జేర్చుకొనడమే ధ్యేయంగా ప్రచారం చేసే క్రైస్తవ మిషనరీల మతం మార్పిడి కార్యక్రమాన్ని నిరోధించడమే దీని లక్ష్యం. ఇది, క్రైస్తవ మిషనరీలు సంఘాలు స్థాపించుకొనడానికిచ్చిన 1813 నాటి విశేషాధికారాలు చట్టంగా మారిన రోజుల మాట. క్రైస్తవుల, మహమ్మదీయుల మతం మార్పిడి కార్యకలాపాలకి ప్రతీకారంగా స్వామి దయానంద ఈ శుద్ధి ఉద్యమాన్ని చేపట్టి వుండవచ్చు. క్రైస్తవ మిషనరీలు, వారి దేశస్థులు వారి ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయాన్ని పొందుతూ తమ చిత్తమొచ్చినట్లు మాట్లాడుతూ మసలడం మరువరాదు. అందువల్లనే దయానంద హిందువులను ఈ శుద్ధి ఉద్యమంలో చేరమని కోరారు. క్రైస్తవ మతంలోని విలువలని ఆచార వ్యవహారాలని తీవ్రంగా విమర్శించడానికి ప్రోత్సహించారు. ఇతరులను హిందూ సమాజంలో కలుపుకుంటూ హిందూ సమాజంలో వారిని ఒక భాగం చేసుకొనే ప్రాచీన పద్ధతినే అయన పాటించారు. ఈ ప్రయత్నం వల్ల ఆయన అనుకొన్న ఫలితం దక్కింది. నిమ్న కులాలు ఇతర మతంలోకి మారటం ఇందువల్ల పూర్తిగా ఆగిపోలేదు, కాని జోరు తగ్గింది. డెహరాడూన్‌కి చెందిన మహమ్మద్ ఉమర్, లక్నోలోని మౌలానా మహమ్మద్ హుస్సేన్ - అనే ఇద్దరు మునల్మానులను హిందూమతంలోనికి చేర్చుకొని దయానంద ఈ శుద్ధి ఉద్యమానికి మార్గదర్శకు లయ్యారు. మతం మార్పిడి పట్ల దయానందుని ధోరణి చూసి, మహమ్మదీయ ముల్లాలు, క్రైస్తవ ఫాదరీలు ఆయనంటే భయపడ సాగారు. అసహ్యించు కొనసాగారు. ప్రాచీన వర్ణాశ్రమ ధర్మమంటే దయానందునికి ఎంతో భక్తి. అది ఒకనాటి హిందూ సమజానికి అదెంతో ఉపయోగకారిగా వుందని ఆయనెంచారు. అయినా అది ఇప్పుడు ఆచరణయోగ్యం కాదు కనుక దాని పునర్నిర్మాణంలో ఆయన నిమగ్నమయినారు. కాని ఆదర్శం కంటే యదార్థమే బలమయినది. ఏ ఆదర్శమయినా ఆచరణ లోపెట్టే ప్రయత్నం చేయాలి, లేకపోతో ఆదర్శంగానే మిగిలి పోతుంది. చాలా మంది గాంధీజిని కలలో మనిషి అనుకొనేవారు. మహా పురుషులు ప్రతి యుగంలోనూ వుంటారు. మనిషి, తారాసుమాలను కోసే స్వప్నాన్ని చూడకపోతే చంద్రలోక విహారానికి వెళ్ళేవాడు కాదేమో.

మనిషి తన మీదే తను విజయం సాధించటం కష్టం. దయానంద తనని తాను జయించుకొన్నాడు. నియమబద్ధంగా, సంయమనంతో జీవితాన్ని నడుపుకొన్నవారే తనలోని - స్వ-ను జయించగలరు. వర్ణాశ్రమ ధర్మ వ్యవస్థలో ఇందుకు అవకాశం వున్నది. కాని కాలక్రమేణా అది అచరణ సాధ్యం కాలేదు. సంయమనం గురించే నియమబద్ధ జీవితం గురించే, ఆయన తన ఉపన్యాసాలలోనూ సత్యార్థ ప్రకాశంలోనూ, సంస్కార విధిలోనూ చెపుతుండేవారు. వేదాలు, బ్రాహ్మణాలు, మనుస్మృతి సూత్రాలు వీటికి ఆధారం. అందుకే వాటినెప్పుడూ ఆయన ప్రతిపాదిస్తూ వుండేవారు. వర్ణాశ్రమ ధర్మాన్ని నియమబద్ధం చేయడానికి, ముఖ్యమైనవీ, కానివీ అన్ని సంస్కార విధులూ కలిపి నలభై దాకా వున్నాయి. ప్రపంచలోని యితర మతాలలో ఇంత సూక్ష్మంగా, జాగరూకతతో నియమబద్ధం చేయలేదు. ఈ సంస్కారాలు శిశువు పుట్టక ముందు నుంచీ అరంభమయి మరణించే దాకా జరుగుతూనే వుంటాయి. సామాన్య జనుల మేలుకోరి బ్రాహ్మణుడు అలోచించేవాడు. ఫలితంగా అతనికి అర్థిక స్థిరత్వం సాంఘిక ఔన్నత్యం కలిగేలా ఏర్పాటయ్యేది. పూజార్లు, పురోహితుల వర్గానికి లభించిన విశేషాధికారాలను నిర్మూలించడానికి, ఆ పదవుల్లో సంస్కృత విద్వాంసులుండాలని దయానంద షరతు విధించినా, పదహారు సంస్కారాలను పూర్తి నిష్ఠతో సమర్థించారు. గృహస్థులందరూ వాటిని పాటించి తీరాలని బోధించేవారు. కొన్ని గొప్ప సంస్కారాల ప్రాముఖ్యాన్ని ఇక్కడ విశదీకరించాలి.

అసలు షోడశ సంస్కారాలు ఏ గృహస్థుకైనా తప్పనిసరిగా భావించబడినప్పటికీ, మూడు నాలుగు సంస్కార విధులు మాత్రమే అచరణ రూపంలో నిలిచాయి. ప్రజలలో పెరుగుతున్న బీదరికం, నిర్లక్ష్యం ఇందుకు కారణాలు కావచ్చు. కాలగతిలో పురోహితులు ఈ సంస్కారాలను చాలా ఖర్చుతో కూడినవిగా రూపొందించటంతో వీటి సంఖ్య తగ్గి వుండవచ్చు. ఈ అనుష్ఠాన పద్ధతులు ఆచరించడానికి ఎక్కువ సమయం పట్టడం వలన, అనేక చిక్కులతో వుండటం వలన ప్రజలు విసుగెత్తి పోయారు. వీటిని నిలబెట్టడానికి నరక భయం చూపారు. మనుష్యేతర జన్మ లభించగలదనే మూఢ నమ్మకాలు ప్రచారం చేశారు. అందుచేత దయానంద ఈ సంస్కారాలను సులభతరం చేసి ఆశాపరులైన బ్రాహ్మణుల ద్వారా ఈ సంస్కారాలు జరిపించుకొనవలసిన అవసరం లేదని చెప్పి, వీటికయ్యే ఖర్చు తగ్గించాడు. ఆయన చెప్పిన పద్ధతి ప్రకారం ఈ సంస్కారాలలో వివాహం ఆడంబరం లేకుండా ఒక గంటలోనూ, అంత్యక్రియలు రెండు గంటలలోనూ జరుపవచ్చు.

గృహస్థుని మొట్ట మొదటి సంస్కారం గర్భాదాన సంస్కారం. స్వామి దయానందుని ఉద్దేశ్యం ప్రకారం వివాహానికి కనిష్ఠ వయోపరిమితి స్త్రీకి 16 సంవత్సరాలు, పురుషునికి 25 సంవత్సరాలు. గరిష్ఠ పరిమితి స్త్రీకి 24 సంవత్సరాలు, పురుషునికి 48 ఏళ్ళ వరకు ఉండవచ్చు. గరిష్ఠ వయోపరిమితిలో స్త్రీ పురుషులకు 24-48 సంవత్సరాల వయస్సులో వివాహం చేయడం ఉత్తమం. అప్పటికి శరీరము మనసు పూర్తిగా వికసించును గనుక ఇది ఇద్దరికీ ఉత్తమమని ఆయన అభిప్రాయం.

వైదిక విధి ప్రకారం జరిగే వివాహాలలో పెండ్లి కుమార్తె తండ్రి వద్ద నుంచి ఏ విధమైన కట్నంగాని, వరకట్నంగాని పీడించి తీసుకొనడానికి వీలులేదు. వైదిక కాలంలో తల్లిదండ్రులు పెళ్ళి సంబంధములు నిశ్చయించే పద్ధతి కంటే స్వయంవర పద్ధతిలో నిశ్చయించిన వివాహాలు మంచివిగా భావించేవారు. ఋషులు, మునులు, రాజులు, మహా రాజులు మొదలైన ఆర్య ప్రజలు బ్రహ్మచర్యంతో విద్యాభ్యాసం చేసేవారు. ఈ పిమ్మటనే స్వయంవర వివాహాలకు ఏర్పాట్లు జరిగేవి కనుకనే ఆనాడు దేశస్థితి ఎంతో ఉన్నతంగా వుండేదని దయానంద ఉద్దేశ్యం. బ్రహ్మచర్యం లేకుండా విద్యాభ్యాసం పరాధీన స్థితిలో అంటే తల్లి దండ్రులపై ఆధారపడి వున్న కాలంలో వివాహాలు జరగటం ప్రారంభమయిన తర్వాతనే క్రమంగా ఆర్యావర్తం నష్టపోయింది. (సత్యార్థ ప్రకాశిక నాలుగవ సముల్లాసం) అందుచేత తమ ఇష్ట ప్రకారం జరిగే వివాహాలను దయానంద సమర్థించారు. పెండ్లి చేసుకొనెడి వారి యోగ్యతలు, జ్ఞానము, శీలము - ఇవే వివాహాలకు ఆధారంగా వుండాలి. సత్పథ బ్రాహ్మణము ఆధారంగా ఆయన దూర ప్రాంతాలకు చెందిన వధూవరుల వివాహాలను సమర్థించేవారు. దీని వల్ల ఆ జీవన సహచరుల మధ్య ప్రేమానురాగాలు వృద్ధి నొందుతాయని ఆయన నమ్మకం. ఆయన అభిప్రాయం ప్రకారం దహనకర్మతో అంత్యక్రియా సంస్కారం పూర్తి అవుతుంది. యజుర్వేదము ననుసరించి మానవ శరీర దహనంతో సంస్కారములన్నీ పూర్తి అగునని దయానందుని సంస్కార విధిలో వున్నది. (భస్మాంతంశరీరమ్). దహనం తరువాత మూడవరోజున మిగిలిన ఎముకలు భూమిలో ఖననం చేయబడతాయి. మరణించిన వ్యక్తి యొక్క బంధువులకు, పరిచయస్తులకు కుటుంబీకులకు విందు చేసే శ్రాద్ధ సంస్కారానికి దయానంద విరోధి. ఈ మంచి సలహాను ఇలా విని అలా వదలివేయడం వలన దురాచారాలు ఇంకా కొనసాగుతూనే వున్నాయి.

ఇందాక చెప్పిన, రెండు సంస్కారాలే కాక మిగిలిన పన్నెండు సంస్కారాల పునః ప్రతిష్ఠను ఆయన సమర్థించారు. దయానందుని సాంఘిక పునరుద్ధరణ కార్యక్రమంలో

స్త్రీలకు ప్రముఖ స్థానం వున్నది. ప్రతి ఉపాయమూ, స్త్రీకి ఉన్నత స్థానం కల్గించడానికి వినియోగించాలనుకున్నారు. ఘోషా పద్ధతికి ఆయన వ్యతిరేకి. స్త్రీలకు తగిన విద్య నేర్పి ఇంటి పనులలో వారిని నిపుణులను చేయాలి. అలా సంఘాన్ని జాగృతపరిచే పనిలో సగం భాగం స్త్రీ పంచుకొనేలా చేయాలని ఆయన కోరుకొనేవారు. స్త్రీలుండాల్సిన చోటు గృహ మేనని ఆయన భావించినా, సంఘంలో ఉపయోగించే భాగంగా వారు రూపొందాలి కనుక, వారి పరిపూర్ణ విద్యాభ్యాసాన్ని ఆయన వ్యతిరేకించలేదు. స్త్రీలు వేదాలు చదువుకొనడాన్ని కానీ, ఉన్నత లక్ష్యాలు సాధించడాన్ని కానీ, బ్రహ్మచర్య జీవితం గడపటాన్ని కానీ అయన తప్పు పట్టలేదు.

క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దం వరకు భారతదేశంలో మాంసాహారం భుజించే ఆచారం బాగా వాడుకలో వుండేదని, చాలాకాలం తరువాతనే ఆ ఆచారాన్ని విడిచిపెట్టారని చరిత్రకారు లెంతోమంది నమ్మ సాగారు. కాని ఆర్యులు మాంసా హారులు కారని, శాకాహారులని దయానంద నమ్మి ఆ విధంగా ప్రచారం చేశారు. ఈ మాంసాహార నింద ఆయన జీవితం ఆఖరి దశలో హిందూ జీవన సంస్కరణోద్యమంలో ముఖ్య భాగమై గోహత్యా విరోధ ఉద్యమానికి దారితీసింది. అందుకే ఆయన తన ప్రతి ఉపన్యాసంలోనూ గో సంరక్షణ ఆవశ్యకత గురించి చెప్పటం మరచేవారు కాదు. గోరక్షణ, మాంసవర్జన - గాంధీజీ చేపట్టిన అహింసా మార్గాన్ని సుగమం చేశాయి. దయానందుని ప్రకారం అహింస అనగా శత్రుత్వాన్ని మరచి సర్వదా ప్రేమ, గౌరవం చూపటం. ఆయన తన ఋగ్వేదాది భాష్య భూమికలో "అన్ని ప్రాణులను తనతో సమానంగా చూచుకొనెడి వాడే ధార్మికుడు. అతని కెవరి ఎడల చెడు తలపు లుండవు. మిత్రునిలా అందరికీ మేలు చేయాలనే కోరుకొనును" అని వ్రాశారు.

స్వామి దయానంద ఊహించిన సాంఘిక విప్లవంలో, ఆధ్యాత్మిక పునరుత్థాన కార్యంతో బ్రహ్మ చర్యానికి ఎంతో ఉన్నతమైన స్థానం ఉన్నది. ప్రాచీన భారతీయ సాంస్కృతిక జీవితానికి వెన్నెముక అయిన బ్రహ్మచర్యాన్ని గూర్చి దాని గొప్పతనాన్ని గూర్చి దయానందుని తర్వాత వచ్చిన సంఘ సంస్కర్త లెవరూ గుర్తించక పోవటం చాలా దురదృష్టకరం. ఆయన సత్యార్థ ప్రకాశికలోని తృతీయ సముల్లాసంలో అధిక భాగం మానవ జీవితంలో బ్రహ్మచర్యానికి గల స్థానం గురించి విపులంగా చర్చించారు.

18 సంవత్సరాల పాటు బ్రహ్మచర్యంలో వున్నవాడు సంపూర్ణ జ్ఞానంతో, శారీరక బలంతో, సచ్చరిత్రుడై, అన్ని విద్యలలో నిష్ణాతుడు కాగల శక్తి నొంది, సంపూర్ణ వికాసం పొంది, అందరికీ వెలుగునిచ్చే రవి సమానుడై వుంటాడని దయానందుని అభిప్రాయం.

ఇతరుల కుపదేశాలిచ్చే బదులు, ఆదర్శాలను పాటిస్తే ఎంతో ప్రభావం చూపగలమని దయానంద బ్రహ్మచర్యాన్ని పాటించి ఎందరికో ఆదర్శ ప్రాయుడయినారు. అలాటి వారిలో రామకృష్ణ పరమహంస, అరవింద, మహాత్మాగాంధీ లాంటి వారు తమ జీవితాలలో తరువాతి కాలంలో బ్రహ్మచర్యం గొప్ప తనాన్ని గ్రహించ గలిగినవారున్నారు. ఆధ్యాత్మిక నైతిక రంగంలో వారికి లభించిన విజయానికి, గౌరవానికి కారణం, వారవలంబించిన బ్రహ్మచర్యం. దయానందునికి కూడా దీని వల్లనే నిర్భయత్వం, సాహసం, నిగ్రహం అలవడినవి. అందువలననే, ఏ చిక్కు సమస్య వచ్చినా సులభంగా పరిష్కరించడానికి మార్గం కనబడేది. వారాల కొద్దీ జరిగే శాస్త్రార్ధ వాగ్వివాదాలకూ, సంచార కార్యక్రమాలకు కావలసిన బలం, శక్తి లభించేది.

దేశాన్ని మేలు కొలిపే వుద్యమంలో విద్య ఎంత అవసరమో ఆయనకు తెలుసు. సరైన జ్ఞానము సరైన విద్య లోపించటం వలననే దేశం పరాయి చేతుల పాలయినదని ఆయన ఉపన్యాసాలలో వివరించేవారు. ఆయనెక్కడికి వెళ్లినా ఆర్యసమాజ శాఖలను ప్రారంభించడంతో బాటు సంస్కృత పాఠశాలలను నెలకొలిపే యత్నాలు చేసేవారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్, శాహ్‌పూర్ సంస్థానాలు సందర్శించినపుడు అక్కడి రాజులకు జాగీర్దారులకు మనుస్మృతి, మహాభారతం స్వయంగా బోధించేవారు. ఆయన ఇంగ్లీషు భాషాబోధనకు అప్రధానమైన స్థానిమిచ్చినా ఇంగ్లీషు విద్యకు శత్రువు కాదని మనం గమనించాలి. మెకాలే ప్రభువు ప్రవేశ పెట్టిన ఇంగ్లీషు చదువును ధైర్యంగా సవాలు చేసినది ఆయన ఒక్కరే. పట్టణాలకు దూరంగా, ప్రాచీన గురుకులాల పద్ధతిలో విద్యాబోధన జరగలాని ఆయన సంకల్పం. దయానంద బ్రహచర్య దీక్షను ప్రతిపాదించిన వారు కావటంతో సహ విద్యను ఆమోదించలేదు. వేష, భాష ఆహార నియమాలను విద్యార్థు లందరూ ఒకలాగే పాటించాలని ఆయన కోరుకొనేవారు. "రాజుల సంతానమైనా సరే, సామాన్యుల పిల్లలైనా సరే అందరూ తాపసులు కావాలని", సత్యార్థ ప్రకాశంలో వ్రాశారు. అయిదు మొదలు ఎనిమిది సంవత్సరాల వయసులోని తమ పిల్లలని గురుకులాలలకు పంపవలెనని తల్లి దండ్రులకు ఆయన సలహా యిచ్చేవారు. ఆయా శాఖలలో విద్వాంసులైన వారు, ధర్మ పరాయణులైననవారు మాత్రమే గురుకులంలో ఉపాధ్యాయులుగా నియమితుల కావాలని ఆయన ఉద్దేశ్యం. గురువులు, తమ విద్యార్థులతో కలిసి మెలిసి వుంటూ వారిని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.

విద్య గురించి ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలలో ముంచుచూపు లౌకిక దృష్టి కనబడతాయి. విద్య గురించి ఆయనొకసారి తన పుస్తకంలో "సభ్యతనీ, దార్మికతనీ,

ఇంద్రియాలపై విజయాన్నీ పెంపొందించేదీ, అవిద్యని పరహరించేదీ విద్య" అని వివరించారు. (స్వామంత వ్యామంతవ్యప్రకాశం-22)

19వ శతాబ్దం 7,8 దశాబ్దులలో బాలల నిర్బంధ విద్యని ఆయన సమర్థించటం, విప్లవాత్మకమైన వివేక వంతమయిన పని. నిరుద్యోగ సమస్య కూడా ఆయనను కలవర పరిచింది. అందుకే ఆయన సాంకేతిక విద్య అవసరాన్ని గ్రహించ గలిగారు. కొందరు విద్యార్థులను యంత్ర విద్య నేర్చుకొనడం కోసం జర్మనీ పంపించవచ్చని ఆయన ఒక వ్యాసంలో సూచించారు. నిరుద్యోగ నిర్మూలనలో ఒక మెట్టుగా, ఉద్యోగాలకు శిక్షణ నిచ్చే విద్యాలయాన్ని స్థాపించాలని మరొక చోట ఆయన వ్రాశారు.

ఆయన విద్యా ప్రణాళికలో సంస్కృత బోధనికి అన్నిటికంటె ఎక్కువ ప్రాముఖ్యాన్నిచ్చారు. సంస్కృతం కేవలం ప్రాచీన భాషే కాదనీ, సంస్కృత సాహిత్య భండారం సంపూర్ణ జ్ఞాన భాండాగారమనీ అందరూ అధ్యయనం చేయాలని ఆయన భావించడమే ఇందుకు కారణం.

సంస్కృతం చదివిన తర్వాత భారతీయులు ఆంగ్లేయ సాంప్రదాయాలనూ, ఆంగ్ల సాహిత్యమంటే వున్న అనవసర భక్తి ప్రవత్తులను వదలుకుంటారని ఆయన ఆశించారు. అలాగని ఆయన ఆంగ్ల సాహిత్యానికి వ్యతిరేకికారు. ఆయన 1876లో వనమాలి అనే బెంగాలీ వద్ద ఆంగ్లం నేర్చుకొన్నారు. వైదిక ధర్మ ప్రచారం సులభతరం చేయడానికి శ్యాంజీవర్మని ఇంగ్లండు దేశం పంపే ఏర్పాట్లు ఆయనే చేశారు. కాని కాలం గడుస్తున్న కొద్దీ ఆయన అభిప్రాయాలు మారి ఆయన హిందీ భాష అభిమాని అయినారు. ఆయన రచనల్ని ప్రాంతీయ భాషలలోనికి అనువదించడానికి సహితం ఆయన సుముఖులు కారు. ఆయన పుస్తకాలను చదవవలె ననుకొన్నవారు హిందీ భాష సరళమైనది కనుక నేర్చుకోవాలని ఆయన ఆశించారు. కేశవ చంద్రసేన్ సలహా ననుసరించి ఆయన హిందీలో వుపన్యసించటం మొదలుపెట్టారు. కాని హిందీని జాతీయభాషగా చేయాలని ప్రకటించిన వారిలో దయానందే ప్రథములు. ప్రాంతీ భాషలన్నీ దేవనాగరి లిపిలో వుండాలనీ దేవనాగరి లిపిని జాతీయ లిపిగా ప్రకటించాలని విక్టోరియా మహారాణికి పంపడానికి ఆయన వినతి పత్రం సిద్ధం చేశారు. భారతీయ విద్యార్థులంతా తమ మాతృభాషతో బాటు మరో ప్రాంతీయ భాష నేర్చుకోవాలని ఆయన ప్రతిపాదించి భావిపాలకులకు మార్గం చూపారు. ఆ రకంగా ఈనాటి త్రిభాషా సూత్రానికి ఆయన మూల పురుషుడయ్యాడు.

సత్యార్థ ప్రకాశంలో మూడవ సముల్లాసం చివరిలో ఇచ్చిన ఈ వివరణ వల్ల

విద్య అంటే ఆయనకెంత ప్రాణమో తెలియగలదు.

"మనసు, శరీరం, ధనం అన్నీ యిచ్చి ఎంత వృద్ధి చేయగలమో అంతా చేయాలి"

స్వామి దయానంద నైతిక ధార్మిక నాయకుడు మాత్రమే కాదు, కేవలం సంఘ సంస్కర్తే కాదు, ఆయన ఒక జాతీయ ఆదర్శవాది. రాజనీతి విదురుడు. ఈ దేశం ఉద్ధరింపబడాలని, సాటి దేశాల సరసన మనదేశం సర్వోత్తమ స్థానంలో నిలబడాలని అనుకొనేవాడు. పరాధీనమైన మనదేశాన్ని చూసి ఆయన మనసు క్రుంగి పోయేది. అప్పుడప్పుడు తమ వుపన్యాసాలలో ఆయన ఎంతో విచారం వ్యక్తం చేస్తూ వుండేవారు. అయినా రాజకీయాలంటే ఆయనకి అభిమానం లేదు. దేశంలో ఏర్పడి వున్న రాజకీయ వాతావరణమంటే ఇష్టమూ లేదు. తను చేపట్టిన పనిలో ఆటంకం కలుగుతుందని ఏ రకమైన రాజకీయాలలో జోక్యం చేసుకొనే వారు కాదు. ఆయన సంస్కరణో ద్యమాలలో రాజకీయాలకు తావులేదు.

పాశ్చాత్య ఆదర్శాలకూ, ఆలోచనా సరళికీ గ్రుడ్డిగా అనుకరించడం ఎంత నిష్ఫలమో ఈ కాలం వారికి చెప్పి స్వయంగా ఆలోచించుకొనే శక్తి కలుగ జేయాలి. గత కాలం నుంచీ మనకు లభిస్తూ వచ్చిన సంస్కృతీ వారసత్వం ఎంతో గొప్పదని, పాశ్చాత్యుల సంపద కంటె ఎక్కువ సమృద్ధి గలదని తెలియచెప్పగల తర్క, సంశయ నివృత్తి మాత్రలను మింగించి వారిని నిద్ర నుంచి మేలు కొలపాలి. ఈ కాలాని కిదే సరి.

ఆ విధంగా స్వామి దయానందను 19వ శతాబ్దపు దేశ భక్తులకే నాయకునిగా ఎంచవచ్చు. విదేశీ దాస్యం నుంచి మన దేశాన్ని విడిపించు కొనాలని మొట్టమొదట కలలు గన్నది ఆయనే.

ఈ దాస్యమంటే ఆయనెంత వికలమయ్యారో ఆయన రచించిన పుస్తకం లోని వాక్యాల బట్టి తెలుస్తుంది.

"... ఆర్యుల అలసత్వం, కొని తెచ్చుకొన్న పొరపాట్లు, పరస్పర ద్వేషాలు. వీటి ఫలితంగా విదేశీయులు మన రాజ్యాన్ని ఏలుతున్న కథ చెప్పడాని కేమున్నది. ఆర్యవర్తంలో అఖండ, స్వతంత్ర, స్వాధీన నిర్భయ దేశం ఏది? ఉన్నదంతా విదేశీ పాదా క్రాంతమైనది. కొద్ది భాగాలు మాత్రమే స్వతంత్రంగా వున్నవి. దుర్దినాలు సంప్రాప్తించి నపుడు దేశవాసులు ఎన్నో కష్టాల నెదుర్కొన వలసినదే. ఎవరెంతగా చెప్పినా స్వరాజ్యమే ఉత్తమ రాజ్యం తప్ప - మతాంతర కలహాలు లేకుండా చేయ గలిగినా, పక్షపాతం హితమైనా, తల్లిదండ్రుల ప్రేమ, దయ న్యాయంతో సమానమైన

- విదేశీపాలన పూర్తి సుఖం కలుగచేయలేదు." (సత్యార్థ ప్రకాశం - అష్టమ సముల్లాసం)

మరొక చోట భారతీయ దాస్య శృంఖలాలను పరిశీలిస్తూ మాతృదేశ దురదృష్టాన్ని ఇలా తలపోశారు.

"ఆర్యావర్తంలో విదేశీయుల పాలన వలన పరస్పర కలహాలు, మతకలహాలు, బ్రహ్మచర్యం పాటించక పోవటం, విద్య గరపక పోవటం, విద్య నేర్వక పోవటం, ఇష్టం లేని బాల్య వివాహాలు, విషయాసక్తి, అసత్య ప్రేలాపన, వేద విద్య వ్యాప్తి చెందక పోవటం - ఇలా ఎన్నో అకార్యాలు వచ్చి పడినాయి. సోదరులు తగువులాడు కున్నప్పుడు మూడో వ్యక్తి మధ్యవర్తిగా రాక తప్పుతుందా." (-దశమ సముల్లాసం)

దేశం పరాధీన మైనందుకు, ఈ స్థితి కలిగినందుకు ఆయనెంత దుః ఖించెడివారో దీనిని బట్టి తెలుస్తుంది.

త్వరలో దేశం స్వాతంత్ర్యం పొందుతుందనే ఆశ ఆయనకు లేకపోయినా ప్రజల మనసులలో దీనత్వాన్ని పొగొట్టి, స్వాతంత్ర్యం సిద్ధించే ప్రయత్నం చేయడానికి అవసరమైన సాధనాలు ఆయన సమకూర్చారు. స్వతంత్ర భారతదేశం గురించి కలలు గని స్వరాజ్య పాలన, ప్రభుత్వం గురించి ఎన్నో అభిప్రాయాలను వెల్లడించారు. ఈ రాజకీయ నైతిక భావాలను ఆర్ష వైదిక గ్రంథాలయ నుంచి ఆయన గ్రహించారు. కౌటిల్యుని అర్థ శాస్త్రమంటే ఆయనకి కిట్టదు. బహుశా వైదికోత్తర కాలం నాటి గ్రంథాల నుంచి అభిప్రాయాలు గ్రహించడం ఆయనకు నచ్చలేదేమో. కాని 19వ శతాబ్దపు తాత్వికులు చెప్పిన శాసన విషయాలు మాత్రం ఆయనని బాగా ఆకర్షించేవి.

స్వ పరిపాలనలో భాగం పంచుకోవాలనే కోరిక, 1861 నాటి ఇండియా కౌన్సిల్ చట్టం ద్వారా నెరవేరదు కనుక, ఈ ఛాయా మాత్ర పాలనా స్వేచ్ఛకి ఆయన ప్రతికూలుడు. ఆయన పరోక్షంగా వ్యతిరేకించినా, హీన స్వరంతో ప్రతిఘటించినా ఆయన ప్రతిఘటన అతి సహజమైనది.

ప్రస్తుత: దయానందునికి క్రియాశీల రాజకీయాలలోనూ, విద్రోహ యత్నాలలోనూ, నమ్మకం లేదు కనుక రాజతంత్రం గురించీ, పరిపాలన గురించి 'సత్యార్థ ప్రకాశం', ఆర్యాభినయాలలోనూ, వేద భాష్యాలలోనూ ఆయన తన అభిప్రాయాలు ప్రకటించి తృప్తి పడేవారు. చాలా అరుదుగా, దేశభక్తి గురించి, రాజకీయాల గురించి ఆయన ఉపన్యాసాలలో చెప్పేవారు. ముఖ్యంగా 1875లో పూనాలో ఈ విషయాలు ముచ్చటించారు. దయానంద తమ చివరి రోజులలో శాహపూర్, ఉదయపూర్, మసూదా పాలకులను - వేదాలలో, మనుస్మృతిలో, విదుర నీతిలో,

మహాభారతాది గ్రంథాలలో చెప్పినట్లు తమ రాజ్యాలను పాలించమని నచ్చ జెప్పారు. సత్యార్థ ప్రకాశిక ఆరవ సముల్లాసంలో రాజతంత్ర, శాసన విధానాన్ని చర్చించారు.

క్షత్రియ బ్రాహ్మణ గుణాదులున్నవారే పరిపాలన కర్హులని దయానందుని అభిప్రాయం. శాసకులు నిరంకుశులు కారాదు. ధర్మ పరిషత్తు, శాసన పరిషత్తు, విద్యా పరిషత్తు - ఈ మూడింటి సహాయంతో రాజు రాజ్యాన్ని పాలించాలి. రాజ్యాధికారమంతా ఈ మూడు పరిషత్తుల చేతుల్లో వుండాలి. రాజు శాసన అధ్యక్షుడిగా పని చేయాలి. ఈ మూడు పరిషత్తుల పైన ప్రజల నియంత్రణ వుండాలి. వీటికి విద్వాంసులైన ప్రతినిధులను ఎన్నుకొని పంపే అధికారం ప్రజల కుండాలి. వీరందరూ కలిసి పనిచేసి ప్రజలు అంగీకరించే చట్టాలను రూపొందించాలి. వ్యక్తుల మేలు కోరి చేసిన చట్టాల ఎడల ప్రజలు ఎలా వ్యవహరించినా, సమిష్టి ప్రయోజనాల కోసం రూపొందించిన చట్టాలను అందరూ శిరసావహించాలి.

అందువల్లనే సత్యార్థ ప్రకాశంలో, రాజ్యాధ్యక్షునికీ, చట్టాలు రూపొందించే వివిధ సమితులకూ, పరిషత్తులకూ అవసరమైన యోగ్యత లేమిటో చెప్పబడినాయి. రాజ్యానికి వుండే విధులు, చేయవలసిన పనులు విస్తారంగా చర్చింపబడినవి. పలుకుబడి, విశ్వాసం. మంచి శీలము గల వ్యక్తుల చేతికే రాజ్యాధికారం ఒప్పగింపబడాలి. రాజోద్యోగులు ప్రజలను తండ్రిలా పాలించాలి. సరిహద్దుల రక్షణకు వీలైన అన్ని పద్ధతులు ఉపయోగించాలి. దొంగల, దోపిడీ దొంగల బలం తగ్గిపోయేలా వ్యవహరించాలి. ఉద్యోగస్థులు చేసే పనులను గమనిస్తూ ప్రజలెలా మెలుగుతున్నారో తెలుసుకొనే గూఢచారులను నియమించే ఏర్పాటు వుండాలి. పాలకులకు ప్రజలకు తృప్తి నిచ్చే పన్నుల విధానం వుండాలి. ప్రభుత్వానికి రావసిన ఆదాయాన్ని వాయిదాలుగానే వసూలు చేయాలి. దయానంద పన్నుల గురించిన అభిప్రాయాలను మనుస్మృతికే వదిలేశాడు. మనుస్మృతి ప్రకారం వ్యాపారస్థులు, శిల్పులు, తమ లాభాలలో నూటికి 50 వంతులు వెండి బంగారాల రూపంలోను, పండిన ధ్యానంలో రైతులు 8వ భాగం కానీ, ఆరవభాగం కానీ ప్రభుత్వానికి చెల్లించాలి.

ఋషులు చెప్పిన సూత్రాల బట్టి న్యాయ వ్యవస్థ నడవాలి. శాసకులకు ప్రజలకు మేలు జరిగే షరతు మీదనే, కొత్త చట్టాలను చేయాలి. తర్వాత దయానంద రకరకాల వివాదాలకీ, ఘర్షణలకీ కారణాలు చర్చిస్తూ వాటిని 18 వర్గాలుగా విభజించారు. ఋణ స్వీకారం, తాకట్టు, ఇంటి సామాన్లు అమ్మకం, కొట్టడం, ఋణం ఎగవేత, వేతన వివాదాలు, క్రయ విక్రయాల గొడవలు, పశువుల గురించి దెబ్బలాటలు, సరిహద్దు

వివాదాలు, చెయ్యెత్తటం, నిందించటం, దొంగతనం, దోపిడీ, హింసించడం, బల ప్రయోగం, వ్యభిచారం, వివాహ కర్తవ్యాలను పాటించక పోవటం, ఉత్తరాధికారుల వివాదాలు, జూదం ఇలా విడదీశారు. ఈ సముల్లాసం చివర, సాక్ష్యం చెప్పే వారి కుండాల్సిన గుణాగుణాలు - సాక్షి ఇచ్చే సాక్ష్యం పైన చర్చ జరిగింది.

ఈ దేశం సర్వతోముఖంగా అభివృద్ధి చెందాలని దయానందుని కాంక్ష. సమకాలీన సమస్యలన్నిటినీ ఆయన విపులంగా చర్చించారు. వీటి పరిష్కారానికి ఆయన సాహిత్యం నుంచి ప్రేరణ పొంది సమాధానాలు ఆలోచించినా, క్రొత్త నియమాలను పటిష్టం చేయాలని, ప్రాచీన విధానాలను సంస్కరించాల్సిన అవసర మున్నదని ఆయన అర్థం చేసుకున్నారు.

# 9

# వ్యక్తిత్వం - పనులు

అతి సంపన్నుల యిళ్లల్లో పుట్టి సాంసారిక సుఖాలను త్యజించి మానవసేవే జీవితంగా గడిపినవారు మానవ చరిత్రలో చాలా కొద్దిమందే కనబడతారు. సమాజం కంటికి రెప్పలా కొన్ని నమ్మకాల్ని కాపాడుకుంటూ వుంటుంది. వాటికి ఎదురీదే సాహసం కొద్దిమందే చేస్తారు. సమాజం ఆమోదించిన బాటలో నడవటం చాలా సౌకర్యంగా వుంటుంది. కానీ సంఘానికి ఎదురుగా నడవమని చెప్పటం, ఆత్మసంయమనం, ఆత్మత్యాగం కంటె చాలా కష్టమైనవి. లౌకికమైన మోహాలు బంగారువల విసరడానికి సిద్ధంగా వుంటాయి. సాంసారిక బంధనాలు తెంపుకొని సమాజానికి వ్యతిరేకంగా పోరాడుతూ గడపటాని కిష్టపడే వారు కొద్దిమందే వుంటారు. చాలామంది ఇతరుల లోపాలు వెతుకుతూ వుంటారు. కాని తాము నమ్మినది ఆచరించి చూపేవారు తక్కువ.

ప్రాచీన ఋషులలోని నైర్మల్యం, కాంతి ప్రసరించే మహా పురుషుడు స్వామి దయానంద. శంకరాచార్యుల నిశితదృష్టి, గాంభీర్యము, ఆయనలో దర్శన మిచ్చేవి. ఆయన శరీర సౌష్ఠవం వైదిక కాల బ్రాహ్మీ మూర్తులు గర్వించేలా వుండేది. ప్రాచీన తాపసులు కూడా ఆయన విశిష్ట బ్రహ్మచర్యా నుసరణ చూసి అసూయపడేవారు కూడా. ఆయన అద్వితీయ వ్యక్తిత్వం ముందు ఎవరైనా సరే వామనమూర్తులాగానే గోచరిస్తారు. ఆయనలోని అనేక ప్రత్యేక లక్షణాల వలన ఆయన తన సమకాలికులలో అందరికన్న విలక్షణంగా కనబడే వారు.

ఒకసారి ఆయన, కపిల, కణాదుల ముందు తను చాలా అల్పుడనని చెప్పుకున్నారు. కాని, ఆయన విద్వత్తు ధర్మ పరాయణత, వివేకం, సమకాలీనుల కంటె చాలా ఎక్కువ. ఆయన ఆదర్శాలు, ఆశాదృష్టి - విద్యావంతులలో సహితం నిరాశను పొగొట్టి, ఆత్మ గౌరవాన్ని పెంచినది. గత కాలపు భవ్యమైన విలువలను అర్థం చేసుకొన కుండా అప్పటి బుద్ధి జీవులంతా, లంగరులేని పడవవలె పాశ్చాత్య పోకడల వెంట

నడవసాగారు. స్వామి దయానంద భారతీయుల వైభవాన్ని గురించి, నవయువకులను, - అమూల్యమైన మన ప్రాచీన వైభవం పట్ల ఆకర్షితు లయ్యేలా మార్చి పశ్చిమదేశాల సంస్కృతీ వ్యామోహంలో పడనీయకుండా కాపాడారు.

35 సంవత్సరాలుగా సాగిన పర్యటనలో స్వామి దయానంద ప్రజలలో అంతర్గతంగా ఏమున్నదో అర్థం చేసుకొన్నారు. దేవాలయాలలో, తీర్థాలలో, మఠాలలోని అనైతిక స్థితినీ, దురాగతాలను తెలుసుకొన గలిగారు. ఆయన కాలంలో సంఘసేవకులు, మత సంస్కర్తలు ఇంతగా మనుష్యుల అంతరంగాలనీ విషయాలను కూలంకషంగా పరిశీలించ లేదు. ఆయన హిందూ సమాజంలోని అనాగరిక విషయాలను, నీతి బాహ్యమైన సంగతులను స్వయంగా చూసి మరీ వెల్లడించారు. ఆయనకు ప్రజల భాష తెలిసి వుండటం వలన, ఆయన ప్రసంగాల ప్రభావం, ప్రచారం ఎంతో విస్తృతంగా వుండేది. చాపక్రింద నీరులా పాకుతున్న పశ్చిమ దేశ సంస్కృతిని ఎదుర్కొనవలసిన కాలంలో కొందరు సంస్కర్తలు ఆత్మరక్షణ పద్ధతులు అవలంబిస్తూ వుంటే, స్వామి దయానంద, వేద సంస్కృతి వేద విద్యల ఆయుధాగారం నుంచి లభించిన పదునైన ఆయుధాలలో సిద్ధమయినారు. ఇలా శతృవుల ఆయుధాలను వ్యర్థం చేసి, మొక్కపోనివ్వడమే కాక మన నాగరికత సంస్కృతి మిగతా వారి కంటె ఎంత ఉత్కృమైనవో మన దేశవాసులకి నచ్చచెప్పి కృత కృత్యులయ్యారు.

దయానందుని దివ్య వ్యక్తిత్వం, రూప లావణ్యాలు ప్రతివాదులను భయపెట్టేవి. క్లిష్ట సమయాలలో కూడా ధైర్యంగా శాంతంగా వుండనిచ్చే ఆయన ఓరిమి ఆయన విమర్శకుల ప్రశంసకు పాత్రమయ్యేది. ఆయన్ని తుదముట్టించాలని ఎన్ని ప్రయాత్నాలు జరిగినా, ఆయన ఏ మాత్రం స్థిమితం కోల్పోలేదు. ఆయన భరించివలసి వచ్చినన్ని అపవాదులు ఇతర సంఘ సంస్కర్తలెవరూ ఎదుర్కోలేదు. సమాజంలో విప్లవం తీసుకు రావటం, కొత్త ఆలోచనలు చొప్పించడం తేలిక కాదని ఆయనకు తెలుసు. గాలి వాలుగా వీస్తుందనీ, అప్పుడు అవకాశం వస్తుందనీ నిరీక్షించకుండా, నిర్లక్ష్యంగా ఆయన సాగిపోయారు.

ప్రత్యేక సదుపాయాలతో ప్రాబల్యాల కూపంలో కరుడుగట్టిన స్వార్థాల నెదుర్కొనడానికి తగిన ధైర్యము, ఓరిమి దయానందునికి వున్నవి. సహించరాని సాంఘిక దూరచారాలను, అజ్ఞానము జుగుప్స కలిగించే మతాచారాలను ఎదుర్కొంటూ ఆయన చేసిన సుదీర్ఘ భీషణ సంగ్రామమే ఆయన జీవితం. ప్రతిఘటనకు అనువైన వాతావరణాన్ని సృష్టించి దురాచారాలను రూపుమాపే మార్గాన్ని విశాలం చేయటంతో

ఆయన ప్రతిష్ఠ పెరిగింది. ఆయనకి ఆంగ్లభాష రాకపోవటం వలననే హిందూ సమాజాన్ని శుద్ధి చేయడానికి ఆయనకు బాహ్య ప్రేరణ కన్న అంతఃప్రేరణ ఎక్కువ లభించింది. హిందూమతం కర్మకాండలకు ఆడంబరాలకు, అర్థంలేని అంధ విశ్వాసాలకు మారుపేరుగా మారి విచారకరంగా పరిణమించింది. సాధారణ చికిత్సకు లొంగడం లేదు. మత, సాంఘిక రూపాలను ఆమూలాగ్రంగా మార్చి హిందూ సమాజాన్ని పునర్నిర్మించాల్సిన సమయ మాసన్నమైనది. ఈ పనిలోనే దయానంద నిమగ్నమయినాడు. ఆయన క్రైస్తవులతో మహమ్మదీయులతో తలపడవలసి వచ్చిన బాహ్యకారణాలను అప్రధానంగా భావించాలి. పెద్ద సంఖ్యలో హిందువులు క్రైస్తవులుగా మారారు. చర్చీలు, మసీదులు సంఖ్యలో పెరిగాయి. ఉన్నత పాఠశాలలలోనూ, కళాశాలలలోనూ చదువు నేర్పే వంకన ఇంగ్లీషు భాష ప్రవేశించింది. ధర్మ యుద్ధం పేరిట హిందువులపై మహ్మదీయుల ఒత్తిడి వచ్చింది. ఇవన్నీ దయానందుణ్ణి కొంత వరకూ ప్రభావితం చేశాయి. ఇవి లేకపోయినప్పటికీ, లోపలి ఒత్తిడి వలన, కట్టుబాట్ల ఫలితంగా మనదేశ నిరంతరం పతనం అందువల్ల వచ్చిన బానిసత్వం ఎలాటిదో విశ్లేషిస్తూ, సవాళ్ళ నెదుర్కొంటూ దయానంద ముందుకు సాగిపోయేవారు. అలా సాగినవారిలో రామమోహనరాయ్ వున్నారు. ఈ రుగ్మతలకి వారు సూచించిన చికిత్సా పద్ధతులు వేరు కావచ్చు. ఈ సవాళ్ళ నెదుర్కొంటూ ఎవరు ఎంత దూరం ప్రయాణం చేసినా, వారి అనుభవాలలో తేడాలున్నా, వారు చూపిన ప్రతిక్రియలలో భేదాలున్నా, వారిద్దరూ ఒకే నిర్ణయానికి రావడం బట్టి మనదేశ పతనానికి, బానిసత్వానికి కారణాలేమిటో స్పష్టమవుతాయి. ఇది ఎంత అంటురోగమో, ప్రమాదకరమో చెప్పడానికే వారు పైకి కనబడే కొన్ని లక్షణాలను హెచ్చించి, లేదా తగ్గించి చెప్పారు.

స్వామిదయానంద తన 13వ ఏటనే విగ్రహారాధనకు విముఖుడు. వ్రతాలు, ఉపవాసాలు మొదలైన బాహ్య అనుష్ఠానాల వలన మనుష్యుడు, పుణ్యాత్ముడూ, ధర్మాత్ముడూ కాజాలడనీ, ఈ "శరీరం నశించేది కనుక ముక్తి పొందే యత్నం మాత్రమే చేయాలని ఆయన తన 18వ ఏటనే గ్రహించారు. ఇరవై రెండేళ్ళ ప్రాయంలో సంసారాన్ని త్యజించిన దయానంద పదిహేడేళ్ళు పాటు నిజ తాపసుల నీడలో, కపట సన్యాసుల సంపర్కంలో సత్యాన్ని, జ్ఞానాన్ని అన్వేషిస్తూ జరిపిన దీర్ఘయాత్ర, చివరికి మధురలో అంధవృద్ధ గురువు శ్రీ చరణాల వద్ద ప్రాచీన శాస్త్రాధ్యయనంతో ఫలించింది.

వైదిక మహిమను పునరుద్ధరించడానికి జీవితాన్ని అంకితం చేయమని విరజానందస్వామి దయానందుని ప్రేరేపించకపోతే, దయానందుని శేషజీవితం ఎలా

గడిచేదో చెప్పలేము. గురువు ఆదేశానుసారం, ఆయన తన జీవితాన్ని అంకితం చేసే నిర్ణయానికి వచ్చేముందు కొంత తటపటాయించిన విషయం అందరికీ తెలిసినదే.

దయానంద హిందూ సమాజానికి పట్టిన జాడ్యమేదో నిర్ధారించటమే కాకుండా, సాహసోపేతమైన చికిత్స చేసి, తనే ఆదర్శంగా నిలబడి ఉపదేశాల ద్వారా రుగ్మతను రూపుమాపే యత్నం చేసిన వివేకి. ఆయన చేసిన వైదిక జీవన ప్రచారాన్ని విమర్శించడం తేలికే కాని, నాగరికత పెరుగుతున్న కొద్దీ మానవుని కష్టాలు పెరుగుతూ వచ్చాయని జీవితం మరింత జటిలంగా, అవినీతికి నిలయంగా మారినదని ప్రత్యేకంగా నిరూపించనక్కర్లేదు. పెరుగుతున్న వాంఛలు, భోగ విలాసాలు, మానవుని మరింత స్వార్థపరునిగా, కపటిగా, ముందుచూపు లేనివానిగా మార్చివేశాయి. ఈ నాటి సగటు మనిషి ఇది వరకటి మనిషి కంటె ఎక్కువ భయస్థుడు, తక్కువ పరోపకారి, తక్కువ దానశీలి. అంతసత్శీలి కాదు, దయాశీలి కాదు. అందుకనే మన మధ్య చాలా మంది పాత రోజులు గుర్తుకు తెచ్చుకొంటూ ఆధునిక ప్రవృత్తులనీ, ఆలోచనలనీ, లోటు పాట్లనీ తలచుకొనేటప్పుడు విచార గ్రస్తులై మాట్లాడుతుంటారు. గత కాలాన్ని మనం ఎంత తక్కువగా ఎంచినా, కాదనినా పూర్తిగా మరచిపోలేము. దాని నుంచి విడిపోలేము. ఇప్పటికీ మన రాజకీయవేత్తలు, విద్యావేత్తలు, సంస్కర్తలు, ఇంకా చాలామంది గత కాలం గురించి చెబుతూనే వుంటారు.

అనాదిగా వస్తున్న సుసంపన్న వారసత్వం నుంచి లభించిన ఆదర్శాల కోసం ఉదాహరణల కోసం చూస్తాము. గాంధీ గారి అభిమతాలు, ఇష్టాఇష్టాలు ఈ సంపద నుంచి తీసుకున్నవే. అహింస, నైతిక విలువలు, ఆత్మనిగ్రహం, హృదయ నైర్మల్యం గురించి ఆయన నొక్కి వక్కాణించినది అంతా ప్రాచీన సూక్తులపై ఆలోచనలపై ఆధారపడినది. ఈ నాటికీ మనకాదర్శప్రాయులుగా వున్న రామకృష్ణ పరమహంస, వివేకానంద, అరవిందుడు, రమణమహర్షి, లోకమాన్యతిలక్, రవీంద్రనాథ్ఠాగూర్ మహాత్మాగాంధీ - అందరూ ప్రాచీన ఋషుల నుంచి ప్రేరణ పొందినవారే. స్వామి దయానంద, వేదములే ప్రమాణములనీ, స్మృతులే మనల్ని రక్షించుననీ చాటిన కాలం నాటికి భారత జాతీయ కాంగ్రెస్ అవతరించలేదని మరువ రాదు. రాజద్రోహం గురించి గాని, విద్రోహం గురించి గాని ఎవ్వరూ మాట్లాడ సాహసించలేని రోజులవి. దేశంలో వార్తా పత్రికల సంఖ్య చాలా స్వల్పంగా వుండేది. ప్రయాణ సాధనాలు పరిమితంగా వుండేవి. క్రైస్తవ మిషనరీలు దూర దూరాలకు వల పన్నారు. ప్రాచీన సంస్కృతి చిహ్నాలు నశింప సాగాయి. యువకుల మనసులను మోహపాశాలలో బంధించనారంభించిన

విదేశీ నాగరికత వ్యాప్తిని, అరికట్టాలంటే వేదాల శరణు కోరాలి. నైతిక ఆదర్శాల ననుసరించి జీవితాన్ని దిద్దుకొని యువకులు వేదోన్ముఖులు కావాలని, దయానంద సరైన సమయంలోనే స్వాగతం పలికారు.

స్వామి దయానంద జాతీయ భావాల్ని ఆనాటి కాలం సహజంగానే ప్రభావితం చేసింది. వివిధ మతాలు ధర్మాలు, సహజీవనం చేయగల దేశాన్ని ఆయన వూహించారు. వేరు వేరు మతాల మధ్య జరిగే సంఘర్షణలు, కలహాలు ఆయనకు దుఃఖం కలిగించాయి. భిన్న సంప్రదాయాలకు చెందిన ప్రజలలో సద్బుద్ధిని మేల్కొలిపి తార్కికంగా ఆలోచింపజేయాలి. సన్మార్గాన నడిపించి వారిని పరస్పరం దగ్గర చేయవలసిన అవసరమున్నదని దయానంద కనిపించింది. విభిన్న మతాలలోని అంతర్లీన సత్యాలను గ్రహించి దేశోన్నతి కొరకు కలిసి పనిచేసే ఉద్దేశ్యంతో ఢిల్లీలో ఏర్పాటయిన వివిధ మతనాయకుల సమావేశంలో దయానంద చేసిన ప్రతిపాదనలు ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చుకోవాలి. అయితే ఆ సమావేశంలో ఒకరి నొకరు అనుమానంతో చూడటం వలన ఒకరి అభిప్రాయాలను మరొకరు ఆదరించక పోవడంతో సభికులనందరినీ ఒక దారికి తెద్దామనే దయానంద ప్రయత్నం కొనసాగలేదు.

దయానంద వివిధ సమస్యలపై తన అభిప్రాయాలను లక్ష్యాలను వెల్లడి చేయడానికి సత్యార్థ ప్రకాశమును రచించారు.

"సత్యా సత్యాలను తెలుసుకొని, సత్యాన్ని గ్రహించి, అసత్యాన్ని త్యజించి, మానవ జాతి ఉన్నతి పొంది లబ్ధినందాలని" తమ కోరిక అని, అంతేగాని 'ఎవరి మనసును దుఃఖ పెట్టడం' తన అభిమతం కాదని పీఠికలో స్వామిదయానంద వ్రాశారు. "వివిధ మతాల పండితులు పక్షపాతరహితంగా వ్యవహరించి, అందరికీ అనుకూలమైన సత్యాన్ని అన్ని మతాల నుంచి గ్రహించి, భేదాభిప్రాయాలకు తావిచ్చే విషయాలను త్యజించి, పరస్పరం ప్రేమతో వ్యవహరిస్తే మంచిదని దయానంద ఆమోదించారు. అందరి మధ్య సుహృద్భావం కలగజేయడానికి, రాజీ చేయడానికి, తను స్వయంగా లొంగి రావటానికి కూడా ఆయన సిద్ధంగా వుండేవారని దీనిని బట్టి తెలుస్తోంది.

దయానంద విమర్శలు స్వీకరించేవారు. తర్కాన్ని అంగీకరించడానికి సిద్ధంగా వుండేవారు. ఆయన అభిప్రాయాలను అప్పుడప్పుడు మార్పు చేసేవారు. తనకు ఇష్టమైన విలువలు కొన్నింటిని వదులుకొనేవారు. 'హఠయోగ ప్రదీపిక', "యోగా బీజాలు" వంటి గ్రంథాలు భ్రమను కలిగింప జేసే మిథ్యా విషయాలతో నిండివున్నాయని తెలియగానే ఆయన వాటిని గంగలో విసిరివేయడమే ఇందుకు సాక్ష్యం. హఠయోగం

మీద ఆయనకు గల నమ్మకం గూడా సడలిపోయింది. గ్రుడ్డి నమ్మకాలకు మిథ్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రారంభ దశలో కొంతకాలం వరకు ఆయన శైవమత పక్షపాతిగా, వైష్ణవ మతానికి విరుద్ధంగా మాట్లాడే వారు. వేదాలను సమర్థించే ముందు, దేవీ భాగవతం, భగవద్గీత, తత్వబోధ, ఉపనిషత్తులు మొదలైన వాటిని ఆయన చదివి, ఇతరులకు బోధిస్తూ వుండేవారు. అలాటిది, ఆయన వాటిని విడిచి, వేదాలను, బ్రాహ్మణములను, వేదాంగాలను ఆదరించారు. దయానంద, విరజానంద స్వామికి శిష్యుడై వైదికధర్మ ప్రచారం కోసం తన జీవితాన్ని ధారపోస్తానని మాట ఇచ్చిన తర్వాతనే ఇలా జరగటం విశేషం. మొదట్లో ఆయనకి, జీవుడు-బ్రహ్మ ఏకమనే విశ్వాసం వుండేది, కాని తరువాత తరువాత ఆయన జీవుడు, బ్రహ్మ - వేరు అనే వాదాన్ని స్వీకరించారు. దయానందుని మనసులో, తర్కానికి, బుద్ధికి ఎంత ప్రాధాన్యతముండేదో ఈ విషయాల వలన స్పష్టపడుతుంది.

ఆ కారణంగానే ఆయన ఇతర మతాలను విమర్శించినంతగానూ, హిందూ మతాన్ని కూడా విమర్శించేవారు. అన్ని మతాలలోను వుండే తర్కహీన సిద్ధాంతాలను ఆయన విమర్శిస్తూ వుండేవారు. దేశం ఉద్ధరించబడాలని దయానంద కోరేవారు. ప్రార్థించేవారు. ఆ రోజు కోసం తన పద్ధతిలో తాను ప్రయత్నించారు. ఆయన 1857లో సాయుధ విప్లవం విఫలం కావటం కళ్ళారా చూశారు. ఎన్నో వాస్తవాలను తెలుసుకొన్న ఆయన భారతీయ స్వాతంత్ర్యం - సాయుధ విప్లవం ద్వారా సాధ్యమని భావించలేకపోయారు. భారతీయ సమాజాన్ని తిరిగి మార్పు చేయాలి. అపుడుగాని స్వాతంత్ర్యం సిద్ధించదు. ఇది ఒకటి రెండు సంవత్సరాలలో జరిగే పని కాదని ఆయనకు తెలుసు. ఇందుకోసం సమాజంలోని వివిధ భాగాలు పనిచేసే క్రియాశీల దీర్ఘయత్నం చాలా అవసరం అనుకొన్నారు. దయానందునికి 1857వ సంవత్సరపు సాయుధ తిరుగుబాటులో ఏ ప్రమేయమూ లేదు. మన ప్రముఖ చరిత్రకారులలో ఒకరైన జయచంద్ర విద్యాలంకార్ మాత్రం దయానందకు ఈ తిరుగుబాటుతో ఏదో రకమైన సంబంధమున్నదని తలపోశారు. తన వాదనను సమర్థిస్తూ ఆయన మూడు కారణాలు చెప్పారు.

1. 1853-57 మధ్యకాలంలో దయానంద తమ జీవిత విశేషాలను ఎక్కడా వెల్లడి చేయలేదు.
2. విరజానందస్వామి దగ్గిరకు అనుమానాలను నివృత్తిచేసుకోవడానికై దయానంద 1853లో వెళ్ళిన ఎడల బాగుండునని పూర్ణానందస్వామి చెప్పినప్పటికీ

దయానంద వెళ్ళలేదు.

3. విరజానందస్వామి సాక్షాత్కారం కోసం దయానంద మథుర వెళ్ళకుండా కాన్పూరు వెళ్ళి పది నెలల పాటు కాన్పూరు - బెనారస్‌ల మధ్య సంచరిస్తూ వున్నారు.

ఈ తిరుగుబాటు గురించి దయానంద పశ్చాత్తాపపడుతూ వ్రాసినట్లు మరొక వాదన ఉన్నది.

దయానంద తమ జీవిత విశేషాలను చాల క్లుప్తంగా చెప్పారు. తమ తల్లిదండ్రులను గురించి తమ జీవిత పరిణామ దశ గురించి వివరించకుండా మౌనమే వహించారు. తన జీవిత విశేషాలు చెప్పేటప్పుడు ఎన్నో సంఘటనలను ఆయన వివరించలేదు.

అందుచేత మౌనం వహించినంత మాత్రాన 1857 స్వాతంత్ర్య పోరాటంలో ఆయన ప్రత్యక్షంగానో పరోక్షంగానో పాల్గొన్నారనుకోరాదు. ఇష్టం వచ్చిన సమయంలోనే ఎవరైనా ఎక్కడికైనా వెళ్లినట్లుగానే దయానంద కూడా విరజానంద స్వామి వద్దకు వెళ్ళారు. హిమాలయ సంచారం తర్వాత దయానంద తీర్థయాత్రలు చేయాలనుకొని వుండవచ్చు. ఏ మహాత్ముడో, యోగిపుంగవుడో సాక్షాత్కరించగలడని అనుకొనవచ్చు. 1856లో హిమాలయాలు దిగి ఆయన రామ్‌పూర్‌లోని రామగిరియోగి వద్దకు చేర అక్కడనుంచి ద్రోణసాగర్ వెళ్ళారు. శీతాకాలం అక్కడ గడిపి ఆ పర్వతం దిగి గంగానది తీరాలైన గడ్‌ముక్తేశ్వర్, కాన్పూర్, ప్రయాగ, వింధ్యాచలం, కాశీ యాత్రలు చేశారు. తర్వాత ఆయన, వింధ్య పర్వతాలను దాటి ప్రవహించే నర్మదానదీ ప్రవాహాన్ని పరిశోధిస్తూ దక్షిణాపథం వైపు బయలుదేరారు. ఈ సంచారంలో కూడా ఎవరైనా మహాత్ముని దర్శనం లభిస్తే తన ఆధ్యాత్మిక, వేదాంత పిపాస తీర్చుకొందామనుకున్నారు. నిజంగా ఆయన విప్లవ వీరులతో సంబంధం పెట్టుకొనదలిస్తే లక్నోలోనో, మీరట్‌లోనో, ఢిల్లీలోనో వుండేవారు కాని, ఈ తీర్థయాత్రలు ప్రారంభించరు కదా! విప్లవయోధుల గురించి దయానంద చేసిన ప్రకటనల బట్టి ఆంగ్లేయుల అధికారం నుంచి విముక్తి పొందడానికి తిరుగుబాటుదారులు చేసిన వీరోచిత పోరాటం ఎడల ఆయన గౌరవ భావం తెలియవస్తున్నది. కాని ఆయనకు వారితో సంబంధముకలదని మాత్రం తెలియడం లేదు.

1873లో కలకత్తాలో నున్న నార్తుబ్రూకు ప్రభవుతో దయానందుని సమావేశం ఏదో సమయంలో, ఇంగ్లడు చర్చికిచెందిన లార్డ్ బిషప్ ద్వారా ఏర్పరచబడినదని ఒక

వాదన. ఈ సమావేశంలో దయానంద విదేశీ ఆధిపత్యం నుంచి దేశానికి విముక్తి కలగాలని ఈశ్వరుని ప్రార్థిస్తున్నట్లు నార్త్బ్రూకు లండనులోని ఇండియా ఆఫీసుకు ప్రతి వారం తనురాసే లేఖలో వుల్లేఖిస్తూ, ఈ 'తిరుగుబాటు సన్యాసి'పై ఒక కన్ను వేసి వుంచాలని తన ప్రభుత్వాన్ని ఇక్కడ ఆదేశించానని భారత కార్యదర్శికి తెలిపాడని అంటారు. కాని ఈ సమావేశం గురించి ఇండియా ఆఫీసు గ్రంథాలయంలో ఎక్కడా కనపడలేదు సరికదా దయానందుని జీవిత చరిత్ర వ్రాసిన దేవేంద్రనాథ్ ముఖోపాధ్యాయగాని, హరవిలాస్ శారదగారు గాని ఎక్కడా చర్చించలేదు. అందువల్ల ఈ వాదన కట్టు కథగానే తోస్తున్నది తప్ప నమ్మలేము.

అయితే దయానంద అనేక విషయాలలో అందరికన్న ముందున్నట్లు తోస్తుంది. స్వదేశీవస్తు వినియోగం ఎంత అవసరమో మొదట చెప్పినది ఆయనే. పుస్తకాలలో, ప్రసంగాలలో ఆయన స్వదేశీ వస్త్రాలు, స్వదేశీ పాదరక్షలు, ప్రతి దినమూ ఉపయోగించే ఇతర సామగ్రి గురించి ప్రచారం చేశారు. ఆయన భారతీయ వస్తువులనే ఉపయోగించేవారు. బీదవారికి ఉప్పు చవకగా దొరకవలెనంటే ఉప్పు మీద పన్ను రద్దు చేయాల్సిన అవసరమున్నదని ఆయనకే ముందు తట్టింది. వైదిక సందేశ ప్రచారానికి ఎవరినయినా ఇంగ్లండు పంపితే బాగుండునని దయానందే ముందుగా ఆలోచించారు. దయానందుని ఆశయాలకు అనుగుణంగా నడవకపోయినా ఇంగ్లండు వెళ్ళడానికి, ప్రముఖ సంస్కృత విద్వాంసుడు శ్యాండి కృష్ణవర్మ నిశ్చయించినపుడు దయానందజీ ఆయనని ఆశీర్వదించారు. గో సంరక్షోద్యమానికి నాందిపలికి, గో హత్యా నిషేధానికి ఉద్యమం లేవతీసినది ఆయనే. అంటరాని వారిని ఉద్ధరించాలని చాటి చెప్పినది ఆయన. ఇతర మతావలంబకులను, శుద్ధిచేసి తిరిగి హిందువులుగా మార్చడానికి మొట్టమొదట ప్రోత్సహించినది దయానందే, ముఠాలుగా ఏర్పడటానికి, ప్రాంతీయ, మతతత్వానికి ఆయన అతీతుడు. ఆర్యావర్తాన్నంతా ఆయన స్వగృహంగా, మానవులందరినీ సహోదరులుగా భావించారు.

దయానందకు సంస్కృత భాషపై మంచి అధికారముండేది. వైదిక విద్యా ప్రవాహాన్ని లోతుగా తరచిచూశాడు. సంస్కృత వ్యాకరణంలో ఆయనకున్న జ్ఞానం అపారం. మత శాస్త్రాలను బాగా పఠించి, విమర్శనాత్మకంగా చూసినప్పటికి ఆయన వైదిక సాహిత్యం నుంచి ప్రేరణపొందారు. తరువాత వచ్చిన సంస్కృత సాహిత్యాన్ని చదవ వలసిన అవసరం లేదనుకొన్నారు. కావ్యనాటకాదులు ఆయనను ఆకర్షించ లేకపోయాయి. ప్రాచీన వైదిక సాహిత్యాన్ని తిరిగి వ్యాఖ్యానిద్దామని, భాష్యం రచించాలనీ

అనుకొనేవారు. అలా చూస్తే సంస్కృత సాహిత్యానికి ఆయన క్రొత్తగా చేసినదేమీ లేదు. ఆయనను యాస్కునితో, మనుస్మృతి రచించిన సుమతి భార్గవునితో, పతంజలితో, శంకరాచార్యునితో పోల్చవచ్చు. "ఋగ్వేదాది భాష్యం, ఋగ్వేదాది భాష్యభూమిక, సత్యార్థ ప్రకాశం, దయానందుని విఖ్యాత రచనలు. ఆర్షజీవనానికి వైదిక కర్మకాండల ఘనత గురించి, హిందూ గార్హస్థ్య జీవితంలో పాలించదగు విధుల గురించి వివరించిన, "సంస్కార విధి అనే గ్రంథం" -- ఆయన పుస్తకాలలో బాగా ప్రాచుర్యం పొందిన గ్రంథం, 'వేదాంగ ప్రకాశం, అష్టాధ్యాయీ భాష్యం' - భాషాశాస్త్ర వ్యాకరణ సంబంధమైన గ్రంథాలు.

దయానంద మంచి జ్ఞాపక శక్తి, తెలివిగలవారు, ధర్మశాస్త్రాలను నియమంగా అధ్యయనం చేసేవారు. వాటిలోని విపులమైన ప్రకరణాలను సహితం అవలీలగా గుర్తుకు తెచ్చుకుని ఉదహరిస్తూండేవారు. ఆయనెక్కడికి వెళ్ళినా, కూడా తమ పుస్తకాలను పట్టుకెళ్ళేవారు. మాక్సు ముల్లరు పండితుడు చేసిన వేదానువాద ప్రతులను జర్మనీ నుంచి తెప్పించుకొన్నారు. ఇతర మతావలంబకుల ధార్మిక గ్రంథాల అనువాదాలను సహితం తెప్పించుకొని వాటితో పరిచితులయ్యేవారు. ఆయనది మంచి తర్కం. ప్రతివాదులను ఓడించడానికి ఎక్కువ సమయం పట్టేది కాదు. ఆయన కొంత పరిహాస ప్రియులు కూడా. వ్యంగ్యంతో ఉచిత వాగ్వివాద పటిమతో ఆయన ప్రతికక్షుల ఆట కట్టించేవారు. అల్ప జ్ఞానంతో, అల్ప విద్యతో వాదనకు దిగే ప్రతివాదులను "మహామూర్ఖులని" ఆయన సంబోధించేవారు. అప్పుడప్పుడు ఏదైనా శబ్దాన్ని పరిహాసపూర్వకంగా కొత్త పద్ధతిలో వివరిచేవారు. "పూజారి" శబ్దాన్ని 'పూజారి' అని అంటే పూజకి శత్రువని అనేవారు.

దయానంద స్వభావం వ్యక్తిత్వం - జీవిత పద్ధతులు ఏమిటో తెలుసు కొనకుండా ఆయన జీవితం ఆయన చేసిన పనులు గురించి వివరిస్తే అది సమగ్ర పరిశీలన కాజాలదు. పేరు పొందిన సమకాలికులతో పోలిస్తే ఆయన శారీరకంగా చాలా బలంగా వుండేవారు. గంటల కొద్దీ కష్టపడగల శక్తి గలవారు. భారీ శరీరం. మంచి ఎత్తు (సుమారు ఆరు అడుగులు వుండేవారు) శాంత స్వభావంతో ఆయన మంచి ఆకర్షణీయంగా వుండేవారు. చాలా ఓరిమి గలవారు. ఎంత అలసినప్పటికీ, రెప్ప వాలిస్తేచాలు ప్రఫుల్ల వదనంతో మళ్ళీ పనిలో నిమగ్న మయ్యేవారు. నిత్యమూ ఉదయానే లేచి కొంతసేపు యోగా భ్యాసం చేసేవారు. ఆరుగంటల కంటె ఎక్కువ నిద్రించేవారు కాదు. మిగిలిన కాలమంతా ప్రాణాయామం, ప్రార్థన, పుస్తక రచన, అధ్యయనం, ఉపన్యాసాలతో

గడిచేది. ఉదయమే చాలాదూరం వ్యాహ్యాళికి వెళ్ళడం, సభలకు సరైన సమయానికి చేరటం, మతానుష్ఠానాలు పాటించేటంత నియమంగా పాటించేవారు. ఆయన విశ్రాంతి ఎరుగరు. దుస్సాంగత్యాన్ని దగ్గరకు రానివ్వలేదు. స్త్రీలను దూరంగా వుంచేవారు. వారికి దర్శనమిచ్చేవారు కాదు. ఒకసారి బరోడా రాణి మూనాబాయి, ఆయనను దర్శించాలని కోరిక వ్యక్తం చేసినా, ఆయన అనుమతించ లేదు. తన నిష్కళంక బ్రహ్మచర్యంపై ఆయనకు గర్వం. ఆయన స్నానం చేసిన తర్వాత శరీరమంతా ముల్తానీ మట్టి రాసుకొనేవారు. కళ్ళకు బాహువులకు, గుండెలమీద, చందనం, అద్దుకొనేవారు. రెండు చెంపలు కప్పుతూ తలపాగా, తలకి చుట్టేవారు. పంచకట్టి శరీరం పైభాగం మీద శాలువా కప్పుకునేవారు.

ఆయన జీవితమంతా నియమ నిబంధనలతో గడిచింది. ఆయన పుష్టికరమైన మామూలు భోజనమే చేసేవారు. చివరి సంవత్సరాలలో రోజుకి ఒక్కసారి మాత్రమే భోజనం చేసేవారు. భోజనం చేసిన తర్వాత తమలపాకులు వేసుకొనటం ఆయనకు సరదా.

ఏదైనా వ్యసనంగా మారితే వదలటం కష్టం. అన్నం తినటం భంగు తీసుకోవటం హానికరం అని తెలుసుకొన్నాక ఆ రెండు అలవాట్లన్నీ ఒక్కసారిగా మానివేశారు. యాత్రలు చేస్తున్నప్పుడు హుక్కా పీల్చటం ఆయనకి అలవాటయింది. తరువాత భగీరథ పండితుడు చెప్పిన మాటలు విని ఆయన హుక్కా పీల్చడం మానివేశారు. కేశవ చంద్రసేన్ సలహాపై దయానంద మామూలు దుస్తులు ధరించటం, హిందీలో ఉపన్యసించటం మొదలుపెట్టారు.

ఆహార పానీయాల విషయంలో ఆయనకి కిష్టా యిష్టాలు లేవు. శాకాహార భోజనం ఏది లభ్యమైతే అది యిష్టంగా భుజించేవారు. ఒకసారి ఆయన ఉత్తరదేశంలో పశ్చిమ ప్రాంతాలలో పర్యటిస్తున్నప్పుడు ఒక మంగలి ఆయనకి భోజనం వండి తెచ్చాడు. చాలామంది ముక్కు మీద వేలు వేసుకొన్నా, ఆయనెంతో తృప్తిగా భుజించారు. 1874లో ఒకసారి ఆయన సూరత్ వెళ్ళినపుడు, మర్యాదలు చూసేవారి పొరపాటు వలన ఆయన భోజనానికి సరైన ఏర్పాట్లు జరుగలేదు. అందువల్ల ఆయన చాలారోజులు పులగమే తినవలసి వచ్చింది. కొన్ని రోజులు గడిచాక, అదీలేక పోయింది. ఆయన కూడా వున్న అనుచరుడు కృష్ణారామ్ ఇచ్చారామ్ ఈ విషయాన్ని పండిత నర్మదా శంకర్‌కి చెపితే అప్పుడు ఈయన ధనం సేకరించి దయానందుని భోజనానికి తగిన ఏర్పాటు చేశాడు. కాని ఇలా జరిగినదని దయానంద ఎవరితోనూ, ఎన్నడూ చెప్పలేదు. ఇలాంటివి పైకి

చెప్పటం నీచమని ఆయన భావించేవారు. చిన్న విషయానికి రాద్ధాంతం చేయటం అయనకిష్టముండేది కాదు. ఎలాటి పరిస్థితులలోనైనా ఆయన తృప్తిగా, ఆనందంగా వుండగలిగేవారు. అనూప శహర్ దగ్గర ఛలేశ్వర్‌లో 1872లో ఒకసారి ఆయన ఒక రైతు ఇచ్చిన మందంగా వున్న జొన్న రొట్టెలు సంతోషంగా ఇష్టంగా తిన్నారు.

సహజంగా అయనది దయగల హృదయం. చికాకు పడే స్వభావం గలవారు కాదు. ఆయన నెవరూ రెచ్చగొట్టగలిగేవారు కాదు. ఆయన సభల్ని భంగపరచాలని యత్నించిన గూండాలను మూర్ఖులను కూడా ఆయన క్షమించేవారు. అయనకి విషం ఇవ్వ ప్రయత్నించినవారి మీద కూడా అయన ఏమీ చర్య తీసుకోలేదు. అయన ఎంతో సాహసవంతుడు. భయమెరుగని వారు. 1868లో ఆయన కరషణవాస్‌లో వున్నపుడు కరష్ సింహ అనే అయన కత్తి దూశాడు. దయానంద అ కత్తిని రెండు ముక్కలు చేసి, గాభరా పడకుండా తన పనిలో తిరిగి నిమగ్నమయ్యారు.

మరొకసారి గంగానదీ తీరాన పర్యటిస్తూ దయానంద కారడివిలోనికి వెళ్ళిపోయారు. పెద్దపులి తారస పడింది. దయానంద వెనక్కి తిరిగి పోకుండా పులి వున్న వైపే ముందుకు సాగిపోయారు. అపుడు పులే వెనక్కి తిరిగి పరుగెత్తి అడవిలోకి పోయింది. నర్మదానది జన్మస్థలాన్ని వెతుకుతూ, వింధ్యాచలశ్రేణిలో చిన్న కాలిబాటపై దయానంద నడుస్తున్నారు. వెనుక పాదాల బలం మీద నిలబడిన భల్లూకం ఎదురుపడి మూతి పూర్తిగా విప్పి గుర్రుమన్నది. దయానంద కొట్టడానికి తన చేతికర్ర ఎత్తేసరికి భల్లూకం జారిపోయింది. ఒకసారి అయన గడ్డి కప్పిన గుడిసెలో మకాం చేస్తున్నారు. సమీపంలోనే గుడారాలలో వున్న సాధువులు కొంతమంది అయన గుడిసెకి నిప్పు పెట్టారు. బరువుగా వున్న గుడిసె కప్పును, ఆయన ఎత్తి ఒకవైపుకి పడవేసి బయటకి వచ్చారు. ఆ సాధువులిక కనపడలేదు. అయనెంతో బలవంతుడని చెప్పడానికి ఇలాటి సంఘటన లెన్నో వున్నాయి. యోగాభ్యాసం, బ్రహ్మచర్యం పాటించడం తన బలానికి కారణాలని అయన చెపుతూ వుండేవారు.

చాలాసార్లు అయనకి లాభసాటి పదవులు, పెద్ద మొత్తాలలో డబ్బు ఇవ్వజూపే వారు. కాని అయన ఎప్పుడూ వీటిని తిరస్కరించేవారు. ఉత్తర కాశీలోని బదరీనాథ్ దగ్గరున్న ఓఖీమఠం మహంతు పదవి, ఉదయపూర్‌లోని ఏక లింగ దేవాలయం మహంతు పదవి అయనను నిర్వహించమని కోరారన్న విషయం అందరికీ తెలిసినదే. చాలామంది ఎన్నోరకాల బహుమతులను, సహాయాన్ని అందిస్తామంటే ఆయన అంగీకరించ లేదు. విలువైన బహుమతులను అయనెప్పుడూ తిరస్కరించే వారు. అయన

చాలా తక్కువ ఖర్చు చేసేవారు. ఆయనకున్న అవసరాలే తక్కువ. ప్రజల ధనం విషయంలో ఆయన ఖచ్చితమైన లెక్కలు వ్రాసేవారు. ప్రజల సొమ్ము దుర్వినియోగం కావటం ఆయన సహించేవారు కాదు. ప్రతి పైసాకి లెక్క చూపించాలనేవారు. ఆయనకు చాలా నమ్మకస్తుడైన ఇంద్రమణి ధనం దుర్వినియోగం చేశాడని తెలిసి, అతనిని దయానంద ఆర్యసమాజం నుంచి బహిష్కరించారు. ఆయన స్వంత ఖర్చు చాలా తక్కువగా వుండేది. బజారులో సామాను కొనేటప్పుడు అనేక దుకాణాలలో సరుకుల ధరలు వాకబు చేయాలని పండిత భీమసేన్‌తో (1879 లక్నోలో) దయానంద చెప్పటం గుర్తుకు తెచ్చుకోవాలి.

ఎక్కువ ధనం వుంటే సమాజంలో నీతి, శీలం తగ్గిపోతాయని ఆయన అభిమతం. ధనవంతులు కావటంతో సోమరులై క్రియా శూన్యులవుతారనీ, బీదవారయితే సహజంగా వున్న చురుకుతనం, నైపుణ్యం పెరుగుతుందనీ, అందుచేత "ఆంగ్లేయులు ధనవంతులవుతున్నారనీ, భారతీయులు బీదవారయి పోతున్నారని, భారతీయులు కంగారు పడనక్కర్లేదనీ 1878లో అమృతసర్‌లో దయానంద ఉపన్యసిస్తూ అన్నారు. దయానంద సరైన వారిని తన మనుష్యులుగా ఎన్నుకొనలేక పోయారు. ఆయన జీవితంలో చాలాసార్లు 'సరైన వ్యక్తులు'కానివారి మీదనే నమ్మకముంచారు. ఆయనకీ అమాయకత్వం లేకుండా వుంటే ప్రారంభంలో శ్యాంజీ కృష్ణవర్మ, జోధ్‌పూర్ రాజా, మేడం బ్లావట్స్కీ, కల్నల్ ఆల్‌కాట్, పండిత ఇంద్రామణి లాంటి వారి ప్రభావానికి ఆయన లోనయ్యేవారు కాదు. చివరికి వీరందరూ ఆయనతో విడి పోయారు, సిఫార్సులకు ఆయన వ్యతిరేకి. ఆశ్రితులను ఆదుకోవటం ఆయనకు నచ్చదు.

దయానందుని పేరు వినగానే తేజోమయ దేశ భక్తుడు, తీవ్ర సామాజిక విప్లవాది అయిన అద్భుత తపస్వి యొక్క సజీవ మూర్తి మన మనస్సులో మెదులుతుంది.

హిందూ సమాజంలో ఉత్తరోత్తరా వచ్చి శతాబ్దాలుగా దాటివున్న దోషాలను తొలగించి హిందూ సమాజానికి కొత్త వూపిరి పోసేయత్నంలోనే ఆయన జీవితమంతా నిమగ్నమయ్యారు. విసుగు చెందని ఈ కృషి వలన సమాజ ప్రగతికి అవరోధం కలిగిస్తున్న యుగయుగాల సాంప్రదాయాల సంకెళ్లు వదులయినాయి. శతాబ్దాలుగా ఎంతోమంది హిందువుల మనసులో పెరిగిన విశ్వాసాల పట్ల, మూఢనమ్మకాల పట్ల సిద్ధాంతాల పట్ల ఆయన సంశయం రగిలించారు.

దేశవాసుల ఆధ్యాత్మిక క్షితిజ రేఖపై ఎంతో కాలంగా వ్యాపించి వున్న అజ్ఞానం, పిరికితనమనే పొగమంచును చెల్లా చెదురు చేసి, మహిమగలిగిన గత కాలమంటే

వారిలో గౌరవం ఆదరణ ఆయన కలిగించారు. హిందువులలో పాదుకొని వున్న జడత్వం గురించి వారికే తెలియపరిచి, వారిలో కొత్త సాహసం, ఆశ, కదలాడేలా చేశారు. వైదిక ధర్మాన్ని పునరుజ్జీవింపచేయడానికి ఆయన శంఖం పూరించారు. ఆ నాదంతో హిందువులలో- వైదిక ఆవరణంలో తమ జీవితాలను రక్షించు కొనవలెననే ఆశ మేల్కొన్నది.

హిందూ సమాజాన్ని, తిరిగి మేలుకొలిపే ఆయన అసాధారణ సేవల వల్లననే ఆయనని అందరూ స్మరిస్తారు. ఆధునిక భారతదేశంలో ధార్మిక నాయకులలో, సంఘ సంస్కర్తలలో ఆయనకు గల స్థానం సర్వోన్నతమైనది. చరిత్రలో ఆయనను 19వ శతాబ్దంలోని మహా దేశ భక్తులలో అందరికంటె మిన్నగా పరిగణిస్తారు.

1883 జాతీయ రంగంలో దయానంద నిష్క్రమించిన వెనువెనుకనే ఆధ్యాత్మిక జాగృతి, సాంఘిక విప్లవం, అకళంక దేశభక్తి యుగం ఆరంభమయింది. 19వ శతాబ్దపు మొదటి మూడు పాదాలలో అక్కడక్కడా తలెత్తుతూ వచ్చిన జాతీయ పునఃవికాసానికిది బాటవేసింది. ఈ నవయుగో దయంలో దయానంద పాత్ర చాలా వుంది. ఆర్య సమాజ స్థాపన వల్ల క్రొత్త శక్తులు ఆవిర్భవించి పాదుకొన్నాయి. వైదిక జీవనం పట్ల వైదిక ధర్మంపట్ల ప్రజలలో ప్రగాఢమైన అభిరుచి కలిగింది. మేక్స్ ముల్లర్, మోనియర్ విలియమ్స్, రామకృష్ణ గోపాల్ భాండార్కర్, శ్యాంజీ కృష్ణవర్మ వంటి విద్వాంసులు వేదాలను విపులార్థాలతో అధ్యయనం చేయడానికి, అవగతం చేసుకొనడానికి దయానంద వల్లనే ప్రేరణ లభించినది. 19వ శతాబ్దపు చరమ భాగంలో భారతదేశపు అంధకార క్షితిజంపై ఉదయించిన కొద్ది నక్షత్రాలలో స్వామి దయానంద ప్రసరించిన కాంతిరేఖ నేటి వరకూ దేశభక్తి పథంలో, ఆధ్యాత్మిక భావమార్గంలో భారతీయులకు దారి చూపుతూనే వుంది. దయానందునికి పూర్ణాయుర్దాయం లేకపోయింది. అయినా బ్రతికిన కొద్ది కాలంలో జరిగిన సంఘటనల స్మృతి అంత తేలికగా కాలగర్భంలో కరిగిపోయింది. సాంఘిక, ఆధ్యాత్మిక పునర్వికసనం కోసం ఆయన పడిన ఆందోళనకు చిహ్నమే ఆర్య సమాజం. 1883లో ఆయన అకాల మరణం వలన ఏర్పడిన లోటు ఈనాటివరకూ తీరలేదంటే మన దేశ వాసులను లౌకికంగా నైతికంగా ఉద్ధరించడానికి ఆయన చేసిన కృషి అద్వితీయమని తెలుస్తున్నది. పాశ్చాత్య నాగరికత అనే వరదని ఆపి, ఎండిన భారతీయ సంస్కృతి శిరలలో క్రొత్త రక్తాన్ని ప్రవహింపచేసి భారతీయుల గుండెలలో క్రొత్త ఆశలని కోరికలని ఆయన తట్టిలేపారు. వైదిక సంస్కృతి, మానవాళికి లభించిన అత్యుత్తమ సంస్కార రూపం అని ఆయన భావించారు. కనుకనే వైదిక

సంస్కృతికి మనం వారసులమని గర్వించటం నేర్పారు.

శీలాన్ని పెంపొందించుకొనటం కోసం కిశోర ప్రాయంలోనే ఆయనలా బ్రహ్మచర్యం అవలంబించిన వారు కాని, ఆత్మత్యాగం చేసినవారు కాని, సత్యాన్ని జ్ఞానాన్ని గొప్పగా భావించి, ప్రజా సేవలో నిజాయితీగా నడవాలనుకున్నవారు కాని, ఆయన తర్వాత బహు తక్కువగా వున్నందుకు ఎంతో విచార పడాలి. దయానందునిది పోట్లాడే తత్వమని, పునర్ జాగృతం చేసే దృక్పధం మాత్రమే కలవారని ఆరోపించటం ఉచితమూ కాదు, న్యాయమూ కాదు. ఎందుచేతనంటే ఆయన కాలంనాటి కుళ్ళిమగ్గిన సాంఘిక వ్యవస్థను, మదాంధులను సవాలు చేయడానికి తాను నమ్మిన వాటిని గౌరవించారు. ఎన్నో విషయాలపై సమకాలీన విమర్శకులతో ఆయనకు నిరోధమున్నా ఆయన అవలోకించిన నిజాన్ని, గ్రహించిన సత్యాన్ని నిష్టతో పాటించగలిగే వారు. కనుకనే ప్రగతి నిరోధకుల అధోజగతిలోని అన్యాయాలను, అసమానతలను రూపుమాపడానికి ఆయన ఎన్నో గొప్ప పనులు చేయగలిగారు. అరవిందఘోషు దయానందుని గురించి "ఆయన వెలుగు నిచ్చే సైనికుడు, దేవదత్త యోధుడు, పని చేసే మనుషులను సంస్థలను నిర్మించిన స్రష్ట. భౌతిక అధ్యాత్మిక తత్వాల మధ్య రగిలిన పోరాటంలో నెగ్గిన ప్రజల విజేత, అలాగే- ఈశ్వరుడు నివసించే ఆత్మగల మనిషి - ఆ కళ్ళలో సుదూర స్వప్నాలు. ఆ చేతులలో- జీవన శిలను చెక్కి తుంచి, ఆ స్వప్నాల కనుగుణంగా రూపాన్ని నిర్మించగల శక్తి" అని సరిగానే చెప్పారు.

---

Laser typesetting at Visalaandhra, Vijayawada - 520 004 and printed at
Shivam Offset Press, Naraiana Phase-1, New Delhi - 110 028